అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

శనివారం 17-08-2024

సంపుటి : 10 | సంచిక : 229 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు | వెల : 6.50

మోగిన మరో నగారా

హర్యానా, జమ్మూకాశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలకు షెడ్యూల్ విడుదల

హర్యానాలో ఒకే దశలో పోలింగ్

జమ్మూకాశ్మీర్‌లో మూడు దశల్లో..

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు షెడ్యూల్ ఎందుకు ఇవ్వలేదు?

గతంలో హర్యానా, మహారాష్ట్రకు ఒకేసారి ఎన్నికలు 13లో..



బీజేపీలో బీఆర్ఎస్ విలీనం తథ్యం

కేసీఆర్‌కు గవర్నర్, కేటీఆర్‌కు మంత్రి పదవి

అపోజీషన్ లీడర్‌గా హరీశ్‌రావు

నలుగురు రాజ్యసభ సభ్యుల విలీనంతో కవితకు బెయిల్ : సీఎం రేవంత్ రెడ్డి

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

బీజేపీలో బీఆర్ఎస్ విలీనానికి సంబంధించి బేరసారాలు జరుగుతున్నాయని, ఎప్పటికైనా బీజేపీలో బీఆర్ఎస్ విలీనం తథ్యమని సీఎం రేవంత్ రెడ్డి హాట్ కామెంట్స్ చేశారు. ఈ విలీనంలో... 6లో

ఫోర్త్ సిటీలో పెట్టుబడులు పెట్టండి

అన్ని రకాల మద్దతు అందిస్తాం

ఫాక్స్‌కాన్ సంస్థ ప్రతినిధులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

త్వరలోనే హైదరాబాద్‌ను సందర్శిస్తా : చైర్మెన్ యంగ్ లియూ

వివరాలు 13లో



జాతీయ ఉత్తమచిత్రం ఆట్టమ్



ఉత్తమ నటీనటులు 14లో..

రిషబ్‌శెట్టి నిత్యామీనన్ మానసి పరేఖ్

రాజుకుంటోంది

కోల్‌కతా హత్యాచార ఘటనపై భగ్గుమంటున్న దేశం



- రోడ్డెక్కిన వైద్యులు, నర్సులు
- న్యాయం జరిగేదాకా పోరాటమే : వైద్యసంఘాలు
- నేడు ఓపీ సేవల బంద్‌కు (ఐఎంఏ)పిలుపు
- కోల్‌కతాలో బీజేపీ, టీఎంసీల మధ్య ఘర్షణ

కోల్‌కతాలోని ఆర్‌జీ కార్ వైద్యశాలలో ట్రైయినీ వైద్యురాలిపై హత్యాచార ఘటనతో దేశం భగ్గుమంటోంది. వైద్యులు, నర్సులు రోడ్డెక్కడంతో ఆందోళనలు ఉధృతమవుతున్నాయి. న్యాయం జరిగే దాకా పోరాటం చేస్తామంటూ వైద్యసంఘాలు అల్టిమేటం ప్రకటించాయి. ఇప్పటికే ఆస్పత్రుల్లో సేవలు అంతంత మాత్రంగా అందుతున్నాయని రోగుల బంధువులు ఆందోళన చెందుతున్నారు. శనివారం ఓపీ సేవలు నిలిపివేయాలని వైద్య సంఘాలు పిలుపునిచ్చాయి. మరోపక్క హత్యాచార ఘటనను వదిలేసి కోల్‌కతాలో బీజేపీ, టీఎంసీ శ్రేణులు బాహాబాహీకి దిగటంతో రాజకీయం వేడెక్కుతోంది. వివరాలు 3లో..

ఆనవాళ్లు చెరిపే కుట్ర

ముమ్మాటికీ.. ఇది టీఎంసీ గుండాల బరితెగింపే



కాపాడాల్సిన పోలీసులే ప్రేక్షకపాత్ర వహించారు

ముఖ్యమంత్రిని కూడా విచారించాలి: బృందాకరత్ డిమాండ్

కోల్‌కతా మెడికో హత్యాచార ఘటనపై పశ్చిమ బెంగాల్‌లోని తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర నిర్లక్షాన్ని ప్రదర్శిస్తోందని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్ విమర్శించారు. పోలీసుల నిర్లక్ష్యమే దేశవ్యాప్తంగా వైద్యుల ఆందోళనకు కారణమైందన్నారు. తొలుత ... 3లో


మీరేం చేస్తున్నారు..?



మమత సర్కార్‌పై హైకోర్టు మండిపాటు

ఆర్‌జీ కార్ ఆస్పత్రిలో దుండగుల విధ్వంసంపై తీవ్రంగా స్పందన 3లో..

అశాంతి సృష్టించడానికే : మమత



రాష్ట్రంలో అశాంతిని సృష్టించడానికే బీజేపీ ఈ విధ్వంసానికి పాల్పడిందని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆరోపించారు. తాను ఈ విషయంలో విద్యార్థులు, ఆందోళన చేస్తున్న డాక్టర్లను తప్పుబట్టడం లేదని అన్నారు. ఆర్‌జీ కార్ ఆస్పత్రిలో విధ్వంసం సృష్టించింది బయటివారేనని తెలిపారు. బాధిత మహిళా డాక్టర్‌కు న్యాయం జరగాలంటూ తాను వీధుల్లోకి రానున్నట్టు ఆమె ప్రకటించారు.

తెగ తాగేస్తున్నారు

మద్యం మత్తులో అరుణాచల్ ప్రదేశ్ ఫస్ట్

ఆ రాష్ట్రంలో 52.6 శాతం మంది మందుబాబులు

తర్వాతి స్థానంలో తెలంగాణ

ఇక్కడ 43.4 శాతం మద్యం ప్రియులు

అతి తక్కువ తాగుబోతుల రాష్ట్రంగా లక్షద్వీప్

జాతీయ కుటుంబ సర్వేలో వెల్లడి

రోడ్డుపాలవుతున్న నిరుపేద కుటుంబాలు

లాభర్జనే ధ్యేయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

పట్టించుకోని ఎక్సైజ్ శాఖ అధికారులు

దేశంలోని ఆయా రాష్ట్రాలు మద్యం మత్తులో తూగుతున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోనే మద్యం సేవించే వారి సంఖ్య గణనీయంగా ఉంది. దీంతో పొట్టకూటి కోసం కూలీనాలి చేసుకుని జీవించే కుటుంబాల పరిస్థితి దారుణంగా తయారైంది. ఈ వ్యసనానికి బానిస కావడంతో మందుబాబుల కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులతో రోడ్డున పడుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లాభార్జనే ధ్యేయంగా వ్యవహరిస్తుండగా పట్టించుకోవాల్సిన ఎక్సైజ్ శాఖ చూసీ చూడనట్టు వ్యవహరిస్తోంది. దీంతో వారి చావులు, ఆత్మహత్యలతో మరణ మృదంగం మోగుతోంది.



భారతదేశంలో జాతీయ కుటుంబ సంక్షేమంపై కేంద్ర కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ సర్వే చేయించింది. జాతీయ కుటుంబ సంక్షేమ సర్వే ప్రతి మూడేండ్లకోసారి నిర్వహిస్తారు. మార్చి 2022లో ప్రచురితమైన ఈ అధ్యయనం 2019 నుంచి 2021 వరకు మూడేండ్ల డేటాను తెలియజేస్తున్నది. ఈ సర్వేలో మద్యం వినియోగానికి సంబంధించి ఆసక్తికర విషయాలు ... 13లో

ఎల్ఆర్ఎస్ తీసుకోండి

కీలక ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

2020 ఆగస్టు 26 కంటే ముందు రిజిస్టర్ చేసిన లేఅవుట్లకే అనుమతి

పాత దరఖాస్తుదారులకే వర్తింపు



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

గత ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్ఆర్ఎస్)కు దరఖాస్తు చేసుకొని, వివిధ కారణాలతో నిలిచిపోయిన ఫైళ్లను క్లియర్ చేసేలా ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి శుక్రవారం ఎల్ఆర్ఎస్ సంబంధించిన గైడ్‌లైన్స్‌ను విడుదల చేశారు. రాష్ట్రంలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో 2020 ఆగస్టు 26వ తేదీ కంటే ముందు రిజిస్టర్ చేసిన అనుమతిలేని, చట్టవిరుద్ధమైన లే అవుట్లు, ప్లాట్లను క్రమబద్ధీకరించుకొనేలా తాజా ఉత్తర్వులు విడుదల చేశారు. దీనికి సంబంధించి 2020 అక్టోబర్ 15 వరకు వచ్చిన దరఖాస్తులకు కూడా ఎల్ఆర్ఎస్ ... 13లో

రుణమాఫీపై దృష్టి మరల్చే యత్నం

అందుకే సీఎం గావుకేకలు, పెడబొబ్బలు

40 శాతం మందికి చేసి.. అందరికీ అమలైనట్టు చెబుతున్నారు

ఇది దేశంలోనే అతి పెద్ద జోక్ : కేటీఆర్

రాష్ట్రంలోని ఏ నియోజకవర్గంలోనైనా చర్చిద్దామంటూ సవాల్

నూటికి నూరు శాతం రుణమాఫీ అయితే తన పదవికి రాజీనామా చేస్తానంటూ వ్యాఖ్య

'ఉచిత బస్సు ప్రయాణం'పై మహిళలకు క్షమాపణలు



6లో..

అక్టోబర్ 21 నుంచి గ్రూప్-1 మెయిన్స్

27 వరకు నిర్వహణ

సమయపాలనలో మార్పు

మధ్యాహ్నం 2 నుంచి 5 వరకు పరీక్షలు

నేటినుంచి వెబ్‌సైట్‌లో నమూనా జవాబు పత్రాలు : టీజీపీఎస్సీ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో గ్రూప్-1 మెయిన్స్ రాతపరీక్షలు అక్టోబర్ 21 నుంచి ప్రారంభమవుతాయి. అదేనెల 27 వరకు హెచ్ఎండీఏ పరిధిలో జరుగుతాయి. ఈ మేరకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) కార్యదర్శి నవీన్ నికోలస్ శుక్రవారం షెడ్యూల్‌ను విడుదల చేశారు. అక్టోబర్ 21 నుంచి 27 వరకు గ్రూప్-1 మెయిన్స్ రాతపరీక్షల సమయపాలనలో మార్పులు ... 7లో

ఎమ్మెల్సీలుగా కోదండరాం,అమీర్ అలీఖాన్

ప్రమాణం చేయించిన శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి హాజరు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

తెలంగాణ జనసమితి అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం, సియాసత్ న్యూస్ ఎడిటర్ అమేర్ అలీ ఖాన్‌లు ఎమ్మెల్సీలుగా ప్రమాణ స్వీకారం చేశారు. గవర్నర్ కోటా కింద ఎమ్మెల్సీలుగా ఎన్నికైన వారితో శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. కాగా ఈ కార్యక్రమానికి మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కోదండరాం మాట్లాడుతూ తాను ఎమ్మెల్సీ కావడానికి సహకరించిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్సీ కావడంతో తనపై బాధ్యత మరింత పెరిగిందన్నారు. ఎమ్మెల్సీ తనకు పదవి కాదనీ, సేవ అని పేర్కొన్నారు. అమరుల ఆకాంక్షలు నెరవేర్చడానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. అందరం కలిసి పని చేయడం ద్వారా ప్రజల సమస్యలకు పరిష్కారం



చూపిద్దామని సూచించారు. తనకు చేతనైన కాడికి ఉద్యమ ఆకాంక్షలు నెరవేర్చేందుకు పని చేస్తానని అన్నారు. తనను మంత్రివర్గంలో తీసుకుంటారని జరుగుతున్న ప్రచారంపై స్పందించేందుకు ఆయన నిరాకరించారు. అధికారం అనుభవించడానికి తాను ఎమ్మెల్సీ కాలేదని.. ఇది ఒక కొత్త అనుభవం అని పేర్కొన్నారు. ఇప్పుడున్న యంత్రాంగంలో చేరి ఎలా పని చేయాలో ఆలోచిస్తున్నానని అన్నారు. తానేమీ కత్తి పెట్టి బెదిరించి ఎమ్మెల్సీ ... 13లో

నిబంధనలకు సెబీ చీఫ్ పాతర

దేశీయ స్టాక్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ చైర్‌పర్సన్ మాధాబీ పురీ బచ్ నిబంధనలను ఉల్లంఘించారు. 2017లో సెబీ హోల్‌టైం సభ్యురాలిగా చేరినప్పటి నుంచి కూడా రెగ్యూలేటరీ సంస్థ నిబంధనల కు విరుద్ధంగా ఓ కన్సల్టెన్సీ సంస్థ నుంచి ఆదాయాలను ఆర్జిస్తున్నట్టు వెల్లడయ్యింది. సెబీలో డైరెక్టర్లు, చైర్మెన్‌గా ఎంపికయ్యేవారు వారు సొంతగా ఎలాంటి కన్సల్టెన్సీలు కలిగి ఉండరాదు. దీనికి భిన్నంగా 2022లో సెబీ చైర్‌పర్సన్‌గా నియమితులైన తర్వాత కూడా మాధాబీ పురీ బచ్ రెగ్యులేటరీ నిబంధనలను ఉల్లంఘించి ఆదాయాలను పొందుతున్నారని పబ్లిక్ డాక్యుమెంట్స్ ఆధారంగా రాయిటర్స్ ఓ రిపోర్ట్‌ను వెల్లడించింది.

- కన్సల్టెన్సీతో ఏడేండ్లుగా ఆదాయం : డాక్యుమెంట్లతో వెల్లడించిన రాయిటర్స్
- హిండెన్‌బర్గ్ రిపోర్ట్‌కు మరింత బలం
- మరిన్ని చిక్కుల్లో మాధాబీ బచ్ కుటుంబం

న్యూఢిల్లీ : విదేశాల్లోని అదానీ అనుబంధ సంస్థల్లో సెబీ చైర్‌పర్సన్ మాధాబీ పురీ బచ్, ఆమె భర్త ధావల్ బచ్ పెట్టుబడులు పెట్టారని హిండెన్‌బర్గ్ ఇటీవల ఓ రిపోర్ట్‌లో తెలిపింది. బెర్ముడా, మారిషస్ వంటి అఫ్ షోర్ కంపెనీల్లో, అందునా గౌతం అదానీ సోదరుడు వినోద్ అదానీ ఆధ్వర్యంలోని ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ సంస్థల్లో బచ్ కుటుంబం పెట్టుబడులను కలిగి ఉందని తెలిపింది. అదానీ గ్రూపు సంస్థల్లో పెట్టుబడుల తీరును సమీక్షించాల్సిన సెబీ చైర్‌పర్సన్‌కు వాటిల్లో వ్యక్తిగత పెట్టుబడులు, ఇతర స్పాన్సర్ల నిధులు ఉన్నాయని.. ఇది విరుద్ధ ప్రయోజనాల అంశం కిందకు వస్తుందని హిండెన్‌బర్గ్ ఆరోపించింది. సెబీ చైర్‌పర్సన్‌గా



కొనసాగుతూనే మాధాబి కన్సల్టింగ్ సంస్థలను నడుపుతున్నారని..ఈ నిజాలను నిగ్గు తేల్చాలని హిండెన్‌బర్గ్ తీవ్ర ఆరోపణలు చేసింది. ఈ తరుణంలో రాయిటర్స్ తాజా రిపోర్ట్ హిండెన్‌బర్గ్ ఆరోపణలకు మరింత బలాన్ని చేకూర్చింది.

సింగపూర్ కేంద్రంగా పని చేస్తున్న అగోరా పార్టనర్స్, భారత్ కేంద్రంగా పని చేస్తున్న అగోరా అడ్వైజరీ సంస్థలను మాధాబీ పురీ బచ్ దంపతులు నిర్వహిస్తున్నారని హిండెన్ బర్గ్ ఆరోపించింది. రాయిటర్స్ ప్రకారం.. "గడిచిన ఏడేండ్ల కాలంలో అగోరా అడ్వైజరీ సంస్థలో 99 శాతం వాటాలు బచ్ దంపతులవే. దీని ద్వారా రూ.3.71 కోట్ల ఆదాయం సంపాదించారని రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీల వద్ద నమోదైన సమాచారం బయటపడింది. సెబీ పూర్తికాల సభ్యులుగా నియమితులైన తర్వాత ఆఫీస్ ఆఫ్ ప్రాఫిట్ గానీ, వేతనం గానీ, ఇతర వృత్తి నైపుణ్య ... 13లో

తీవ్రమైన ఉల్లంఘన

బచ్ పదవీకాలంలో సెబి బోర్డు సభ్యుడుగా ఉన్న కేంద్ర ప్రభుత్వ మాజీ కీలక అధికారి సుభాష్ చంద్ర గార్గ్ సెబి చీఫ్ మాధాబి చర్యలను తీవ్రంగా విమర్శించారు. మాధాబి వ్యాపార కార్యకలాపాలను చాలా తీవ్రమైన ఉల్లంఘనగా అభివర్ణించారు. సెబి బోర్డులో చేరిన తర్వాత ఆమె బయటి సంస్థను కొనసాగించడానికి ఎటువంటి సమర్థన లేదు. విషయం బయటికి వచ్చిన తర్వాత ఆమెను కొనసాగించడాన్ని అనుమతించకూడదని అన్నారు. ఆమె తన వ్యాపార ప్రయోజనాలను బోర్డుకు తెలుపలేదన్నారు. కాగా.. రాయిటర్స్ రిపోర్ట్‌పై సెబి, బచ్ కుటుంబం కానీ స్పందించలేదు.

- సుభాష్ చంద్ర

ఎస్ఎస్ఎల్‌వీ-డీ3 ప్రయోగం సక్సెస్

ఇస్రో ఖాతాలో మరో ఘనత



శ్రీహరికోట : ఇస్రో చేపట్టిన ఎస్ఎస్ఎల్‌వీ-డీ3 ప్రయోగం విజయవంతమైంది. తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని షార్ నుంచి ఈ వాహక నౌక నింగిలోకి దూసుకెళ్లింది. ఈ ప్రయోగం ద్వారా 175 కిలోల ఈవోఎస్-08 ఉపగ్రహాన్ని విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టారు. మొత్తం 17 నిమిషాల పాటు ఈ ప్రయోగం సాగింది. విపత్తు నిర్వహణలో సమాచారం ఇచ్చేందుకు ఈ ఉపగ్రహం ఉపయోగపడనుంది. పర్యావరణం, ప్రకృతి విపత్తులు, అగ్ని ... 13లో

డీఎస్పీ, ఆపైస్థాయి అధికారుల పనితీరుపై డీజీపీ నిశిత దృష్టి

నెలకోసారి సమీక్షించాలని అంతర్గత నిర్ణయం

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి - హైదరాబాద్

రాష్ట్రంలోని డీఎస్పీ, ఆపై స్థాయి అధికారుల పనితీరు, వ్యవహార శైలిపై రాష్ట్ర డీజీపీ డాక్టర్ జితేందర్ నిశిత దృష్టి సారించారని తెలిసింది. నాయకత్వ శ్రేణికి చెందిన డీఎస్పీలు, అదనపు ఎస్పీలు, ఎస్పీలు, ఐపీఎస్ అధికారుల పనితీరును మదింపు చేయడం ద్వారా రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితితో పాటు నేరాల అదుపునకు సంబంధించి పూర్తి సమీక్ష జరిపినట్టు అవుతుందని ఆయన భావిస్తున్నట్టు తెలిసింది. రాష్ట్రంలో శాంతి భద్రతల పరంగా ఎక్కడ సమస్య తలెత్తినా, ఘరానా నేరాలు చోటుచేసుకున్నా వాటిని నియంత్రించాల్సిన బాధ్యత స్థానిక పోలీస్‌స్టేషన్ల సీఐలు, ఎస్‌ఐలు మొదలుకొని కిందిస్థాయి సిబ్బందిపైనే ఉంటుందని చెబుతూ వారిపైనే నెపాన్ని మోపే ప్రయత్నాలు ఉన్నతస్థాయిలో జరుగుతున్నాయని ఆరోపణలున్నాయి. మంచి జరిగితే తాము చేశామనీ, తేడా వస్తే తమకేం సబంధంలేదన్నట్టు కిందివారిపై నెట్టివేసే ధోరణి ఎక్కువగా ప్రబలటం మంచిది కాదనే అభిప్రాయంతో డీజీపీ ఉన్నట్టు తెలిసింది. పోలీసు శాఖలో మంచి ఫలితాలు సాధించడానికి కానిస్టేబుల్ నుంచి ఐపీఎస్ అధికారుల వరకు సమిష్టి కృషి, సమన్వయం ద్వారానే సాధ్యపడుతుందని భావించే అధికారుల్లో జితేందర్ ఒకరు. అయితే, ఇటీవల రాష్ట్రంలో కొన్ని ప్రాంతాల్లో హత్యలు ఎక్కువగా చోటుచేసుకోవడం, సైబర్‌నేరాలు పెరగడం, గంజాయి, ఇతర మాదకద్రవ్య పదార్థాల రవాణా పెరగడం పట్ల ఇటీవల జరిగిన ఎస్పీలు, కమిషనర్ల సమావేశంలో ఆయన ఎత్తిచూపారు. ఈ నేపథ్యంలోనే జిల్లాలు మొదలుకొని నగరాల వరకు నాయకత్వ శ్రేణిలోని పోలీసులు ఉన్నతాధికారులు కిందిస్థాయి అధికారుల పనితీరును ఎప్పటికప్పుడు సమీక్షిస్తే పరిస్థితులు మరింత మెరుగవుతాయనీ, ప్రభుత్వం ఆశిస్తున్న ఫలితాలను సాధించగలుగుతామని డీజీపీ భావిస్తున్నట్టు తెలిసింది. దీనిని సక్రమంగా అమలు చేయాలంటే డీఎస్పీ నుంచి పై స్థాయి అధికారుల పనితీరును కిందిస్థాయి అధికారులతో వ్యవహరించే శైలిని, వారిలో ఉన్న సమన్వయ తత్వాన్ని నెలా, రెండు నెలకోసారి క్షుణ్ణంగా సమీక్షించడం ద్వారా పరిస్థితుల్లో మార్పులు తీసుకురావచ్చని ఆయన భావిస్తున్నట్టు తెలుస్తున్నది. ఇందుకోసం ఒక కార్యాచరణను ఆయన రూపొందించి అమలు చేయబోతున్నట్టు విశ్వసనీయ సమాచారం.

ఏజెన్సీల్లో రోడ్ల నిర్మాణానికి కేంద్రం అనుమతులు

- 66.97 కిలోమీటర్ల రహదారులకు గ్రీన్‌సిగ్నల్ :

హర్షం వ్యక్తం చేసిన మంత్రి డాక్టర్ సీతక్క

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఏజెన్సీ ప్రాంతాల్లో ఉన్న మారుమూల ఆవాస గ్రామాలకు రహదారుల సౌకర్యం కల్పించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ(సీతక్క) చేసిన విజ్ఞప్తికి కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. తొలి విడతలో పీఎం జన్మన్ పథకం కింద ఏజెన్సీ పరిధిలోని 28 ఆవాస గ్రామాల్లో 66.97 కిలోమీటర్ల రోడ్ల విస్తరణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు పరిపాలనాపరంగా అనుమతులు జారీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖను పంపింది. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌తో జూన్ 22న సీతక్క సమావేశం అయిన విషయం విదితమే.

ఆ సమయంలో ఏజెన్సీలో ఆవాస గ్రామాల్లో రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని సీతక్క విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కేంద్రం ఈ నిర్ణయం తీసుకున్నది. త్వరలో ఆయా గ్రామాల రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి. కేంద్రం నిర్ణయం పట్ల మంత్రి సీతక్క హర్షం వ్యక్తం చేశారు. మారుమూల ఆవాస గ్రామాలకు మరిన్ని రోడ్లను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

సెమీ స్కిల్ కార్మికులకు విదేశీ ప్లేస్‌మెంట్

- తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సెమీ స్కిల్ కార్మికులకు విదేశీ ప్లేస్‌మెంట్స్ సులభతరం చేసేందుకు కృషి జరుగుతున్నదని తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్‌కామ్) సీఈఓ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జర్మనీలో ఆరోగ్య సంరక్షణ కార్మికులకు ముఖ్యంగా నర్సులకు అధిక డిమాండ్ ఉన్న నేపథ్యంలో టామ్‌కామ్ జర్మనీలో చదువుకోవడానికి, నర్సింగ్‌లో మూడు సంవత్సరాల ఇంటర్నేషనల్ డిగ్రీని పొందేందుకు అవకాశాలను అందిస్తోందని పేర్కొన్నారు. ఆకర్షణీయమైన జీతం ప్యాకేజీతో నర్సుగా ఉద్యోగ హామీ ఇస్తుందని తెలిపారు. కనీసం 60శాతం మార్కులతో ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత, 30 సంవత్సరాల వయస్సు గల ఎంపికైన అభ్యర్థులను జర్మనీలో ఉంచడానికి ముందు హైదరాబాద్‌లో జర్మన్ భాషలో ఆరు నెలల రెసిడెన్షియల్ శిక్షణ అందించనున్నట్టు తెలిపారు. వివరాల కోసం 63022927450/ 7901290580ని సంప్రదించాలని సూచించారు. రెజ్యూమ్‌ని tomcom. germanytpgmail.com ఈ నెల 30లోగా మెయిల్ చేయాలని సూచించారు. www. tomcom. telan- gana.gov.in టామ్ కామ్ యాప్ ను సందర్శించాలని సూచించారు.

ఎర్రకోట వేదికగా...

గత పదేండ్లలో ఒక్కోసారి ఒక్కో అంశాన్ని హైలెట్ చేస్తూ ప్రసంగం

ఆచరణలో మాత్రం కనబడని వేగం : నిపుణులు, మేధావులు



న్యూఢిల్లీ : 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నెహ్రూ, ఇందిరా గాంధీల తర్వాత వరుసగా 11వసారి ఎర్రకోట నుంచి జాతీయ జెండాను ఎగరవేశారు మోడీ. అనంతరం ఆయన జాతినుద్దేశిస్తూ ప్రసంగించారు. అయితే, గతంలోనూ ఆయన జాతీయ జెండాను ఎగురవేసిన అనంతరం కొన్ని ప్రకటనలు చేయటం, వాగ్దానాలివ్వటం, పథకాలను ప్రకటించేవారు. ఎర్రకోటను బీజేపీ సైద్ధాంతికతను నొక్కి చెప్పటానికి కూడా వేదికగా ఉపయోగించుకునేవారు. గత పదేండ్లలో ఆయన ప్రసంగాలలో కీలకాంశాలపై దృష్టి సారిస్తే.. ఒక్కో సారి ఒక్కో అంశాన్ని హైలెట్ చేయటం కనిపిస్తుంది.

2014 ఎన్నికలలో కాంగ్రెస్‌ను ఓడించి కేంద్రంలో అధికారంలోకి వచ్చారు మోడీ. అయితే, ఆ ఏడాది తొలిసారిగా ఎర్రకోట పైనుంచి జెండాను ఎగురవేసి ప్రసంగించారు. తనను తాను ఉన్నత వర్గాల నుంచి ఒంటరిగా ఉన్న వ్యక్తిగా మోడీ ప్రకటించుకున్నారు. తన తొలి స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో మోడీ తన పూర్వీకులను గుర్తించారు. అందరు ప్రధానులు, అన్ని ప్రభుత్వాలు, అన్ని రాష్ట్రాల ప్రభుత్వాల సహకారం కారణంగా దేశం ఎలా వెనకకు పోయిందోనన్న విషయం వివరించారు. జన్-ధన్ యోజన, స్కిల్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా, డిజిటల్ ఇండియా, స్వచ్ఛ భారత్, సన్సద్ ఆదర్శ్ గ్రామ్ యోజన, నిటి ఆయోగ్‌తో ప్రణాళికా సంఘాన్ని భర్తీ చేయటం వంటి ఏడు కార్యక్రమాలను ప్రకటించారు.

2015లో తన రెండో ప్రసంగంలో, మోడీ కొన్ని పథకాలను ప్రకటించారు. స్టార్ట్-అప్ ఇండియా, స్టాండ్-అప్ ఇండియా, రాబోయే 1,000 రోజుల్లో 18,000 గ్రామాలకు విద్యుదీకరణ, సీ అండ్ డీ సమూహాలలో ఉద్యోగార్థులకు ఇంటర్వ్యూలను రద్దు చేయటం, కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి వచ్చిన వారసత్వ సమస్యలను పరిష్కరించటం వంటివి ఇందులో ఉన్నాయి. ప్రత్యేకించి, సాయుధ బలగాలకు వన్ ర్యాంక్, వన్ పెన్షన్‌ను అంగీకరిస్తున్నట్టు ప్రకటించాడు. వేలం యంత్రాంగాన్ని ఏర్పాటు చేయటం ద్వారా సహజ వనరులైన బొగ్గు, ఖనిజాలు, స్పెక్ట్రమ్ కేటాయింపులో గందరగోళాన్ని ఎలా తొలగించాలనే దానిపై సుదీర్ఘంగా చర్చించారు. 15 నెలలు గడిచినా ప్రభుత్వంపై ఒక్క అవినీతి మచ్చ కూడా లేదని ఆయన అన్నారు.

2016లో...

ప్రధాని కొత్త ప్రకటనలకు దూరంగా ఉన్నారు. బదులుగా తన వాగ్దానాల పంపిణీలో తన ప్రభుత్వ రికార్డును అంచనా వేశారు. 2017లో ఎర్రకోట నుంచి ఆయన తన నాలుగో ప్రసంగంలో ఒకే ఒక ప్రకటన ఉంది. శౌర్య పురస్కార విజేతల పరాక్రమాన్ని అందించడానికి వెబ్‌సైట్‌ను ప్రారంభించడం.

2022 నాటికి 'మెజెస్టిక్ ఇండియా' లక్ష్యాలను నిర్దేశించాలని కూడా మోడీ ఎంచుకున్నారు. పేదలకు పక్కా గృహాలు, 2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయటం, యువత, మహిళలకు తగినంత అవకాశాలు, అవినీతి, బంధు ప్రీతితో రాజీలేని భారతదేశం, తీవ్రవాదం, మతతత్వం, కులతత్వం నుంచి విముక్తి పొందటం వంటివి ఆయన ప్రకటనలో ఉన్నాయి.

2020లో....

కరోనావైరస్ మహమ్మారి గరిష్ట స్థాయికి చేరుకోవటంతో.. ఈ కార్యక్రమానికి భద్రతా ప్రోటోకాల్‌లతో సమావేశమైన దౌత్యవేత్తలు, అధికారులు, మీడియా సిబ్బందితో సహా 4,000 మందికి పైగా ప్రజలను ఉద్దేశించి మోడీ ప్రసంగించారు. మహమ్మారి చుట్టూ దేశం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి ప్రసంగాన్ని ఉపయోగించారు. మరుసటి సంవత్సరం.. భారత్‌కు స్వాతంత్ర్యం వచ్చి శతాబ్ది సంవత్సరం వరకు వచ్చే 25 సంవత్సరాలను 'అమృత్ కాల్'గా పాటిస్తామనీ, ఈ సమయంలో దేశం కొత్త శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షిస్తున్నట్టు మోడీ అన్నారు.

2019లో...

సార్వత్రిక ఎన్నికలకు ముందు తన ప్రసంగంలో కొన్ని ప్రటకనలు చేశారు. టాయిలెట్ కవరేజ్, ఎల్పీజీ కవరేజ్, విద్యుదీకరణ రంగాలలో తన నాలుగు సంవత్సరాల అధికారంలో సాధించిన లాభాలను హైలైట్ చేసి.. తన ప్రసంగాన్ని ముగించాడు.

2019 సార్వత్రిక ఎన్నికల్లో మరింత ఎక్కువ మెజారిటీతో తిరిగి వచ్చిన తర్వాత.. ప్రధాని మోడీ తన కొత్త పదవీకాలంలో తన మొదటి స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగాన్ని తన ప్రభుత్వ సైద్ధాంతిక ఎజెండాను వివరించడానికి ఉపయోగించారు.

ఇక 2022 వేడుకల్లో మోడీ

"పాంచ్ ప్రాణ్ (ఐదు ప్రమాణాలు)" గురించి మాట్లాడారు. ప్రసంగంలో ఎలాంటి సామాజిక రంగ పథకాల ప్రకటనలూ లేవు. అభివృద్ధి చెందిన భారత్ అనే ప్రధాన సంకల్పంతో దేశం ముందుకు సాగటమే మొదటి ప్రాణమని ఆయన అన్నారు. ఇక 2023లో.. 2024 లోక్‌సభ ఎన్నికలను దేశాన్ని పీడిస్తున్న "చెడుల"పై యుద్ధంగా ఆయన అభివర్ణించారు. "అవినీతి, రాజవంశ పాలన, బుజ్జగింపు వైపు మీ కండ్లు మూసుకోవటానికి ఇది సమయం కాదు" అని అన్నారు. ప్రతిపక్షాల "పరివార్వాద్ (బంధుప్రీతి)"లా కాకుండా.. మోడీ మొత్తం దేశాన్ని తన "పరివర్జన్ (కుటుంబ సభ్యులు)"గా పరిగణిం చారని అన్నారు. వచ్చే ఏడాది తాను ఎర్రకోటపైకి వస్తానని కూడా ఆయన అంచనా వేశారు. అయితే, ఈ సారి సార్వత్రిక ఎన్నికల్లో మోడీ ప్రభుత్వానికి మెజారిటీ తగ్గటంతో ఇతర పార్టీలపై ఆధారపడిన పరిస్థితులు ఏర్పడిన విషయం విదితమే. అయితే, మోడీ చేసిన ప్రకటనలకు సంబంధించిన ఆచరణలో మాత్రం అంత వేగం కనిపించటం లేదని మేధావులు, విశ్లేషకులు అంటున్నారు.

ప్రధాని ప్రసంగంపై విపక్షాల ఆగ్రహం

విభజన అంశాల గురించి ఆయన మాట్లాడారని ఆరోపణలు

న్యూఢిల్లీ : ప్రధాని మోడీ తన స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో విభజన ఎజెండాను ముందుకు తెచ్చారని ప్రతిపక్షాలు ఆరోపించాయి. మత సివిల్ కోడ్‌పై ఆయన చేసిన వ్యాఖ్యలను డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌కు అవమానమని కాంగ్రెస్ పేర్కొన్నది. "ఇప్పటి వరకు మనకు 'కమ్యూనల్ సివిల్ కోడ్' ఉన్నదని చెప్పటం 1950ల మధ్య నాటికి వాస్తవరూపం దాల్చిన హిందూ వ్యక్తిగత చట్టాలలో సంస్కరణలకు గొప్ప కారకుడు అయిన డాక్టర్ అంబేద్కర్‌కు ఘోర అవమానం. ఈ సంస్కరణలను ఆరెస్సెస్, జన్ సంఘ్ తీవ్రంగా వ్యతిరేకించాయి" అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ ఎక్స్‌లో పోస్ట్‌లో పేర్కొన్నారు.

సీపీఐ ప్రధాన కార్యదర్శి డి. రాజా మాట్లాడుతూ.. ఐక్యత లేదా ప్రజలను ప్రేరేపించే అంశాలను ప్రధాని లేవనెత్తి ఉండాల్సిందని అన్నారు. "ఆయన ఏం మాట్లాడినా ఆరెస్సెస్ విభజన అజెండాకు అనుగుణంగా ప్రజలను విభజించటం చేస్తారు. ప్రధాని 2047 గురించి మాట్లాడుతున్నారు. కానీ దేశ బహుళత్వం, వైవిధ్యం సమస్యలను పరిష్కరించటంలో మోడీ విఫలమయ్యారు. ఆయన దేశంపై ఏకరూపతను విధించడానికి ప్రయత్నిస్తున్నాడు "అని రాజా ఆరోపించారు. 'ఒక దేశం, ఒకే ఎన్నికలు' అనే ఆలోచనను ప్రశ్నిస్తూ.. నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఉమెన్(ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) ప్రధాన కార్యదర్శి, సీపీఐ నాయకుడు అన్నీ రాజా మాట్లాడారు. "ఈ దేశం ఎన్నికల కోసం వనరులను సృష్టించలేకపోతే, మనం 2047 గురించి ఎందుకు మాట్లాడుతున్నాం? 'ఒకే దేశం, ఒకే ఎన్నికలు' వెనుక ఆయన ఉద్దేశం ఏమిటో నాకు తెలియదు. స్వేచ్ఛా-న్యాయమైన ఎన్నికలను నిర్వహించడమే మొదటి అజెండా కావాలి" అని అన్నారు. ఆర్జేడీ నాయకుడు మనోజ్ ఝా మాట్లాడుతూ.. దేశంలో ఒకే ఒక్క ప్రధాని ఉన్నారనీ, ప్రతిపక్షాలకు ఓటు వేసిన వారికి ప్రత్యేక ప్రధాని లేరన్న విషయాన్ని మోడీ ఇంకా గుర్తించలేదని అన్నారు.



అదానీకి మోడీ సర్కార్ అండ

బంగ్లాదేశ్‌తో కాంట్రాక్ట్ విద్యుత్‌ను భారత్‌లో విక్రయించేందుకు అనుమతి

ఎగుమతులపై మార్గదర్శకాలను సవరించిన కేంద్రం


న్యూఢిల్లీ : బడా వ్యాపారవేత్త అదానీకి మోడీ సర్కారు మరొకసారి అండగా నిలుస్తున్నది. ఇందుకు బంగ్లాదేశ్‌లోని రాజకీయ అస్థిర పరిస్థితులను సైతం అదానీకి అనుకూలంగా మార్చుతున్నది. బంగ్లాదేశ్‌తో ఒప్పందం చేసుకున్న విద్యుత్‌ను భారత్‌లో విక్రయించటానికి అదానీ పవర్‌కు మోడీ సర్కారు అనుమతించింది. ఈ మేరకు కేంద్రం విద్యుత్ ఎగుమతులపై మార్గదర్శకాలను సవరించింది. ఈ విషయాన్ని ఒక వార్త సంస్థ నివేదించింది. అయితే, బంగ్లాదేశ్‌లో రాజకీయ సంక్షోభం కారణంగా ఏర్పడే అంతరాయాల నుంచి అదానీ పవర్‌ను రక్షించటంలో ఈ చర్య సహాయపడుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు.2018లో మోడీ ప్రభుత్వం పొరుగు దేశానికి ప్రత్యేకంగా విద్యుత్ సరఫరా చేసే జనరేటర్లపై మార్గదర్శకాలను రూపొందించింది. జార్ఖండ్‌లోని గొడ్డా జిల్లాలో అదానీ పవర్ 1,600-మెగావాట్ల పవర్ ప్లాంట్ ప్రస్తుతం అది ఉత్పత్తి చేసే మొత్తం విద్యుత్‌ను మరొక దేశానికి సరఫరా చేయడానికి ఒప్పంద బాధ్యతను కలిగి ఉన్నది. ఈ సందర్భంలో అది బంగ్లాదేశ్‌కు చేయాల్సి ఉన్నది. అయితే, ఈనెల 12న కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ ఆమోదించిన మెమో.. మార్గదర్శకాలను సవరించింది. పూర్తి లేదా పాక్షిక సామర్థ్య స్థిరమైన షెడ్యూల్ లేని సందర్భంలో భారత్‌లో విద్యుత్ అమ్మకాలను సులభతరం చేయటానికి ప్రభుత్వం అటువంటి ఉత్పాదక స్టేషన్‌ను భారతీయ గ్రిడ్‌కు అనుసంధానించటానికి అనుమతించవచ్చని రాయిటర్స్ వివరించింది. చెల్లింపులు ఆలస్యమైతే భారతీయ గ్రిడ్‌కు విద్యుత్‌ను విక్రయించటానికి కూడా సవరణ అనుమతిస్తుంది. భారత్‌లో మొత్తం విద్యుత్ లభ్యతను పెంచటానికి ఈ చర్య సహాయపడుతుందని అదానీ గ్రూప్ తెలిపింది. మొత్తానికీ, బంగ్లాదేశ్‌కు అదానీ పవర్ విద్యుత్ ఎగుమతులు చాలా కాలంగా వివాదానికి కేంద్రంగా ఉన్నాయి. నిపుణులు దీనిని అధిక ధరలకు ఢాకా కొనుగోలు చేయవలసి ఉంటుందని వాదించారు. బంగ్లాదేశ్‌లోని ప్రతిపక్ష పార్టీలు ఈ ఏర్పాటును విమర్శించాయి. ఇది అత్యంత అసమాన ఒప్పందమని అభివర్ణించాయి.

2017లో ఢాకాలో షేక్ హసీనా నేతృత్వంలోని అవామీ లీగ్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు సంతకం చేసిన ఒప్పందం ప్రకారం అదానీ గ్రూప్ సంస్థ బంగ్లాదేశ్‌కు విద్యుత్‌ను విక్రయిస్తుంది. ప్రధాని మోడీ బంగ్లాదేశ్‌లో పర్యటించిన కొద్దిసేపటికే 2015 ఆగస్టులో అదానీ గ్రూప్, ఢాకా మధ్య అవగాహన ఒప్పందం కుదరటం గమనార్హం. అదానీ గ్రూప్, బంగ్లాదేశ్ ప్రభుత్వం మధ్య జరిగిన డీల్‌లో మోడీ ప్రమేయం నేరుగా ఉన్నదా అని భారత్‌లోని ప్రతిపక్షాలు ప్రశ్నించాయి కూడా. అయితే ఈ ఒప్పందాన్ని సవరించాలని కోరుతూ బంగ్లాదేశ్ పవర్ డెవలప్‌మెంట్ బోర్డు గతేడాది కంపెనీకి లేఖ రాసింది. కోరిన సవరణలపై అధికారిక ప్రకటన లేనప్పటికీ, అధిక ధరలు వివాదాస్పదంగా ఉన్నాయని ఒక అధికారి వ్యాఖ్యానించారు.

బీజేపీ నేతకు షాక్

కిరీట్ సోమయ్య, ఆయన కొడుకుపై కేసు మూసివేతకు కోర్టు నిరాకరణ

వారిద్దరిపై ఐఎన్ఎస్ విక్రాంత్ ఫండ్ దుర్వినియోగం ఆరోపణలు



ముంబయి : భారతీయ నావికాదళ నౌక విక్రాంత్‌ను పునరుద్ధరించేందుకు ప్రజల నుంచి సేకరించిన రూ. 57 కోట్ల నిధులను దుర్వినియోగం చేశారన్న ఆరోపణలపై బీజేపీ నాయకుడు కిరీట్ సోమయ్య, ఆయన కుమారుడు నీల్‌పై కేసును ముగించేందుకు ముంబయి కోర్టు నిరాకరించింది. ముంబయి పోలీసు ఎకనామిక్ అఫెన్స్ వింగ్ దాఖలు చేసిన ముగింపు నివేదికను ఈనెల 8న ఎస్ప్లానేడ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఎస్పీ షిండే తిరస్కరించారు. నిధుల సేకరణ కోసం వివిధ ప్రదేశాల్లో డ్రైవ్‌లు చేపట్టగా.. విచారణాధికారి చర్చ్‌గేట్ రైల్వే స్టేషన్ వెలుపల ఉన్నవాటిని మాత్రమే పరిశీలించారని కోర్టు గమనించిన తర్వాత తిరస్కరణ జరగటం గమనార్హం. సేకరించిన నిధులతో ఏమి జరిగిందో కూడా అధికారి నిర్ధారించలేదని కోర్టు తెలిపింది. కేసును మరింత దర్యాప్తు చేయాలని ఆదేశించినట్టు ఒక ఆంగ్ల వార్త పత్రిక నివేదించింది

జర్నలిస్టులపై బీజేపీ ఎమ్మెల్యే పరువునష్టం దావా

- నిరసనకు దిగిన కలంయోధులు
- డబ్బు కోసం యాచిస్తూ ఆందోళన

లక్నో : యూపీలో ఒక ఎమ్మెల్యే స్థానిక జర్నలిస్టులపై పరువు నష్టం దావా వేయటం, దానిని వ్యతిరేకిస్తూ జర్నలిస్టులు ఆందోళనకు దిగటం చర్చనీయాంశంగా మారాయి. బీజేపీ ఎమ్మెల్యే జవహరలాల్ రాజ్‌పుత్.. తన నియోజకవర్గమైన గరౌతలో నలుగురు జర్నలిస్టులపై ఈ దావా వేశారు. అయితే, ఎమ్మెల్యే తీరు అనైతికమనీ, జర్నలిస్టుల గొంతును నొక్కే ప్రయత్నమని కలం యోధులు ఆందోళనను వ్యక్తం చేశారు. ఇందులో భాగంగా జర్నలిస్టులు నిరసనలకు దిగారు. ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద నిలబడి, మార్కెట్‌లలో తిరుగుతూ స్టీల్ గిన్నెలు పట్టుకొని చిరిగిన చొక్కాలతో డబ్బు కోసం యాచించిన దృశ్యాలు అక్కడ కనబడ్డాయి.

జవహర్‌లాల్ రాజ్‌పుత్ తన నియోజక వర్గమైన గరౌతలో అక్రమ ఇసుక తవ్వకాలలో తన ప్రమేయాన్ని సూచిస్తూ నివేదికలను ప్రచురించటం పట్ల జర్నలిస్టులపై ఆగ్రహంతో ఊగిపోయారు. తన ప్రతిష్టను దిగజార్చటానికి కుట్ర పన్నారని నలుగురు స్థానిక జర్నలిస్టులపై రూ. 50 కోట్ల పరువు నష్టం దావా వేశారు. దీనికి వ్యతిరేకంగానే జర్నలిస్టుల ఈ అసాధారణ నిరసన జరిగింది. జూన్‌లో ప్రచురించబడిన నివేదికలలో రాజ్‌పుత్‌కు చెందిన 'వ్యక్తిగత సహాయకుడు'.. రిపోర్టింగ్ చేస్తున్నప్పుడు స్థానిక జర్నలిస్ట్‌పై దాడి చేసినట్టు కూడా పేర్కొన్నారు. ఈ నలుగురు జర్నలిస్టులు పుష్పేంద్ర యాదవ్, అశుతోష్ నాయక్, ధీరేంద్ర రైక్వార్, రామ్ నరేష్ రాజ్‌పుత్‌లుగా ఉన్నారు. గతనెల 24న బేషరతుగా



క్షమాపణలు, రూ. 50 కోట్ల ద్రవ్య పరిహారం కోరుతూ పరువు నష్టం నోటీసులు వీరు అందుకున్నారు. "మా ప్రాంతంలోని ప్రతి జర్నలిస్టు వారి కిడ్నీలను విక్రయించినప్పటికీ, మేము ఈ మొత్తాన్ని ఎప్పటికీ సేకరించలేము" అని వీరు తెలిపారు. "మేము ప్రజల కోసం వార్తలు, కథనాలు రాస్తాం. కాబట్టి మేము డబ్బు కోసం కూడా ప్రజల వద్దకు వెళ్తామని అనుకున్నాం. ఎందుకంటే మాకు దీనిని భరించగలిగే మార్గం లేదు" అని వివరించారు. కాగా, కొంతమంది బాటసారులు జర్నలిస్టుల కష్టాలను విన్నప్పుడు నాణేలు, పెద్ద నోట్లను కూడా అందించారు. కొంతమంది బిచ్చగాళ్ళు కూడా తమకు డబ్బు విరాళంగా ఇచ్చారని జర్నలిస్టులు చెప్పారు. కాగా, నలుగురు జర్నలిస్టులకు మాత్రమే నోటీసు పంపామని రాజ్‌పుత్ తరపు న్యాయవాది సీమా పట్నాహా సింగ్ తెలపగా.. మరో స్థానిక స్వతంత్ర రిపోర్టర్ డికు జైన్ తనకు కూడా నోటీసు పంపారని, అయితే అది తనకు అందలేదని తెలిపారు.



రాజుకుంటోంది

కోల్‌కతా : ఆర్‌జీ కార్ ఆస్పత్రి ప్రాంగణంలో దుండగుల విధ్వంసకాండ చర్చనీయాంశంగా మారింది. గురువారం అర్ధరాత్రి ఎమర్జెన్సీ విభాగాన్ని, నర్సింగ్ స్టేషన్, మందుల స్టోర్, సీసీ కెమెరాలను దుండగులు ధ్వంసం చేశారు. అక్కడ విధి నిర్వహణలో ఉన్న పోలీసులపైకి రాళ్లు రువ్వారు. వారిని అదుపు చేసేందుకు పోలీసులు బాష్ప వాయువును ప్రయోగించారు. అనంతరం తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నారు. విధులలో ఉన్న తమకు రక్షణ కల్పించాలంటూ వైద్యులు, నర్సులు ఆందోళన చేపట్టారు. తమ ఆందోళనను నైతికంగా దెబ్బతీయడానికే ఆస్పత్రిపై దాడి చేశారని తెలిపారు. న్యాయం జరిగే వరకూ తమ ఆందోళన కొనసాగుతుందని స్పష్టం చేశారు. దాడులు జరిగిన ఆరు గంటల్లోగా ఫిర్యాదు నమోదు చేయాలి

ఆస్పత్రులకు కేంద్రం కీలక ఆదేశాలు

వైద్యురాలి హత్యాచార ఘటనపై దేశవ్యాప్తంగా ఆందోళనలు కొనసాగుతుండగా ఆర్‌జీ కార్ మెడికల్ కాలేజీలో కొందరు విధ్వంసం సష్టించడంపై కేంద్ర ప్రభుత్వం సీరియస్ అయ్యింది. ఈ మేరకు దేశంలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రులకు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఆస్పత్రి ప్రాంగణంలో హింస, సిబ్బంది, కార్యకర్తలపై దాడులు జరిగిన ఆరు గంటల్లోగా ఫిర్యాదు నమోదు చేయాలని ఆదేశించింది. నిర్ణీత గడువులోగా అలాంటి ఫిర్యాదు అందకపోతే సంబంధిత ఇన్‌స్టిట్యూట్ హెడ్ బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. ఈ మేరకు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది.

ఇటీవలే ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులు, ఇతర ఆరోగ్య సిబ్బందిపై దాడులు సర్వసాధారణంగా మారడం తమ దృష్టికి వచ్చిందని పేర్కొంది. విధి నిర్వహణలో అనేక మంది ఆరోగ్య సిబ్బంది శారీరక హింసకు గురవుతున్నారని తెలిపింది. మరికొందరికి బెదిరింపులు వచ్చాయని, ఈ హింసలో ఎక్కువ శాతం రోగులు లేక రోగుల అటెండర్ల ద్వారా ఎదుర్కొన్నవేనని మంత్రిత్వ శాఖ తన ఆదేశాల్లో తెలిపింది. వీటిని దష్టిలో ఉంచుకొని ఆస్పత్రులకు ఆదేశాలు ఇచ్చినట్టు వెల్లడించింది.

వైద్యురాలిపై హత్యాచార ఘటనకు నిరసన
బీజేపీ కార్యకర్తలు, పోలీసుల మధ్య ఘర్షణ

కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌పై హత్యాచార ఘటనపై బీజేపీ కార్యకర్తలు శుక్రవారం సీజీవో కాంప్లెక్స్ వెలుపల నిరసన చేపట్టారు. మృతురాలికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ కార్యకర్తలు, కోల్‌కతా పోలీసుల మధ్య ఘర్షణ జరిగింది. ఈ నేపథ్యంలో పలువురు బీజేపీ కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

మమతా బెనర్జీ తక్షణమే రాజీనామా చేయాలి
చీఫ్ విప్ డాక్టర్ శంకర్ ఘోష్

ట్రైనీ వైద్యురాలిపై హత్యాచార ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ రాజీనామా చేయాలని సిలిగురి ఎమ్మెల్యే, రాష్ట్ర అసెంబ్లీ చీఫ్ విప్ డాక్టర్ శంకర్ ఘోష్ డిమాండ్ చేశారు. బెంగాల్‌లో మహిళలపై లైంగిక దాడులు నిత్యకృత్యమయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు.

మీరేం చేస్తున్నారు.?

మమత సర్కార్‌పై హైకోర్టు మండిపాటు

- ఆర్‌జీ కార్ ఆస్పత్రిలో దుండగుల విధ్వంసంపై తీవ్రంగా స్పందన

ఆర్‌జీ కార్ మెడికల్ కాలేజీ ఆస్పత్రి ఆవరణలో జరిగిన విధ్వంస ఘటనపై కోల్‌కతా హైకోర్టు తీవ్రంగా స్పందిం చింది. ఈ మేరకు మమతా బెనర్జీ ప్రభు త్వంపై తీవ్ర స్థాయిలో మండిపడింది. ఇది ముమ్మాటికీ ప్రభుత్వ వైఫల్యమేనని స్పష్టం చేసింది. ఇలాంటి పరిస్థితుల్లో వైద్యులు ఎలా విధులు నిర్వర్తించగలరని ప్రశ్నించింది. 'పోలీసులకు ముందస్తు నిఘా విభాగం ఉంటుంది. ఇలాంటి ఘటనలు తలెత్తే అవకావం ఉన్నప్పుడు పోలీసులు సాధారణంగా 144 సెక్షన్ విధిస్తారు. మరి ఈ విషయంలో ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరించారు..? 7 వేల మంది ఒకేసారి నడుచుకుంటూ ఆస్పత్రి వద్దకు రావడం అసాధ్యం. ఇంత మంది ఆస్పత్రి వద్ద గుమిగూడితే.. అది ముందుగా పోలీసులకు తెలియదనడం నమ్మశక్యంగా లేదు. ఇది ముమ్మాటికీ రాష్ట్ర యంత్రాంగం వైఫల్యమే. వైద్యులు, మెడికల్ సిబ్బంది తమ విధులను భయం లేకుండా నిర్వర్తించేలా వాతావరణం కల్పించడం ప్రభుత్వ బాధ్యత. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావతం కాకుండా చర్యలు తీసుకోవాలి' అని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు సూచించింది. కాగా, కోల్‌కతా ఘటనను నిరసిస్తూ దేశవ్యాప్తంగా ఆందోళనలు కొనసాగుతున్నాయి. దేశ రాజధాని ఢిల్లీలో అన్ని రెసిడెంట్ డాక్టర్స్ అసోషియేషన్స్ కలిసి సంయుక్తంగా ఆందోళన చేస్తున్నాయి. న్యూఢిల్లీలోని నిర్మాణ్ భవన్ దగ్గర ప్రొటెస్ట్ మార్చ్ నిర్వహించాయి. శుక్రవారం నాడు దేశవ్యాప్తంగా వైద్యుల నిరసన ప్రదర్శనలతో దేశం అట్టుడికింది. 'తాము ఓపీ సేవలను నిలిపివేసి గత మూడు రోజులుగా ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఇకనైనా తమ డిమాండ్లను వినకపోతే అత్యవసర సేవలను కూడా నిలిపివేయాల్సి వస్తుంది' అని జూనియర్ డాక్టర్‌లు హెచ్చరించారు. అత్యవసర సేవలను నిలిపేసి రోగులను ఇబ్బందులు పెట్టాలనేది తమ ఉద్దేశం కాదని, ప్రభుత్వం మా డిమాండ్లను లెక్కచేయకపోతే అదే తమ ఆఖరి ఆప్షన్ అవుతుందని తెలిపారు.

ఆనవాళ్లు చెరిపే కుట్ర

(మొదటిపేజీ తరువాయి)

ఆత్మహత్య అంటూ బాధిత కుటుంబ సభ్యులకు ఫోన్ చేసిన కళాశాల యాజమాన్యం, ఆ తర్వాత పొంతన లేని వ్యాఖ్యలు చేసిందని తెలిపారు. ఈ అమానవీయ ఘటనపై మమత సర్కార్ సత్వర చర్యలు తీసుకోక పోవటంతో టీఎంసీ గుండాలు మరింతగా రెచ్చిపోయారన్నారు. టీఎంసీ శ్రేణులు బరితెగించి, హత్యాచార ఆనవాళ్లను చెరిపేయటానికి ప్రయత్నిస్తే.. పోలీసులు ప్రేక్షకపాత్ర వహించారని ఆరోపించారు. టీఎంసీ గుండాలను కట్టడి చేయకుండా... పోలీసులు పారిపోయారని బృందా విమర్శించారు. ఇప్పటికైనా దోషులను పట్టుకుని, శిక్షిస్తారా..లేదా అని ఆమె ప్రశ్నించారు.



అరుంధతీ రాయ్‌కి 'డిస్టర్బింగ్ ది పీస్' అవార్డు

న్యూఢిల్లీ : రచయిత్రి అరుంధతీ రాయ్‌కి 'డిస్టర్బింగ్ ది పీస్' అవార్డు లభించింది. యూఎస్‌కు చెందిన వాక్లావ్ హావెల్ సెంటర్ 2024 'డిస్టర్బింగ్ ది పీస్' అవార్డును గెలుచుకున్న ఇద్దరిలో అరుంధతీ రాయ్ కూడా ఉన్నారు. ప్రధానంగా ఇరాన్ ప్రభుత్వంచే రాజకీయ అణచివేతను నిరసిస్తూ పాటలకు ప్రసిద్ధి చెందిన ఇరాన్ రాపర్ టూమాజ్ సలేహితో అరుంధతీ రాయ్ ఈ అవార్డును పంచుకుంటారు. జ్యూరీ సభ్యుడు సలీల్ త్రిపాఠి అవార్డును ప్రకటిస్తూ.. అరుంధతీ రాయ్ భారత్‌లోని అట్టడుగున ఉన్న, నిరాదరణకు గురైన ప్రజల కోసం మాట్లాడుతున్నారని అన్నారు. వాక్లావ్ హావెల్ సెంటర్ ప్రతి సంవత్సరం ధైర్యమైన అసమ్మతి వాదికి అవార్డును అందజేస్తుంది. మానవ హక్కుల కోసం పోరాడుతున్న ప్రపంచ రచయితలను గుర్తించడానికి ప్రయత్నిస్తుంది. చెకోస్లోవేకియా చివరి అధ్యక్షుడిగా, చెక్ రిపబ్లిక్ మొదటి అధ్యక్షుడిగా కొనసాగిన రచయిత, రాజకీయ అసమ్మతి వాక్లావ్ హావెల్ పేరు మీద ఈ అవార్డు ఇవ్వబడింది. ఈ అవార్డు కింద రూ. 4.19 లక్షల నగదు బహుమతిని లభిస్తుంది.

నర్సుపై హత్యాచారం

- డ్యూటీ నుంచి ఇంటికి వెళుతుండగా ఘోరం
- ఉత్తరాఖండ్‌లో ఆల్యసంగా వెలుగుచూసిన దారుణం

డెహ్రాడూన్ : దేశంలో రానురాను మహిళలకు భద్రత లేకుండా పోతోంది. బయటకు వెళ్లిన మహిళలు ఇంటికి క్షేమంగా తిరిగి రావడం ప్రశ్నార్థకంగా మారింది. కొల్‌కతాలో ప్రభుత్వ ఆస్పత్రిలోనే ఒక జూనియర్ డాక్టర్‌పై లైంగికదాడి, హత్య ఘటనపై ఆందోళనలు, నిరసనలు కొనసాగున్న సమయంలోనే ఉత్తరాఖండ్‌లో జరిగిన మరొక దారుణం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రుద్రపూర్‌లో ఒక ప్రయివైట్ ఆస్పత్రిలో నర్సు డ్యూటీ ముగించుకుని ఇంటికి తిరిగి వెళుతుండగా హత్యాచారానికి గురయింది. జులై 30న జరిగిన ఈ ఘోరం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జులై 30న డ్యూటీకి వెళ్లిన నర్సు తిరిగి రాకపోవడంతో ఈ తరువాత రోజున మృతురాలి సోదరి ఫిర్యాదుతో మిస్సింగ్ కేసును పోలీసులు నమోదు చేశారు. ఈ నెల 8న ఉత్తరప్రదేశ్‌లో ముఖమంతా ఛిద్రమై గుర్తుపట్టలేని స్థితిలో ఉన్న ఆమె మృతదేహాన్ని కనుగొన్నారు. సీసీటీవీ పుటేజీలు, మొబైల్ ఫోన్ లోకేషన్ వంటి ఆధారాలతో కేసును దర్యాప్తు చేసిన పోలీసులు నిందితుడ్ని రాజస్థాన్‌లో ఈ నెల 13న అరెస్టు చేశారు. నిందితుడ్ని ఉత్తరప్రదేశ్‌లోని బరేలీ జిల్లాకు చెందిన ధర్మేంద్రగా గుర్తించారు. ఇతడు ఉత్తరాఖండ్‌లోని గదర్‌పూర్‌లో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. పోలీసులకు విచారణలో ధర్మేంద్ర తెలిపిన వివరాలు ప్రకారం.. జులై 30న ఇంటికి వెళుతున్న నర్సును అతడు అనుసరించాడు. ఒక నిర్జన ప్రదేశానికి వచ్చిన తరువాత నర్సును బలవంతగా పొదల్లోకి లాక్కుని వెళ్లాడు. ఆమె గట్టిగా ప్రతిఘించడంతో ఆమె స్కార్ఫ్‌నే ఆమె ముఖానికి చుట్టాడు. అత్యాచారానికి పాల్పడ్డాడు. తరువాత



దారణంగా ఆమె ముఖాన్ని రాయితో చితకొట్టి హత్య చేశాడు. మృతదేహాన్ని ఉత్తరాఖండ్ సరిహద్దుకు సమీపంలోని ఉత్తరప్రదేశ్ గ్రామంలో ఖాళీ స్థలంలో పడేశాడు. పర్సు, ఫోను, ఇతర విలువైన వస్తువులను తీసుకుని పారిపోయాడు.

"కడిగిపారేయడమే" కాదు..!

సంపాదకీయం

"అయినా... మనిషి మారలేదు... ఆతని కాంక్ష తీర లేదు" ఎర్రకోట బురుజుల నుండి మోడీ ఉపన్యాసం విన్నవారికి గుండమ్మ కథలోని పై పాట గుర్తుకురాక మానదు. "కడిగిపారేయడానికి" 98 నిమిషాలు వాడుకున్నాడని మోడీని ఆకాశానికి ఎత్తిన ఒక సంపాదక 'మాన్యుడు' సెంచరీ మిస్ చేసినందుకు 'అభిమానుల' తరపున ఒకింత వగచాడు. ఈ ప్రహసనాన్ని చూసిన ఎవరైనా ఆశ్చర్యపోకమానరు. ఎందుకంటే ఎర్రకోట ఉపన్యాసంలో "కడిగిపారేసిన"దానికంటే కప్పిపెట్టేసినవే ఎక్కువ.

సుమారు పాతికేళ్ల సరళీకృత ఆర్థిక విధానాల అమలు తర్వాత, మిగతా దేశాల్లాగే మన దేశంలోనూ ప్రజల్లో అసంతృప్తి విస్తరిస్తున్న దశలో దాన్ని కంట్రోల్ చేయగల శక్తిమంతుడు కావాలి. దాంతోపాటు దేశ కార్పొరేట్ల సేవలో తేడా రాకుండా చూడాలి. 'సరైన' సమయంలో 'సరైన' వ్యక్తిని ఆరెస్సెస్ తన అంబులపొదిలో నుండి దేశం మీదికి వదిలింది. దశాబ్దంకిపైగా భారత గుత్త పెట్టుబడికి ముద్దుబిడ్డగా సాకబడి, ట్రయిన్ చేయబడ్డ వ్యక్తిని గుజరాత్ నుండి ఢిల్లీకి దిగుమతి చేసుకున్నారు. ఆ విధంగా ప్రారంభమైన మోడీ ప్రస్థానంలో.. మొన్న స్వాతంత్ర్యదినోత్సవం నాడు ఎర్రకోట నుండి పదకొండవసారి మారుమ్రోగిన ఉపన్యాసం గురించే నేటి చర్చంతా!




మొన్నటి లోక్‌సభ ఎన్నికల తర్వాత మోడీని పరిస్థితులు మార్చేస్తాయని ఆనందించిన అల్ప సంతోషులున్నారు. ఒక చంక కింది పోటీ కర్ర తెలుగుదేశమని, మరో చంక కింద జేడీ(యూ) కర్ర ఉందని, ఈ రెండూ 'సెక్యులర్ పార్టీలనీ మోడీ ఆటలు సాగనీయరని చప్పట్లు కొట్టినవారున్నారు. కానీ ఎటువంటి శషభిషలకు తావు లేకుండా ఆరెస్సెస్ ఎజెండాను తన ఎర్రకోట ఉపన్యాసంలో జాగ్రత్తగా ప్రస్తావించారు ఈ ఆరెస్సెస్ మాజీ ప్రచారక్.

మోడీ కప్పిపెట్టిన అంశాలను ఒక్కొక్కటిగా విప్పిచూస్తే.. ఇప్పటిదాకా దేశంలో ఉన్నది మతతత్వ సివిల్ కోడ్ అట! ఆ మాట సుప్రీంకోర్టు కూడా ఒప్పుకుందట! అది ఎప్పుడో, ఎక్కడో ఆయన చెప్పరు. పైగా నేషనల్ లా కమిషన్ తన 21వ సంప్రదింపుల పత్రంలో వివక్షపూరితంగా ఉన్న చట్టాలను సరిచేస్తే చాలని, ఉమ్మడి పౌరస్మృతి అవసరం నేడు లేదని స్పష్టంగా చెప్పింది. దీని గురించి మోడీ చెప్పరు. ఇప్పటికే ఉత్తరాఖండ్‌లో అమల్లోకొచ్చిన ముస్లిం మైనారిటీలపై సాగే వివక్షపై ఆయనేమీ చెప్పరు. దాని స్థానంలో లౌకిక సివిల్ కోడ్ తెచ్చే పనిలో తన సర్కారుందట! తాను తేదల్చుకున్న 'ఉమ్మడి పౌరస్మృతికే చక్కెర పూసి ఎన్డీయే కూటమి భాగస్వాములతో మింగించే ప్రయత్నం చేయడమే కదా ఇది!? తరచూ ఎన్నికలు జరిగితే దేశాభివృద్ధికి అడ్డంకి కాబట్టి, లోక్‌సభకూ రాష్ట్రాల శాసనసభలకు ఒకేసారి ఎన్నికలు జరుపుతారట! ఒకే దేశం, ఒకే ఎన్నికలు నినాదాన్ని ఈ విధంగా చెప్పారు మోడీ. ఇది భారతదేశ ప్రజాస్వామ్య పునాదుల మీదే గొడ్డలివేటు. పెట్టుబడిదారుల ప్రాపకంతో బతికే పార్టీలకు, మొన్నటి ఎలక్టోరల్ బాండ్లలో వేల కోట్లు పోగేసుకున్న పార్టీలైతే పంచాయతీల నుండి లోక్‌సభ సీట్ల వరకు పోటీ చేసే స్తోమతుంటుంది. తప్ప మిగిలిన వారికి అసాధ్యం. ఆయా రాష్ట్రాల్లో స్థానిక పరిస్థితుల్లో పార్టీలు చీలిపోతూంటాయి. ప్రభుత్వాలు కూలిపోతూంటాయి. 'ఒకే ఎన్నిక' అంటే ప్రజాభీష్టానికి వ్యతిరేకంగా ఆ ప్రభుత్వాలను స్థిరంగా నిలబెట్టేస్తారా? ఓనం కాలంలో కేరళలో, దుర్గాపూజా కాలంలో దేశ తూర్పు భాగంలో, దసరా, సంక్రాంతి రోజుల్లో తెలుగు రాష్ట్రాల్లో ఎన్నికలు నిర్వహించగలరా? దేశం, రాష్ట్రాల్లో ఒకేసారి ఎన్నికలు భారతదేశంలో నిర్వహించడం అసాధ్యం.

మోడీ అవినీతిపై పోరాడుతున్నారట! దేశం ఆయన వెంట నడవాలట! వాస్తవమేమంటే అవినీతి మరకలున్న వారు బీజేపీలో చేరితే పరిశుద్ధులౌతున్నారు. చాంతాడంతున్న ఈ లిస్టు చూసి దేశం నవ్వుకుంటోంది. మోడీ "అవినీతి వ్యతిరేక" పోరాటం దాంతో ఆగలేదు. ఎన్నో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టులు - కూలిపోతున్న టన్నెల్స్, విరిగిపడుతున్న విమానాశ్రయాలు, కొట్టుకుపోతున్న జాతీయ రహదారులు, లీకవుతున్న కొత్త పార్లమెంటు, అయోధ్య రామమందిరం వంటివి ఎన్నో ఉన్నాయి. ఇదంతా అవినీతి వల్ల కాదా మోడీ మహాశయా? మీరు పోరాడేది ఏ అవినీతి మీదో దేశ ప్రజలకు చెప్పగలరా? అదానీకి వ్యతిరేకంగా జరిగే ఏ వ్యవహారమైనా విదేశీ కుట్రలో భాగమేనన్న మోడీ సెబీ చీఫ్‌పై ఈగ వాలకుండా చూసుకోమని చెప్పడం దాన్ని మన సంపాదక పెద్ద రాయడం ఈయన మోడీ ఒళ్లోనే ఉన్నాడని చెప్పకనే చెప్పాడు. బంగ్లాదేశ్‌లో హిందూ మైనారిటీలపై జరిగే దాడుల గురించీ, ఆలయాలపై దాడి గురించి మోడీ ప్రస్తావించిన అంశాలు కచ్చితంగా దేశ ప్రజలందరూ మద్దతు నివ్వాల్సినవే. కాని మన దేశంలో ముస్లిం, క్రిస్టియన్ మైనారిటీలపై జరిగే దాడుల మాటేమిటి? కూలబడుతున్న చర్చీలు, మసీదుల మాటేమిటి? మాన్యశ్రీ సంపాదకుల వారు మోడీ శకంలో ఏ పొరుగు దేశంతో సుహృద్భావ సంబంధాలున్నాయో శెలవిచ్చి ఉంటే సంతోషించి ఉండేవారం. దేశంలో జరిగే విషయాలను పాఠకులకు వివరించడం పత్రికల ప్రధాన కర్తవ్యం. మరీ ముఖ్యంగా సంపాదకీయాల విధి. గోడీ మీడియాలో అంతర్భాగమైపోతే మరో కిరాయి రచయిత పెరిగారనుకోవడం తప్ప ఏం చేయగలం?

> ఎన్నో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టులు - కూలిపోతున్న టన్నెల్స్, కొట్టుకుపోతున్న జాతీయ రహదారులు, విరిగిపడుతున్న విమానాశ్రయాలు, లీకవుతున్న కొత్త పార్లమెంటు, అయోధ్య రామమందిరం వంటివి ఎన్నో ఉన్నాయి. ఇదంతా అవినీతి వల్ల కాదా మోడీ మహాశయా? మీరు పోరాడేది ఏ అవినీతి మీదో దేశ ప్రజలకు చెప్పగలరా? బంగ్లాదేశ్‌లో హిందూ మైనారిటీలపై జరిగే దాడుల గురించీ, ఆలయాలపై దాడి గురించి మోడీ ప్రస్తావించిన అంశాలు కచ్చితంగా దేశ ప్రజలందరూ మద్దతు నివ్వాల్సినవే. కాని మన దేశంలో ముస్లిం, క్రిస్టియన్ మైనారిటీలపై జరిగే దాడుల మాటేమిటి? కూలబడుతున్న చర్చీలు, మసీదుల మాటేమిటి?

బంగ్లాదేశ్ విప్లవం: లౌకికవాదంలో ఒక ఆశ్చర్యకర పాఠం



ఆపూర్వానంద్

బంగ్లాదేశ్‌లో వేల సంఖ్యలో హిందువులు రక్షణను డిమాండ్ చేస్తూ వివిధ పట్టణాలు, నగరాలలో నిరసన తెలియజేస్తున్నారు. వారి వెంట ముస్లింలు పెద్ద సంఖ్యలో నిలబడి ఉంటున్నారు. ఈ నిరసనలలో హిందువులు మతపరమైన నినాదాలు చేస్తున్నారు. వీరికి తాత్కాలిక ప్రభుత్వ సభ్యులు మద్దతుగా ఉంటున్నారు. హిందువులు, బంగ్లాదేశ్‌ను అపకీర్తి పాల్జేయడానికి భారతదేశానికి, లేక అంతర్జాతీయ కుట్రలో సాధనాలుగా ఉంటున్నారని, సరిహద్దుకు అవతల్నుండి వారిని రెచ్చగొడుతున్నారనీ, వారు దేశ వ్యతిరేకులని పేర్కొనడం ద్వారా ఏ ఒక్కరూ ఈ నిరసనకారులపై దాడి చేయడం లేదు. తాము బంగ్లాదేశీయులమనీ, ఏ ఒక్కరూ తమను తరిమిమేయలేరని బంగ్లాదేశ్ హిందువులు ఆత్మవిశ్వాసంతో చెబుతున్నారు. మైనార్టీ హక్కులకు సంబంధించి వారు ప్రత్యేకమైన సౌకర్యాలను డిమాండ్ చేస్తున్నారు. దుర్గాపూజ సందర్భంగా కోరుతున్న ఐదు రోజుల సెలవు వారి డిమాండ్లలో ఒకటిగా ఉంది. ఒకవేళ వారు వారి ప్రాణాలు, ఆస్తుల గురించి నిజంగా ఆందోళన చెందితే ఈ ఐదు రోజుల సెలవు డిమాండ్ అనేది వారి మనసులో ఉన్న డిమాండ్ కాదు. బంగ్లాదేశ్ తమ స్వంత ఇల్లు అనీ, తాము ఉత్సవాలు జరుపుకునే ప్రాంతమనే విషయం వారికి తెలుసు అని ఈ డిమాండ్ అర్థం.

ఏ ముస్లిం మత సంస్థ కూడా వీటికి వ్యతిరేకంగా ఎలాంటి సమీకరణలు చేయడం లేదు. పాలక పక్షానికి చెందిన ఏ నాయకుడు కూడా దేశద్రోహులను కాల్చి చంపాలని ప్రజల్ని కోరడం లేదు. అంతేకాక దీనికి విరుద్ధంగా విద్యార్థులు, ఇతర ముస్లింలు దేవాలయాలకు రక్షణగా ఉంటూ, హిందూ ప్రజల నివాస ప్రాంతాల్లో పహారా కాస్తున్నారు. మత విరోధుల హానికరమైన దుశ్చర్యలు, హింసకు వ్యతిరేకంగా అక్కడ అప్రమత్తత కనపడుతుంది.ముస్లిం మత పెద్దలు దేవాలయాలను సందర్శిస్తూ, వారికి సంఘీభావాన్ని ప్రకటిస్తున్నారు. వారు హిందువులకు అండగా ఉంటున్నామని బహిరంగంగా ప్రకటిస్తున్నారు.

> బాధ్యతలు స్వీకరించిన వెంటనే మహమ్మద్ యూనస్ మాట్లాడిన విధంగా భారత్ పాలకపార్టీకి చెందిన ఏ ఒక్క నాయకుడు కూడా మతతత్వ హింసకు వ్యతిరేకంగా ఇంతవరకు మాట్లాడలేదు. దారుణమైన విషయం ఏమంటే, భారతదేశంలోని ముస్లింలపై దాడి చేయడానికి ఇక్కడి మతతత్వ శక్తులు, బంగ్లాదేశ్‌లో హిందువులకు వ్యతిరేకంగా జరుగుతున్న హింసాత్మక సంఘటనలను నెపంగా ఉపయోగించుకుంటున్నాయి. బహిర్గతమవుతున్న జగడం ఒక విషయాన్ని రుజువు చేస్తే, దక్షిణ ఆసియాలో మొత్తంగా లౌకికవాదుల ఐక్యత అవసరమవుతుంది.

ఢాకాలో విద్యార్థులు పార్లమెంటును శుభ్రం చేస్తున్నారు. వారే రోడ్ల కూడలిలో వాహనాల రాకపోకల్ని నియంత్రిస్తున్నారు. ఆగస్టు 5న జరిగిన గందరగోళంలో లూటీ అయిన వస్తువులన్నీ నెమ్మదిగా తిరిగి వస్తున్నాయి. తాత్కాలిక ప్రభుత్వ అధినేత ఒక ప్రముఖ దేవాలయాన్ని సందర్శించి హిందువులకు తన సంఘీభావాన్ని ప్రకటించడాన్ని మేము చూశాం. వారి హోంశాఖ సలహాదారు హిందువులకు వ్యతిరేకంగా జరిగే హింసకు వ్యతిరేకంగా చాలా నిర్దిష్టమైన వైఖరిని తీసుకున్నాడు.

ప్రజాస్వామిక విప్లవం

ఈ పరిణామాల గురించి భారతదేశ ప్రజలకు తెలియజేసేందుకు ఎవ్వరికీ ఆసక్తి ఉన్నట్లు కనిపించడం లేదు. తమ దేశంలో ప్రజాస్వామిక విప్లవానికి వ్యతిరేకంగా ద్వేషభావాన్ని వ్యాప్తి చేస్తున్న భారతదేశ అధికార పార్టీతో సంబంధాలున్న వ్యక్తుల్ని చూసి బంగ్లాదేశ్ ప్రజలు నిరాశ చెందుతున్నారు. విప్లవం కారణంగా బంగ్లాదేశ్‌లో సృష్టించబడిన గందరగోళం, హింసను వ్యతిరేకించే పేరుతో అలాంటి వ్యక్తులు వారి సొంతదేశంలోనే ముస్లింలపై దాడులు చేయడం, వారి పాకలను ధ్వంసం చేయడం, వారిని కొట్టడం లాంటి చర్యల్ని కూడా వారు చూస్తున్నారు. ఇది ప్రజాస్వామిక విప్లవం కాదు, ఇది భారతదేశ వ్యతిరేక, హిందూ మత వ్యతిరేక కుట్ర అని రుజువు చేయాలని భారతదేశ అధికార పార్టీ అనుకుంటున్నట్టు విద్యార్థులు, ఇతరులు గమనిస్తున్నారు. బంగ్లాదేశ్ ప్రజల ప్రజా స్వామిక ఆకాంక్షలను భారతదేశ ప్రభుత్వం స్వాగతించకపోవడం దురదృష్టకరమని బంగ్లాదేశ్‌లో పండితులు అంటున్నారు. అయితే తనతో సన్నిహిత సంబంధాలు గల నిరంకుశ నాయకురాలి పతనం పట్ల భారత్ కలత చెందుతున్నట్లు కనపడుతుందని కూడా వారు చెబుతున్నారు.

బంగ్లాదేశ్‌లో జాతి సంహారానికి హిందువులు బాధితులు అవుతున్నారని భారతదేశంలో నకిలీ వీడియోలు చేస్తున్న ప్రచా రాన్ని కూడా బంగ్లాదేశ్ ప్రజలు గమనిస్తున్నారు. చాలా వీడియోలు నకిలీవి, అయినప్పటికీ వాటిని విచక్షణారహితంగా ప్రచారానికి ఉపయోగిస్తున్నారు. బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామిక విప్లవాన్ని స్వాగతించడంకంటే కూడా బంగ్లాదేశ్‌లో హిందువుల, మైనారిటీల రక్షణ పైనే భారత మొదటి అధికారిక ప్రతిస్పందన ఎక్కువ దృష్టిని కేంద్రీకరించినట్టు కనపించిందని బంగ్లాదేశ్ ప్రజలు గుర్తించారు. బంగ్లాదేశ్ లోని భారతీయుల, ముఖ్యంగా హిందూ భారతీయుల రక్షణను చూసేందుకు భారతదేశం ఒక కమిటీని ఏర్పాటు చేసినట్టు బంగ్లాదేశ్ వార్తాపత్రికలు గుర్తించాయి. బంగ్లాదేశ్ హిందువుల రక్షణ కోసం పారామిలిటరీ బలగాలతో కమిటీని ఏర్పాటు చేయడమంటే పొరుగు దేశ అంతర్గత వ్యవహారాల్లో ప్రత్యక్షంగా జోక్యం చేసుకుంటున్నట్లు కనపడుతోంది. ఈ కమిటీ ఎలా పని చేస్తుందో ఎవరైనా వివరించగలరా?

ఈ క్రమంలో బంగ్లాదేశ్‌లో విద్యార్థులు, ఇతరులు హిందువుల్ని, మైనారిటీలను రక్షిస్తున్నారని భారత విదేశాంగ మంత్రి కూడా పార్లమెంట్‌లో ప్రకటన చేశాడు. అలాంటప్పుడు భారతదేశంలో ప్రజాస్వామిక విప్లవానికి వ్యతిరేకంగా విద్వేషపూరిత ప్రచారాన్ని ఎందుకు వ్యాప్తి చేస్తున్నారు? బంగ్లాదేశ్‌లో జరుగుతున్న దానిని సనాతన ధర్మంపై దాడిగా ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి పేర్కొన్నాడు. భారత ప్రభుత్వం చెప్పినట్లు, బంగ్లాదేశ్ ప్రజలు, మైనార్టీలకు, హిందువులకు అండగా ఉన్నప్పుడు, భారతదేశంలో ఈ గావుకేకలు ఎందుకు? బంగ్లాదేశ్ విప్లవంలో హిందువులకు వ్యతిరేకంగా హింస అనేది అత్యంత గుర్తించదగిన అంశమా? అదే విప్లవాన్ని నిర్వచిస్తుందా? అనేది పరిశీలించాలి. అది కాకపోతే, ప్రతిస్పందనలను సరిచేయాల్సి ఉంటుంది. లేదా ఇది, వాస్తవంతో నిమిత్తం లేకుండా హిందువుల్లో అభద్రతను సృష్టించడానికి కొన్ని వర్గాలవారు కపటోపాయాన్ని ఉపయోగించే హక్కును కలిగి ఉన్నారనే వాదనా?

> బంగ్లాదేశ్‌లో విద్యార్థులు, ఇతరులు హిందువుల్ని, మైనారిటీలను రక్షిస్తున్నారని భారత విదేశాంగ మంత్రి కూడా పార్లమెంట్ లో ప్రకటన చేశాడు. అలాంటప్పుడు భారతదేశంలో ప్రజాస్వామిక విప్లవానికి వ్యతిరేకంగా విద్వేషపూరిత ప్రచారాన్ని ఎందుకు వ్యాప్తి చేస్తున్నారు? బంగ్లాదేశ్‌లో జరుగుతున్న దానిని సనాతన ధర్మంపై దాడిగా ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి పేర్కొన్నాడు. భారత ప్రభుత్వం చెప్పినట్లు, బంగ్లాదేశ్ ప్రజలు, మైనార్టీలకు, హిందువులకు అండగా ఉన్నప్పుడు, భారతదేశంలో ఈ గావుకేకలు ఎందుకు? బంగ్లాదేశ్ విప్లవంలో హిందువులకు వ్యతిరేకంగా హింస అనేది అత్యంత గుర్తించదగిన అంశమా? అదే విప్లవాన్ని నిర్వచిస్తుందా? అనేది పరిశీలించాలి. అది కాకపోతే, ప్రతిస్పందనలను సరిచేయాల్సి ఉంటుంది. లేదా ఇది, వాస్తవంతో నిమిత్తం లేకుండా హిందువుల్లో అభద్రతను సృష్టించడానికి కొన్ని వర్గాలవారు కపటోపాయాన్ని ఉపయోగించే హక్కును కలిగి ఉన్నారనే వాదనా?



మతపరమైన అంశాలు

షేక్ హసీనా రాజీనామా చేసి, దేశం విడిచి వెళ్లిన తరువాత బంగ్లాదేశ్‌లో అరాచకత్వాన్ని సృష్టించిన మాట వాస్తవం. అనేక ప్రాంతాల్లో గూండాలు వీధుల్ని అదుపులోకి తీసుకున్నారు. విచ్చలవిడిగా లూటీలు, దహనాలతో పాటు ప్రతిచోట హింసకు పాల్పడ్డారు. గత పాలక పార్టీ అయిన ఆవామీ లీగ్ కార్యకర్తలు, దాని అనుబంధ సంస్థల సభ్యులపైన దాడులతో పాటు దేవాలయాలపై కూడా దాడి చేశారు. హిందువుల ఇళ్లు, దుకాణాలను లక్ష్యంగా చేసుకున్నారు.

అయితే, విస్తరించబడిన ఆరెస్సెస్ శక్తుల వలె బంగ్లాదేశ్‌లో కూడా మతతత్వ శక్తులున్నాయనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. 1947లో కొనసాగుతున్న గందరగోళాన్ని అవకాశంగా తీసుకొని ఆరెస్సెస్, భారతదేశంలో ముస్లింలు పారిపోయే పరిస్థితిని సృష్టిం చే ప్రయత్నం చేసిన విషయాన్ని మర్చిపోకూడదు. స్థిరమైన మనసు, లౌకిక శక్తుల అప్రమత్తత కారణంగా అది పూర్తిగా విజయవంతం కాలేదు. అన్ని సమయాల్లో ప్రతి సమాజంలో, దేశంలో పెద్ద లక్ష్యంగా పిలువబడే ముసుగులో అల్పమైన, సంకుచితమైన "జాతీయవాద" లక్ష్యాలను సాధించేందుకు కుట్రలుపన్నే శక్తులు ఉంటాయి. ఇది బంగ్లాదేశ్‌లో కూడా జరుగ వచ్చు. రాజ్యం అదృశ్యమైనపుడు ఇస్లామిక్ వాదులు చురుకుగా మారవచ్చు, తీవ్రవాద శక్తులు రంగం పైకి రావచ్చు.

లౌకిక ప్రజల ఐక్యత అవసరం

అడగవలసిన అసలు ప్రశ్న ఏమంటే: ప్రభుత్వ వైఖరి ఏమిటి? ప్రజాస్వామిక విప్లవానికి నాయకత్వం వహిస్తున్న ప్రజల వైఖరి ఏమిటి? బంగ్లాదేశ్‌లో తాత్కాలిక ప్రభుత్వ నాయకుడు, అందరు మంత్రులు, విద్యార్థి నాయకులు ఏకపక్ష హింసకు వ్యతిరేకంగా చాలా బలంగా మాట్లాడుతున్నారు. ఈ విప్లవం ప్రతిఒక్కరి కోసం, దేశంలో ముస్లింలకు, హిందువులకు సమాన హక్కులుంటాయని వారు స్థిరంగా ధృఢ నిశ్చయంతో చెపుతున్నారు. నిరసనలు తెలియజేస్తున్న హిందువులకు వ్యతిరేకంగా ద్వేషభావాన్ని వ్యాప్తి చేసే స్వరాలు, ప్రభావశీలురు ప్రభుత్వం నుండి ఎవరూ లేరు. ఈ సమయంలో నిరసనలు వ్యక్తం చేయడం ద్వారా వారు ప్రజాస్వామిక విప్ల వాన్ని బలహీనపరుస్తూ, దానిని అపకీర్తిపాలు చేస్తున్నారని ఏ ఒక్కరూ అంటుండగా మేము వినలేదు. వారిని ఎవరూ దేశ వ్యతిరేకులని పిలవడం లేదు.

బాధ్యతలు స్వీకరించిన వెంటనే మహమ్మద్ యూనస్ మాట్లాడిన విధంగా భారత్ పాలకపార్టీకి చెందిన ఏ ఒక్క నాయకుడు కూడా మతతత్వ హింసకు వ్యతిరేకంగా ఇంతవరకు మాట్లాడలేదు. దారుణమైన విషయం ఏమంటే, భారతదేశంలోని ముస్లింలపై దాడి చేయడానికి ఇక్కడి మతతత్వ శక్తులు, బంగ్లాదేశ్‌లో హిందువులకు వ్యతిరేకంగా జరుగుతున్న హింసాత్మక సంఘటనలను నెపంగా ఉపయోగించుకుంటున్నాయి. బహిర్గతమవుతున్న జగడం ఒక విషయాన్ని రుజువు చేస్తే, దక్షిణ ఆసియాలో మొత్తంగా లౌకికవాదుల ఐక్యత అవసరమవుతుంది. బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామిక విప్లవం ఒక అవకాశాన్ని సృష్టిం చింది. మొత్తంగా ఈ ప్రాంతంలో ఒక నూతన ప్రజాస్వామిక పథక రూపకల్పనకు ఢాకాలోనే ఒక దక్షిణాసియా సదస్సును నిర్వహించడం ఉత్తమమైన పని. ఇందుకు "దక్షిణాసియా ప్రజాస్వామిక, లౌకికవాదులారా ఐక్యం కండి" అనే నినాదం ఎంతో అవసరం.

("ఫ్రంట్ లైన్" సౌజన్యంతో)
(వ్యాసకర్త ఢిల్లీ యూనివర్సిటీ హిందీ ప్రొఫెసర్)
అనువాదం: బోడపట్ల రవీందర్, 9848412451

విజేత..!

అధ:పాతాళానికి తొక్కేసిన రాజ్యం
ఇనుప పద ఘట్టనలను చీల్చుకుంటూ
పైకెగసిన అగ్నిధారవు నీవు...
అధికార మదాంధకారపు చీకట్లను
చీల్చుకువచ్చిన కాంతిపుంజం నీవు...
అదిరింపులు, బెదిరింపులు,
అవమానాలు, లాఠీదెబ్బలు
రోజుల తరబడి రోడ్లపై
నీవు సాగించిన పోరాటాలు...
మాతృభూమిపై నీ అపజయాలు...
పరాయి గడ్డపై గంటల్లోనే ముగ్గురు
జగజెట్టీలను మట్టి కురిపించిన నీకు
వంద గ్రాముల చిరు బరువు
పెనుభారమయ్యిందా?



గెలుపుకోసం రక్తం
ధారపోసినట్లు వినటమే
కానీ చూసింది మాత్రం నిన్నే....
ఎక్కడో, ఊహూ కాదు బహుశా
ఇక్కడే ఏదో ఇనుపపాదం
నీ విజయానికి
మోకాలు అడ్డుపెట్టిందేమో...
బహుశా నిన్ను భేష్ అనాల్సి వస్తుందని
రాజ్యం గొంతు భయపడిందేమో!
పసిడి పతకాన్ని
దూరం చేసింది అందుకేనేమో!
మొన్నరోడ్లపై నిన్ను ఈడ్చేస్తుంటే
మౌనరాగాలు తీసిన గొంతులు
నేడు నీకోసం గొంతెత్తుతున్నాయి....
ఇది కదా..నీ అసలైన విజయం...
ఆరు గ్రాముల పతకం లేకపోతేనేం
భారతమ్మ కన్న నిలువెత్తు
పుత్తడిబొమ్మవు నీవు
ఇంటా, బయటా బరిలో
నిలిచి, గెలిచిన విశ్వవిజేతవు నీవు..
మా కంటికొసల్లో నీరై నిలిచిన భేటీవి నీవు

- వీరాంజనేయులు

ఓ.. రక్త పిపాసి! ఇకనైనా యుద్ధం ఆపు!!



పాతూరి వేంకటేశ్వరరావు
9849081889

"ధర్మో రక్షతి, రక్షిత:" అన్నారు పెద్దలు. ఈ కర్తవ్యాన్ని విస్మరించి దేశాధినేతలు, మేధావులు, మిన్నకున్నా తనను తాను కాపాడుకునేందుకు, ధర్మం నిర్విరామంగా పరిశ్రమిస్తూనే ఉంటుంది. ఆక్రమంలో అధర్మానికి దన్నుగా నిలిచిన సజ్జనులను సైతం, నశింపజేస్తుంది ధర్మం! అధర్మ కౌరవులకు అండగా నిలిచిన భీష్మ, ద్రోణ, కర్ణ, కృపాదుల వినాశనమే నిదర్శనమంటూ మానవాళిని - హెచ్చరిస్తున్నది మహాభారతం! పాలస్తీనీ యులపై ఇజ్రాయిల్ నరమేధాన్ని కనీసం ఖండించని భారత పాల కులు, పార్టీలు, మేధావులూ మహాభారత - హెచ్చరికను మననం చేసుకుందురుగాక! ఇజ్రాయిల్‌ది అధర్మం! పాలస్తీనాది ధర్మం! అనటానికి చరిత్రే సాక్ష్యం! నాడు ప్రపంచంలో నిలువనీడ లేక, తలదాచుకుంటామని అరబ్బుల నభ్యర్థించి వలసొచ్చి పాలస్తీనాలో స్థిరపడ్డారు యూదులు. 1920 నాటికి పాలస్తీనా జనాభాలో 8శాతంగా ఉన్న యూదులు, వలసలద్వారా 1945 నాటికి 35.8శాతానికి పెరిగారు. 1) నాడు పాలస్తీనాను పాలిస్తున్న బ్రిటిష్ వారి అండదండలు 2) దేశ దేశాల నుండి తాము కూడబెట్టుకు వచ్చిన ధనరాశులతోను, అప్పుల పాలై యున్న అరబ్బుల లక్షల ఎకరాల పొలాలను,-బ్రిటిషు వారు ఉద్దేశ పూర్వకంగా అప్పుల ఊబిలోకి నెట్టారు.అదే సందర్భంలో పాలస్తీనా జాతీయ పరిశ్రమలను, కారుచౌకగా కొన్నారు యూదులు! అలా ప్రణాళికాబద్ధంగా పెంచుకున్న అంగ, అర్థ, సైనిక బలగాలతో-సగానికి పైగా పాలస్తీనాను దురాక్రమించి 'ఇజ్రాయిల్'ను స్థాపించుకున్నారు యూదులు.

అపార చమురు నిక్షేపాలున్న పశ్చిమాసియాలోని అరబ్బు దేశాల చమురు దోపిడీకి, పశ్చిమాసియాకు ముఖద్వారం వంటి పాలస్తీనాలో తమకు అనుకూల దేశం ఉండాలన్న కుట్రతోనే అక్కడ ఇజ్రాయిల్ స్థాపనకు ధృఢమైన పునాది వేసింది బ్రిటన్! ఆ దురుద్దేశంతోనే ఇజ్రాయిల్‌ను పెంచి బలోపేతం చేసింది అమెరికా! - నాడు యూదులకంటూ సొంత దేశం ఏర్పాటును ప్రపంచ దేశాలన్నీ అంగీకరించిన మాట వాస్తవం! ఎందుకంటే? - 'నాడు ప్రపంచంలో దారుణ చిత్రహింసలకు, హిట్లర్ నరమేధానికి గురైన బాధితులు యూదులన్నది చారిత్రక సత్యం!హింసలు తాళలేక తమ పూర్వికులు నివసించిన పాలస్తీనాకు తిరుగుముఖం పట్టారు. అరబ్బుల నభ్యర్థించి,పాలస్తీనాలో చొరబడి, సర్వతోముఖాభివృద్ధిని సాధించాక ఇజ్రాయిల్‌ను స్థాపించుకున్నారు యూదులు. కానీ బాధాకరమేమిటంటే, 'దయతో తలదాచుకోనిచ్చిన - యజమానిని వెలుపలికి నెట్టేసి, గుడారం మొత్తాన్ని ఆక్రమించిన ఒంటెలా' ఆశ్రయమిచ్చిన అరబ్బులను తన్ని తరిమేసిన చందంగా ఉంది ఇజ్రాయిల్ తీరు. పాలస్తీనాను దురాక్రమించి ఏకైక యూదురాజ్యాన్ని నిర్మించాలన్న దురాశతో అరబ్బులపై దాడులకు తెగబడి నాటి 'హిట్లర్'ను తలపిస్తున్నాడు నేటి నెతన్యాహూ'!

ఐరాస జోక్యం-ఇజ్రాయిల్ బరితెగింపు

బ్రిటిష్ వారు వెళ్లాక మరింతగా బరితెగించింది ఇజ్రాయిల్! ఐ.రా.స. జోక్యం చేసుకుని 55శాతం ఇజ్రాయిల్‌కు, 45శాతం పాలస్తీనాకు- భూభాగాన్ని కేటాయించి రాజధాని జెరూసలేంను స్వీయ పర్యవేక్షణలో ఉంచుకున్నది. కానీ 'ఐరాస' ఆదేశాలను తిరస్కరించి మూడొంతులకు పైగా పాలస్తీనాను దురాక్రమించింది ఇజ్రాయిల్. అందుకే 1990లో ఇజ్రాయిల్‌ను 'టెర్రరిస్టు-స్టేట్'గా ప్రకటించింది ఐరాస! బ్రిటన్, అమెరికా, వాటి తోక దేశాలు తప్ప, ప్రపంచ దేశాలు, అంతర్జాతీయ న్యాయస్థానాలు, ఐరాస నిరసిస్తున్నా సరే, నిస్సిగ్గుగా అరబ్బులపై మారణకాండను కొనసాగిస్తూనే ఉన్నాడు ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహూ! అంతేగాదు పాలస్తీనా యూదులదే, దాన్ని తొలుత పాలించింది యూదులేనంటూ సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేయిస్తున్నాడు!



కానీ చారిత్రక వాస్తవమేమంటే, మతాలు పుట్టక పూర్వం ప్రజలందరిదీ మానవజాతే! మానవులంతా సంచార తెగలవారే! ప్రపంచమంతటా సంచరిస్తూ తమ కనుకూల మనుకున్న ప్రాంతాలలో ఆయా తెగలు స్థిరపడ్డాయ్. ఉదా॥ ఊదయా పర్వతాల నుండి పాలస్తీనాకు వలసొచ్చిన సంచార తెగవారే యూదులు! వారికన్నా ముందే 'పిలస్తీనీ' తెగవారు ఆ ప్రాంతాన్ని పాలించారు. వారి పాలనలో ఉన్న భూభాగమే 'పాలస్తీనా'గా వ్యవహరింప డబుతుందని అంటున్నారు చరిత్రకారులు! పిలస్తీనీలు-యూదులు-రోమన్ క్రైస్తవులు, టర్కీ అరబ్బులు, బ్రిటిష్ వారు పాలించిన ప్రాంతం పాలస్తీనా! రోమన్ క్రైస్తవ ప్రభువుల పాలనలో వారి ఆంక్షలకు తాళలేక 90శాతం యూదులు వివిధ దేశాలకు వెళ్లారు! అరబ్బు చక్రవర్తుల ఆంక్షలకు తాళలేక క్రైస్తవులూ వలసవెళ్లారు. పాలకులెవరైనా, నాటికీ, నేటికీ పాలస్తీనాను అంటి పెట్టుకున్న మెజారిటీ ప్రజలు అరబ్బులేనని చరిత్ర చెబుతున్నది! పాలస్తీనా భిన్న జాతుల నిలయమని రాజధాని జెరూసలేంలోని - 'సాల్మన్ టెంపుల్' (పవిత్రగృహం) - 'హోలీ చెపల్ చెప్ చర్చ్' - 'అల్‌అక్సా' మసీదులు చాటి చెబుతున్నాయ్!

'బతకడం కోసం చద్దాం':హమాస్

నాడు హిట్లర్ నరమేధానికి తాళలేక యూదులు చెల్లాచెదురైనట్లు నేడు నెతన్యాహూ నరమేధానికి తాళలేక నలభై శాతం అరబ్బులు వలసెళ్లారు.ఇరవైశాతం అరబ్బులు ఇరుగుపొరుగు దేశాల్లో శరణార్థులుగా తలదాచుకుంటున్నారు. అలా వెళ్లిన అరబ్బులు తిరిగి పాలస్తీనా వచ్చేందుకు వీల్లేకుండాను- వెళ్లిపోయిన అరబ్బుల ఇండ్లు, పొలాలనూ ఇజ్రాయిల్ సొంతం చేసుకునేలా చట్టాలు చేసింది ఇజ్రాయిల్! మిగిలిన అరబ్బులను 'గాజా' 'వెస్ట్‌బ్యాంక్'లలో కుక్కి అక్కన్నుండి వాళ్లు వెలుపలకు రాకుండా సరిహద్దు - చుట్టూ 60కి॥ మీ॥ మేర లక్షల కోట్ల రూ॥తో క్షిపణి నిరోధక ఉక్కుకంచెను నిర్మించుకున్నది ఇజ్రాయిల్! అయినా సరే! ఇజ్రాయిల్ నిర్బంధంలో చిత్రహింసలకు గురవుతూ బందీలుగా ఉన్న ఆరువేల మంది పాలస్తీనా విముక్తి పోరాట యోధులను విడిపించుకోటానికి 7అక్టోబర్2023న ఉక్కు కంచెను ఛేదించుకుని ఇజ్రాయిల్‌లో ప్రవేశించి, వివిధ రంగాల ఇజ్రాయిల్ ప్రముఖులు 199 మందిని, తమవెంట గాజాకు తరలించు కెళ్లారు 'హమాస్' వీరులు! ఇజ్రాయిల్ చేతిలో రోజూ చస్తూ బతకటం కన్నా, బతకటం కోసం చద్దాం!" అన్న పాలస్తీనా ప్రజల ఆకాంక్షనుండి పుట్టిన పోరాట సంస్థయే 'హమాస్'.

నాటి నుండి ప్రతికార చర్యల పేరిట హాస్పిటల్స్, స్కూల్స్,- మసీదులు, నివాస గృహాలపై విచక్షణా రహితంగా బాం బులు కురిపించింది. 'గాజా'ను శ్మశానం చేసాడు నెతన్యాహూ! జూలై (24 సం॥) నాటికి నలభై వేల మంది కాలిపోగా, లక్షల సంఖ్యలో నిర్వాసితులు, వికలాంగులయ్యారు. అంతేగాదు, ఇరాన్ రాజధాని టెహరన్‌కు అతిథిగా వెళ్లిన 'హమాస్' అగ్రనేత 'ఇస్మాయిల్ హనియా' ను-లెబనాన్ రాజధాని బీరూట్ కెళ్లి అక్కడ 'హిజబుల్లా' సీనియర్ మిలిటరీ కమాండర్ 'షాద్ షుకుర్' ను ఒకే రోజు 31జులై 24న హతమార్చింది ఇజ్రాయిల్! తద్వారా ప్రపంచంలో ఎవరినైనా, ఏదేశాని కెళ్లైనా చంపేస్తాం, తస్మాత్ జాగ్రత్త! అని ప్రపంచ దేశాలకు సవాలు విసిరింది ఇజ్రాయిల్!


నెతన్యాహూ బలగర్వం-అరబ్‌దేశాల ఐక్యత

నాడు 'హిట్లర్' దురహంకారం ప్రపంచ దేశాలను ఐక్యం చేసినట్లు 'మోడీ' లెక్కలేని తనమే 'ఇండియా' కూటమికి బీజం వేసినట్లు 'నెతన్యాహూ' బలగర్వమే, పాలస్తీనా పోరాట సంస్థలను, అరబ్‌దేశాలను ఐక్యం చేసింది! పాలస్తీనా విముక్తి కోసం విడివిడిగా పోరాడుతున్న గాజాలోని 'హమస్' వెస్ట్‌బ్యాంక్‌లోని 'ఫతా'లతో సహా పద్నాలుగు పార్టీలు, సంస్థలన్నీ సమైక్యంగా పోరాడేందుకు, ఒకే జాతీయ ప్రభుత్వ రూపకల్పనకు చైనా మధ్యవర్తిత్వంతో అంగీకరించినయ్! అలా 'పాలస్తీనా జాతీయ కూటమి' చిగురించింది.1967 నాటి సరిహద్దులతో-తూర్పు జెరూసలేం రాజధానిగా స్వంతంత్ర పాలస్తీనా ఏర్పాటుకు అంగీకరిస్తేనే, ఇజ్రాయిల్ సంబంధాలు కొనసాగిస్తామని, అమెరికా అనుకూల 'సౌదీ అరేబియా'తో సహా యూఏఈ దేశాలన్నీ తెగేసి చెప్పినయ్. 'ఓరక్త పిపాసీ నెతన్యాహూ! తక్షణం పాలస్తీనాపై మారణకాండను ఆపెయ్' అంటూ ఎర్రచొక్కాలతో, మిన్నంటే నినాదాలతో పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు అమెరికాలోని యూదులు! ఇండిపెండెంట్ 'బెర్నీ శాండల్స్'తో సహా యాభై మంది డెమోక్రటిక్ సెనేటర్లు' నెతన్యాహూ ప్రసంగాన్ని బహిష్కరించారు.'రషీదాతైబ్' అను సెనేటర్ "యుద్ధ నేరస్తుడు నెతన్యాహూ!" అన్న ప్లకార్డును వైట్‌హౌస్ ఛాంబర్‌లోనే - ప్రదర్శించాడట.పాలస్తీనాపై ఇజ్రాయిల్ యుద్ధం అధర్మం. ఈ చర్యల్ని ప్రపంచ దేశాలూ ఖండిస్తున్నాయి. "ధర్మమేవ జయతే!" పాలస్తీనాకు విజయోస్తు! ప్రపంచ శాంతి వర్థిల్లుగాక!

> మిగిలిన అరబ్బులను 'గాజా' 'వెస్ట్‌బ్యాంక్'లలో కుక్కి అక్కన్నుండి వాళ్లు వెలుపలకు రాకుండా సరిహద్దు - చుట్టూ 60కి॥ మీ॥ మేర లక్షల కోట్ల రూ॥తో క్షిపణి నిరోధక ఉక్కుకంచెను నిర్మించుకున్నది ఇజ్రాయిల్! అయినా సరే! ఇజ్రాయిల్ నిర్బంధంలో చిత్రహింసలకు గురవుతూ బందీలుగా ఉన్న ఆరువేల మంది పాలస్తీనా విముక్తి పోరాట యోధులను విడిపించుకోటానికి 7అక్టోబర్2023న ఉక్కు కంచెను ఛేదించుకుని ఇజ్రాయిల్‌లో ప్రవేశించి, వివిధ రంగాల ఇజ్రాయిల్ ప్రముఖులు 199 మందిని, తమవెంట గాజాకు తరలించు కెళ్లారు 'హమాస్' వీరులు! ఇజ్రాయిల్ చేతిలో రోజూ చస్తూ బతకటం కన్నా, బతకటం కోసం చద్దాం!" అన్న పాలస్తీనా ప్రజల ఆకాంక్షనుండి పుట్టిన పోరాట సంస్థయే 'హమాస్'.

అర్హులందరికీ రుణమాఫీ

- ఏదైనా కారణంతో రాకుంటే కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేయొచ్చు
- ఇందుకోసమే అదనంగా మరో రూ.5 వేల కోట్లు రిజర్వ్ : సీఎం రేవంత్‌రెడ్డి



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి మరోసారి స్పష్టం చేశారు. ఏదైనా కారణంతో రుణమాఫీ కాని రైతుల కోసం కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ కౌంటర్లు ఏర్పాటు చేశామని చెప్పారు. రైతులు అక్కడి అధికారులను సంప్రదించాలని అన్నారు. తమ దగ్గర ఉన్న డేటా ప్రకారం రూ.26 వేల కోట్లు రైతు రుణమాఫీకి అవసరమని, కానీ అర్హులందరినీ దృష్టిలో ఉంచుకుని రూ.31 వేల కోట్లకు బడ్జెట్‌లో అప్రూవల్ ఇచ్చామని అన్నారు. అదనంగా రూ.5 వేల కోట్లను కేటాయించినట్టు చెప్పారు. బీజేపీ, బీఆర్ఎస్ నేతలు రైతు రుణమాఫీపై రోడ్డెక్కడానికి బదులు కలెక్టరేట్‌లలో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ సెల్‌లో రైతులకు రుణమాఫీ చేసేందుకు సంప్రదించాలని సూచిం చారు. ఇందుకోసం అవసరమైతే బీఆర్ఎస్ నేతలు వాలంటీర్లుగా మారాలని హితవు పలికారు. తన మార్క్ కోసం ఆగస్టు 15 లోపు రైతు రుణమాఫీ చేశానన్నారు. రుణమాఫీ ఎట్లా చేస్తరు? కానే కాదని బీఆర్ఎస్ నేతలు విమర్శించిన విషయాన్ని గుర్తు చేశారు. కానీ ఇచ్చిన మాట ప్రకారం చేసి చూపామన్నారు. ఇప్పుడు విమర్శలు చేస్తోన్న బీఆర్ఎస్ నేతలు ఐదేండ్లలో నాలుగు వాయిదాలలో కూడా రుణమాఫీ పూర్తి చేయలేదని గుర్తు చేశారు. పెట్టుబడులే లక్ష్యంగా తైవాన్ కంపెనీతో భేటీలో భాగంగా ఢిల్లీ వచ్చిన సీఎం శుక్రవారం మీడియాతో చిట్‌చాట్ చేశారు. రేషన్‌కార్డుకు, రైతు రుణమాఫీకి సంబంధం లేదని చెప్పారు. రూ. 2 లక్షల వరకు ఒక కుటుంబంలో ఎంత మందిపై లోన్లు ఉన్నా మాఫీ చేస్తామన్నారు. దేశంలో ఇప్పటి వరకు ఏ రాష్ట్ర ప్రభుత్వం ఇలాంటి చారిత్రాత్మకమైన నిర్ణయం తీసుకోలేదన్నారు. మోడీ సర్కార్ అన్ని రాష్ట్రాలకు కలిపి చేస్తే, తాము ఒక్క రాష్ట్రంలోనే చేశామన్నారు. పదేండ్లలో కేసీఆర్ రూ.20 వేల కోట్లు కూడా రుణమాఫీ చేయలేదని గుర్తు చేశారు. ప్రస్తుతం ఏం చేయాలోనని కేసీఆర్ ప్రశాంతంగా ఆలోచిస్తున్నారని ఎద్దేవా చేశారు.

నేను ప్రజలకు చేయాల్సిందే పెండింగ్‌లో ఉంది...

తాను ఏం చేసినా ఎవరో ఒక్కరి నుంచి వ్యతిరేకత వస్తుందని, తాను మాత్రం ఎవరికీ అన్యాయం చేయట్లేదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తనను ప్రజలు రాష్ట్రానికి ముఖ్యమంత్రిని చేశారని.. ఇప్పుడిక ప్రజలకు చేయాల్సిందే పెండింగ్‌లో ఉందని చెప్పారు. ఈ దశలో ఎన్ని అడ్డంకులెదురైనా పూర్తి చేస్తానని అన్నారు. పెట్టుబడులు పెట్టాలని కంపెనీ, బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ పాలసీ కింద తీసుకుంటే తప్ప రాష్ట్రానికి పెట్టుబడులు రావన్నారు. 'మనం వెళ్లి ప్రభుత్వ విధానాలు ఏంటో వివరిస్తే వారు చర్చించుకుంటారు కదా. మన పాలసీ విని పూర్తి చేయడానికే నా విదేశీ పర్యటన. కలిసినోళ్లు అంతా పెడతారన్న గ్యారెంటీ లేదు. పెడతారన్నోళ్లంతా పెడతారనే గ్యారెంటీ లేదు. మన రాష్ట్ర ప్రభుత్వ విధానాలు, మన దగ్గర ఉన్న మౌలిక సదుపాయాలు గురించి వివరించడానికే వెళ్లాం. ఢిల్లీలో ఉన్నవాళ్లకే హైదరాబాద్‌లో ఏం ఉందో తెలియదు. అమెరికాలో ఉన్న వాళ్లకి ఏం తెలుసు. ఇంకో రెండెళ్ల తర్వాతనైనా పెట్టుబడులు పెట్టాలంటే ఆలోచించుకుంటారు కదా.' అని అన్నారు. స్కిల్ యూనివర్సిటీ కంపెనీలకు కావాల్సిన నైపుణ్య శిక్షణను అందిస్తామన్నారు. ఇండియాలోనే బెస్ట్ పాలసీని తీసుకువస్తామని వెల్లడించారు.

ఫ్రీ హ్యాండ్ ఇచ్చాం...

అక్రమ కూల్చివేతలపై హైడ్రాకు పూర్తి స్వేచ్ఛనిచ్చామని సీఎం అన్నారు. అందులో పలు చట్టాలు లేవని... పలువురు ఆరోపిస్తున్నారని, అలాంటి వాటిని ఆర్డినెన్స్ తెచ్చి తెస్తామని చెప్పారు. అంతేతప్ప హైడ్రా మ్యానేజ్‌మెంట్ చేయడం తన పని కాదన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలోని చెరువులు, కుంటలు, ఇతర భూముల పరిరక్షణ ప్రభుత్వ బాధ్యతని తెలిపారు. రాష్ట్రంలో డ్రగ్స్‌ను అరికట్టడానికి టీజీన్యాబ్ సమర్థవంతంగా పనిచేస్తోందన్నారు.

వర్గీకరణ అంశాన్ని మ్యానిఫెస్టోలోనే పెట్టాం...

వర్గీకరణపై పార్టీ అగ్ర నాయకులు చెప్పిందే తాను చేశానని, దానికే కట్టుబడి ఉన్నామని సీఎం రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. ఈ అంశంపై రాజకీయంగా తనకు ఒక స్టాండ్ ఉందని అన్నారు. తాను సీఎం అవ్వగానే మంత్రి దామోదర రాజనర్సింహ ఆధ్వర్యంలో సబ్ కమిటీ వేసి న్యాయపరంగా ముందుకెళ్లామన్నారు. సుప్రీం కోర్టులో ముగ్గురు సీనియర్లను పెట్టి రాష్ట్ర ప్రభుత్వం వాయిస్ వినిపించా మన్నారు. కానీ వర్గీకరణపై మంద కష్ణ మాదిగకు బిగ్ హగ్ ఇచ్చిన మోడీ.... ఇప్పుడు ఏ క్లారిటీ ఇవ్వకుండా తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. నిజంగా బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే, ఉభయ సభల్లో బిల్లు పెట్టాలన్నారు. ఓబీసీపై రాహుల్ గాంధీ కోరారని, దానికి కట్టుబడి ఉన్నట్టు చెప్పారు. ఎస్సీ వర్గీకరణ అనేది పొలిటికల్ రిజర్వేషన్ కాదని... ఉద్యోగ, ప్రమోషన్‌లకు సంబంధించి రిజర్వేషన్ మాత్రమే అని గుర్తు చేశారు. రిజర్వేషన్‌లకు ఎంత మద్దతు ఉందో.. రిజర్వేషన్‌లు వద్దు అని అంతే వ్యతిరేకించే వారు ఉన్నారని అన్నారు.

చంద్రబాబు గురువుకాదు... కొలిగ్...

ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు తనకు రాజకీయ గురువుకాదని... కేవలం కొలిగ్(సహచరుడు) మాత్రమే అని సీఎం చెప్పారు. చంద్రబాబు ఒక మంచి నేత అని... అయితే తనను ఆయన రాజకీయనేతగా తీర్చిదిద్దలేదని, తానే స్వయంగా నేతగా ఎదిగానన్నారు. 2007 లో ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను ఓడించబోతున్నట్లు మాజీ సీఎం రాజశేఖర్ రెడ్డితో ఛాలెంజ్ చేసి... ఇండిపెండెంట్ ఎమ్మెల్సీగా గెలిచానన్నారు. ఆ ఎన్నికలు రాజశేఖర్ రెడ్డి వర్సెస్ రేవంత్ రెడ్డిగా జరిగాయని చెప్పారు. కాంగ్రెస్ లో జైపాల్ రెడ్డి, డి కె అరుణలను ఓడిస్తూ... స్వతంత్ర ఎమ్మెల్సీగా గెలిచి టీడీపీలో చేరినట్లు గుర్తు చేశారు. తాను కాంగ్రెస్‌లో చేరే సందర్భంలో తన జన్మకుండలి(రాజకీయ జీవితం) గురించి రాహుల్ కు స్పష్టంగా వివరించామని చెప్పారు. ఏబీవీపీలో ఫుల్ టైమర్ గా తాను పని చేసినట్లు గుర్తు చేశారు. ఆ టైంలో కిషన్ రెడ్డి, మురళీధర్ రావు, రాం మాధవ్ లు తనకు సీనియర్లుగా ఉండేవారన్నారు. ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ తాను కాలేజ్ రోజుల్లో మంచి మిత్రులమని, హైదరాబాద్ గల్లీల్లో తిరిగే వాళ్లమని చెప్పారు.

జైల్లో పెట్టి ఉద్యోగాలు పోగొట్టుకున్నరు..

ప్రతి పక్ష నేతల్ని అణగదొక్కాలనే ఆలోచన సరైంది కాదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అలా చేసినందుకే కేసీఆర్, జగన్ ప్రజలు ఇచ్చిన ఉద్యోగాలు(సీఎం పదవులు) కోల్పోయారన్నారు. అలాగే బంగ్లాదేశ్ లో ప్రభుత్వం కుప్పకూలిందని గుర్తు చేశారు. ఆ దేశం గురించి పక్కన పెడితే... ఈ వ్యవహారంలో తానే ఒక ఉదాహరణ అని చెప్పారు. ఏపీ, తెలంగాణల్లో ప్రతిపక్షనేతల్ని జైల్లో పెడితే ఏమైందన్నారు. కేసీఆర్ తనను జైల్లో పెట్టారని.. ఇప్పుడు తాను సీఎం అయినట్లు తెలిపారు. అలాగే మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి, చంద్ర బాబును జైల్లో పెడితే... అక్కడ ఆయన కూడా ముఖ్యమంత్రిగా గెలిచారని గుర్తు చేశారు. ప్రజలు అణగదొక్కే విధానాన్ని అంగీకరించరన్నారు.

మా క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ హైదరాబాద్..

మోడీకి, చంద్రబాబుకు హైదరాబాద్ లేదని... మోడీకి అహ్మదాబాద్, చంద్రబాబుకు విజయవాడ మాత్రమే ఉందన్నారు. కానీ తెలంగాణ క్యాపిటల్ ఇన్వెస్ట్మెంట్ హైదరాబాద్ అని స్పష్టం చేశారు. ఫార్మా, ఐటీతో పలు రంగాల్లో హైదరాబాద్ బెస్ట్ ప్లేస్ అని చెప్పారు. హైదరాబాద్‌లోనే పెట్టుబడులు పెట్టడానికి ప్రధాన కారణం రాష్ట్ర మంతటికి కనెక్టివిటీ ఉందన్నారు. టైర్ 2, 3లోనూ ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. అమెరికాలో తెలుగు ఫాస్టెస్ట్ గ్రోయింగ్ లాంగ్వేజీగా ఉందని... ఎక్కువగా తెలుగు ప్రజలే ఐటీ కడుతున్నారని చెప్పారు. వాళ్లంతా ఇండియాలో ఎందుకు పెట్టుబడులు పెట్టకూడదన్నారు. అది తెలంగాణలో పెట్టాలని కోరుతున్నట్లు వెల్లడించారు.

రుణమాఫీ చేస్తే రైతులు బ్యాంకుల చుట్టూ తిరుగుతారా?

- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంగ్రెస్ సర్కారు రైతుల రుణమాఫీ చేస్తే రైతులు బ్యాంకుల చుట్టూ ఎందుకు తిరుగుతున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ప్రశ్నించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో 60 లక్షల మంది రుణాలు తీసుకుంటే ప్రభుత్వం 44 లక్షల మంది మాత్రమే అని తప్పుడు లెక్కలు చెబుతున్నదని విమర్శించారు. అందూలోనూ ప్రభుత్వం 22 లక్షల మంది రైతులకు మాత్రమే రుణమాఫీ ఎందుకు చేసింది? అని ప్రశ్నించారు. రైతుభరోసా రూ.15 వేల కోట్లను ఎగ్గొట్టి రూ.17 వేల కోట్లు మాత్రమే రుణమాఫీ చేసి మోసం చేసిందని తెలిపారు. మూడు విడతల్లో రూ.31 వేల కోట్లు రుణమాఫీని ఆగస్టులోపు చేస్తామని రేవంత్ సర్కార్ మాట తప్పిందన్నారు. ఆరు గ్యారంటీలు అమలు చేస్తే రాజీనామా చేస్తానని హరీశ్‌రావు అన్నారని గుర్తుచేశారు. దాన్ని వక్రీకరిస్తూ కాంగ్రెస్ నేతలు రుణమాఫీ చుట్టూ తిప్పుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాటమీద నిలబడ్డ హరీశ్ రావును మాటతప్పిన రేవంత్‌రెడ్డి రాజీనామా చేయాలని దుర్భాష లాడటం హాస్యాస్పదమని కొట్టిపారేశారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి, మాజీ కార్పోరేషన్ చైర్మన్ ఇంతియాజ్ ఇసాక్ తదితరులు పాల్గొన్నారు.

19న రాఖీపౌర్ణమికి సాధారణ సెలవు ప్రకటించాలి

సీఎం రేవంత్‌రెడ్డికి టీఎస్ జీహెచ్ఎంఏ లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఈ నెల 19న రాఖీ పౌర్ణమి పండుగను పురస్కరించుకుని ఐచ్ఛిక సెలవుకు బదులుగా సాధారణ సెలవుగా ప్రకటించాలని తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ హెడ్మాస్టర్ల సంఘం (టీఎస్‌జీహెచ్ఎంఏ) రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పి రాజభాను చంద్రప్రకాశ్, ప్రధాన కార్యదర్శి ఆర్ రాజగంగారెడ్డి శుక్రవారం లేఖ రాశారు. రాఖీ పౌర్ణమికి ఏటా ప్రభుత్వ ఉత్తర్వుల్లో ఐచ్ఛిక సెలవుగా ప్రకటిస్తున్నారని తెలిపారు. అన్న చెల్లెలు, అక్క, తమ్ముని మధ్య ఆత్మీయతకు ప్రతీకగా భావించి రాష్ట్రవ్యాప్తంగా బాలికలు, స్త్రీలు ఈ పండుగను ఉత్సాహంగా జరుపుతారని పేర్కొన్నారు. సాధారణ సెలవుగా ఉంటే సముచితంగా ఉంటుందని తెలిపారు.

అధికార లాంఛనాలతో డాక్టర్ ఆర్.ఎన్.అగర్వాల్ అంత్యక్రియలు

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



(ఫైల్)

భారత రక్షణ వ్యూహాత్మక అగ్ని మిస్సైల్ రూపకర్త, భారత మిస్సైల్ కార్యక్రమ దిగ్గజం డాక్టర్ రామ్‌నారాయణ్ అగర్వాల్ అంత్య క్రియలను ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలను ఆ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. శనివారం హైదరాబాద్‌లో అగర్వాల్ అంత్యక్రియలు జరగనున్నట్టు సీఎస్ తెలిపారు. రక్షణ రంగంలో ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా 1990 లో పద్మశ్రీ, 2000 లో పద్మ భూషణ్ అవార్డులను కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. 1983లో భారత ప్రభుత్వం ప్రారంభించిన అత్యంత ప్రతిష్టాత్మక భారత మిస్సైల్ కార్యక్రమంలో డాక్టర్ అరుణాచలం, డాక్టర్ ఏ.పీ.జె. అబ్దుల్ కలాంతో కలసి డాక్టర్ ఆర్.ఎం. అగర్వాల్ పనిచేశారని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లాబరేటరీ (ఎఎస్ఎల్)వ్యవస్థాపక డైరెక్టర్‌గా అగర్వాల్ పనిచేశారని తెలిపారు. 2005లో డిఫెన్స్ రీసర్చ్, డెవలప్ మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీవో) లో విశిష్ట శాస్త్ర వేత్తగా పదవీ విరమణ చేశారని తెలిపారు. భారత లాంగ్ రేంజ్ మిస్సైల్ టెక్నాలజీ రంగంలో దేశం స్వయం ప్రతిపత్తి సాధించడంలో విశేష సేవలందించారని గుర్తు చేశారు.

రాష్ట్రంలో పలుచోట్ల అతిభారీ వర్షం

- 31 ప్రాంతాల్లో భారీ వర్షపాతం
- 541 ప్రాంతాల్లో కురిసిన వాన
- పలు జిల్లాలకు ఎల్లో హెచ్చరిక

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో కరీంనగర్ జిల్లా చిగురుమామిడిలో, మెదక్ జిల్లా కేంద్రంలో అతి భారీ వర్షం కురిసింది. రెయిన్‌గేజ్‌లో చిగురుమామిడిలో 17.18 సెంటీమీటర్లు, మెదక్‌లో 13 సెంటీమీటర్ల అతిభారీ వర్షపాతం నమోదైంది. రాష్ట్రంలో శుక్రవారం ఉదయం 8:30 గంటల నుంచి రాత్రి పది గంటల వరకు 541 ప్రాంతాల్లో వర్షం కురిసింది. 31 చోట్ల భారీ వర్షం పడింది. హైదరాబాద్‌లోనూ పలుచోట్ల మోస్తరు వాన పడింది. ఒకటెండ్రు చోట్ల భారీ వర్షం కురిసింది. శని, ఆది, సోమ, మంగళ వారాల్లో పలు జిల్లాల్లో 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయనీ, అక్కడక్కడా భారీ, ఎక్కువ ప్రాంతాల్లో మోస్తరు వానలు పడుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రధాన అధికారి డాక్టర్ కే.నాగరత్న హెచ్చరించారు. ఈ మేరకు ఆయా జిల్లాలకు వచ్చే నాలుగు రోజులకు ఎల్లో హెచ్చరిక జారీ చేశారు. 17న వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో, 18, 19 తేదీల్లో ఆదిలాబాద్, కొమ్రంభీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో, 20న ఆదిలాబాద్, కొమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు, ఎక్కువ ప్రాంతాల్లో మోస్తరు వాన పడే సూచనలున్నాయి.

శుక్రవారం రాత్రి పది గంటల వరకు నమోదైన వర్షపాతం

చిగురుమామిడి (కరీంనగర్)	17.18 సెంటీమీటర్లు
మెదక్ (మెదక్)	13.00 సెంటీమీటర్లు
కొయ్యూరు(భూపాలపల్లి)	11.28 సెంటీమీటర్లు
పాతరాజంపేట(కామారెడ్డి)	10.93 సెంటీమీటర్లు
శనిగరం(సిద్దిపేట)	10.30 సెంటీమీటర్లు
పాతూరు (మెదక్)	9.5 సెంటీమీటర్లు
పూడూరు(జగిత్యాల)	9.3 సెంటీమీటర్లు



జీహెచ్ఎంసీ పరిధిలో వాతావరణం ఇలా..

జీహెచ్ఎంసీ పరిధిలో వచ్చే 48 గంటల పాటు ఆకాశం మేఘావృతమై ఉంటుంది. నగరంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం పడే అవకాశముంది. అయితే, కొన్నిసార్లు ఒకటెండ్రు ప్రాంతాల్లో ఉరుములతో తీవ్రమైన వర్షం పడే ప్రమాదముంది. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీయొచ్చు.

పాస్టర్ దైవప్రసాద్‌కు భద్రత కల్పించండి

- అణగారిన క్రైస్తవ జన సమాఖ్య

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైదరాబాద్ గాజులరామారాం దైవకృపా మందిరం పాస్టర్ దైవ ప్రసాద్‌కు భద్రత కల్పించాలని అణగారిన క్రైస్తవ జన సమాఖ్య డిమాండ్ చేసింది. ఈ మేరకు సమాఖ్య వ్యవస్థాపక జాతీయ కన్వీనర్ నాగళ్ల పోచయ్య ఇశ్రాయేల్, జాతీయ కో కన్వీనర్లు ఆంధ్రూ జేవియర్, ఎం.వీ.జాన్సన్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజున దుండగులు దాడిలో తీవ్రంగా గాయపడ్డ ప్రసాద్ ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

నాలుగేండ్లలో

మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్

ఐఎంఎఫ్ డిప్యూటీ ఎండీ గీతా గోపినాథ్ అంచనా



న్యూఢిల్లీ : భారత వృద్ధి రేటు మెరుగ్గా ఉందని.. 2027 నాటికి ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించొచ్చని అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్) డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ గీతా గోపీనాథ్ అంచనా వేశారు. గత ఆర్థిక సంవత్సరంలో భారత్ అంచనాలకు మించి వృద్ధి రేటు నమోదు చేసిందన్నారు. ప్రయివేటు వినిమయం పుంజుకుందన్నారు. గతేడాది వినిమయ వృద్ధి 4 శాతంగా ఉండగా.. ఈ ఏడాది గ్రామీణ వినిమయంలో పెరుగుదలతో ప్రయివేటు వినిమయం మెరుగవుతుందని భావిస్తున్నామన్నారు. రుతుపవనాలు సానుకూలంగా ఉండటంతో పంటల దిగుబడులు గణనీయంగా పెరిగే అవకాశం ఉందని అన్నారు. వ్యవసాయ ఆదాయాలు పెరిగితే గ్రామీణ వినిమయం పెరగొచ్చన్నారు.

బిజినెస్

పిట్టీ ఇంజినీరింగ్ లాభాల్లో 47శాతం వృద్ధి

హైదరాబాద్ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో పిట్టీ ఇంజినీరింగ్ నికర లాభాలు 47 శాతం వృద్ధితో రూ.20.55 కోట్లుగా నమోదయ్యాయి. ఇదే సమయంలో కంపెనీ రెవెన్యూ 33 శాతం పెరిగి రూ.387 కోట్లుకు చేరిందని ఆ కంపెనీ ఎండీ, సీఈఓ అక్షయ్ ఎస్ పిట్టీ తెలిపారు. గడిచిన త్రైమాసికంలో తాము ఎప్పుడూ లేని విధంగా 14,992 మెట్రిక్ టన్నుల అమ్మకాలను నమోదు చేశామన్నారు. 2024 సెప్టెంబర్ వరకు తమ పెట్టుబడుల ప్రణాళికలు కొనసాగుతాయన్నారు.

నందన్ డెనిమ్ లాభాల్లో 339 శాతం వృద్ధి

న్యూఢిల్లీ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో 339 శాతం వృద్ధితో 7.49 కోట్ల నికర లాభాలు సాధించినట్టు నందన్ డెనిమ్ తెలిపింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.1.71 కోట్ల లాభాలు ఆర్జించినట్టు తెలిపింది. ఇదే సమయంలో రూ.554.37 కోట్లుగా ఉన్న నికర అమ్మకాలు.. గడిచిన క్యూ1లో 30.17 శాతం పెరిగి రూ.721.62 కోట్లకు చేరాయి. ఇటీవలే ఈ కంపెనీ తమ రూ.10 ముఖ విలువ కలిగిన షేర్లను 1:10 నిష్పత్తిలో విభజించనున్నట్టు ప్రకటించింది.

స్టింగ్ మెటావర్స్ ఆకర్షణీయ ఫలితాలు

హైదరాబాద్ : డిజిటల్ గేమింగ్ ప్లాట్‌ఫాం, వెబ్ 3.0 ఎంటర్‌ప్రైజెస్ వేదికయిన స్టింగ్ మెటావర్స్ లిమిటెడ్ ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో రూ.50.02 కోట్ల రెవెన్యూతో రూ.5.38 కోట్ల నికర లాభాలు సాధించింది. బయో గ్రీన్ పేపర్స్ లిమిటెడ్ విలీనానికి ఎన్‌సిఎల్‌టి ఆమోదం తెలిపిందని పేర్కొంది. దీంతో 2023-24లో స్టింగ్ మెటావర్స్ రెవెన్యూ రూ.151.21 కోట్లకు చేరగా.. రూ.10.82 కోట్ల నికర లాభాలు నమోదు చేసినట్టు వెల్లడించింది. తమ సంస్థ గిఫ్ట్ సిటీ, హైదరాబాద్, యూఏఈ, హాంగ్‌కాంగ్‌లో గ్లోబల్ ఆఫీసులను కలిగి ఉందని ఆ కంపెనీ తెలిపింది. వచ్చే మూడేళ్లలో తాము ప్రతీ ఏడాది సగటున 100 శాతం వృద్ధిని అంచనా వేస్తున్నామని స్టింగ్ మెటావర్స్ ఫౌండర్ క్రిష్ణ మోహన్ మీనవల్లి విశ్వాసం వ్యక్తం చేశారు.

హైటెక్స్‌లో ఏకకాలంలో మూడు ప్రదర్శనలు



హైదరాబాద్ : హైదరాబాద్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఎక్స్‌పోజిషన్స్ లిమిటెడ్ (హైటెక్స్)లో ఏకకాలంలో మూడు రకాల పారిశ్రామిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ఆగస్టు 16 నుంచి 19 వరకు జరగనున్న హింటెక్స్, ఐపెక్, ఈకో సస్టైన్ ప్రదర్శనలను శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ మూడు ఎక్స్‌పోలను పలువురు పారిశ్రామిక, వాణిజ్య సంస్థల ప్రతినిధులు లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వివిధ పరిశ్రమ వర్గాల సారథులు, ప్రతినిధులు అయినా శైలేంద్ర సరోజ్, డిఎస్ సెట్టి, రాజ్ కుమార్ శర్మ, రమేష్ మియ్యపురం, అమియా కుమార్ సాహు, ఎ.భాస్కర్‌రెడ్డి, ఎ ప్రవీణ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ ఈవెంట్‌లు ఉత్పాదక రంగంలో తాజా ఆవిష్కరణలు, పరిణామాలను ప్రదర్శించడానికి, నెట్‌వర్కింగ్, సహకారం, వృద్ధికి అవకాశాలను అందించడానికి ఒక చక్కటి వేదికగా నిలుస్తాయని వారు తెలిపారు. ఇందులో 450 ఎగ్జిబీటర్లు పాల్గొంటున్నారని హైటెక్స్ బిజినెస్ హెడ్ శ్రీకాంత్ తెలిపారు.

పెరిగిన సలసర్ టెక్నో రెవెన్యూ

హైదరాబాద్ : సలసర్ టెక్నో 2024-25 జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో రూ.291.56 కోట్ల రెవెన్యూ ప్రకటించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.261.74 కోట్ల రెవెన్యూ నమోదు చేసింది. ఇదే సమయంలో రూ.10.13 కోట్ల నికర లాభాలు సాధించగా.. గడిచిన క్యూ1లో 9.82 కోట్ల లాభాలు ఆర్జించింది. కంపెనీ నికర వ్యయాలు రూ.248.56 కోట్ల నుంచి రూ.279.34 కోట్లకు పెరిగాయి.

19న బాలాజీ జ్యువెల్లర్స్ స్టోర్ ప్రారంభం

హైదరాబాద్ : నగరానికి చెందిన బాలాజీ గోల్డ్ అండ్ డైమండ్ జ్యువెల్లర్స్ ఆగస్టు 19న తన తొలి స్టోర్‌ను ప్రారంభిస్తున్నట్టు ప్రకటించింది. ఫిల్మ్ నగర్ రోడ్ నెం.4లో దీన్ని ఏర్పాటు చేస్తోన్నట్లు పేర్కొంది. దీనికి సంబంధించి శుక్రవారం ప్రీ-లాంచ్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. తమ కొత్త బొటిక్ ల్యాబ్‌లో అద్భుతమైన వజ్రాలు, వెండి, బంగారు ఆభరణాలు లభ్యమవుతాయని బాలాజీ గోల్డ్ అండ్ డైమండ్ జ్యువెల్లర్స్ ఎండీ జి.మదుసూదన్ తెలిపారు.

ముఖ్యమంత్రి గారూ.. మాట నిలబెట్టుకోండి..

- సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి
- 'ప్రజాపాలన'లో ప్రణాళిక సంఘం వైస్ చైర్మెన్ చిన్నారెడ్డికి వినతి



నవతెలంగాణ-సిటీబ్యూరో

సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగాలను క్రమబద్ధీకరిస్తామన్న మాటను నిలబెట్టుకోవాలని, తక్షణమే తమను రెగ్యులర్ చేయాలని తెలంగాణ రాష్ట్ర సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. మహాత్మ జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో శుక్రవారం ప్రజా పాలన కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర నాయకులు గంగుల కృష్ణారెడ్డి, తీరందాసు సంతోష్‌కుమార్, మొగిలిచర్ల శ్రీనివాస్, రాధారెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మెన్ చిన్నారెడ్డికి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వందల సంఖ్యలో వచ్చిన ఉద్యోగులు వినతి పత్రాలను సమర్పించారు. సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగులు 15 ఏండ్లుగా చాలీచాలని వేతనాలతో పాఠశాల విద్యాశాఖలో పనిచేస్తూ విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

అనంతరం రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ.. గతేడాది సెప్టెంబర్ 13న తాము ఉద్యోగాల క్రమబద్ధీకరణ కోసం చేపట్టిన రిలే నిరాహార దీక్షా శిబిరాలను సీఎం రేవంత్ రెడ్డితో పాటు మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సీతక్క, ఎమ్మెల్యేలు సందర్శించారని గుర్తు చేశారు. 100 రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మీ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేస్తామని ఆనాడు హామీ ఇచ్చారని చెప్పారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకొని తక్షణమే తమ ఉద్యోగాలను రెగ్యులర్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్షకు సంబంధించిన 11 విభాగాల కాంట్రాక్ట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

సమగ్ర కుల గణన జరగాలి

- స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్లు కల్పించాలి
- లేదంటే 42 మందితో ఆమరణ నిరాహార దీక్ష : విలేకర్ల సమావేశంలో ఆర్ కృష్ణయ్య వెల్లడి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఎవరూ అడగకముందే కాంగ్రెస్ జనగణన, బీసీ కులగణన చేపడతామని కామారెడ్డి డిక్లరేషన్‌ను ప్రకటించిందనీ, ఆ వాగ్దానం ఎక్కడ పోయిందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య ప్రశ్నించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ప్రెస్ క్లబ్‌లో బీసీ సంఘాల నేతృత్వంలో జన సభ రాజారాం యాదవ్ అధ్యక్ష తన విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నిల షెడ్యూల్‌ను ప్రకటించే లోపే 42శాతం రిజర్వేషన్లు ప్రకటించాలనీ, లేదంటే.. షెడ్యూల్ ప్రకటించగానే 42మందితో సామూహిక ఆమరణ దీక్ష చేపడతామని హెచ్చరించారు. బీసీ కుల గణన చేస్తామంటూ కాంగ్రెస్ నమ్మబలికిందని విమర్శించారు. ఆ పార్టీ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు చూస్తే..పలు అనుమానాలు కలుగు తున్నాయని చెప్పారు. ఉద్యమమనే ముల్లుకర్రతో ప్రభుత్వాన్ని కదిలించాలని బీసీలకు పిలుపునిచ్చారు. దేశాన్ని, రాష్ట్రాన్ని దశాబ్దాలుగా పాలించిన అగ్రవర్ణాల వారు, బీసీలు రాజ్యాధి కారాన్ని కావాలంటే..ఎలా ఒప్పుకుంటారని ప్రశ్నించారు. ఇది ఎవరో ఇస్తే వచ్చేది కాదనీ, రాజ్యాంగం ప్రకారం జనాభా ప్రాతిపదికన బీసీలకు రావాల్సిన వాటా అని తెలిపారు. ఆత్మగౌరవం కోసం పోరాడుదామని పిలుపునిచ్చారు. ఇంకెన్ని రోజులు ఈ దొరతనాన్ని, పెత్తనాన్ని సహిద్దామంటూ ప్రశ్నించారు. 42శాతం రిజర్వేషన్లు ఇవ్వటం వల్ల ప్రభుత్వానికి నష్టమేమీ లేదని చెప్పారు. విలేకర్ల సమావేశంలో హిందూబీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు బత్తుల సిద్దేశ్వర్లు, తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మేకపోతుల నరేందర్‌గౌడ్, సోషల్ జస్టిస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పిడికిలి రాజు, బీసీ సంక్షేమ సంఘం నాయకులు బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

22 నుంచి టెన్త్, ఇంటర్ దూరవిద్య ఫీజు చెల్లింపు

- టాస్ డైరెక్టర్ పివి శ్రీహరి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పదో తరగతి, ఇంటర్ దూరవిద్య వార్షిక పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల ఫీజు చెల్లింపు ప్రక్రియ ఈనెల 22 నుంచి ప్రారంభం కానుంది. ఈ మేరకు తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ (టాస్) డైరెక్టర్ పివి శ్రీహరి శుక్ర వారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఫీజు చెల్లింపునకు తుది గడువు ఆలస్య రుసుం లేకుండా ఈనెల 30 వరకు ఉందని తెలిపారు. ఆలస్య రుసుం రూ.25తో ఈనెల 31 నుంచి వచ్చేనెల 4 వరకు, రూ.50తో అదేనెల 5 నుంచి 9వ తేదీ వరకు చెల్లించేందుకు అవకాశముందని సూచించారు. అక్టోబర్ మొదటి వారంలో పదో తరగతి, ఇంటర్ దూరవిద్య పరీక్షలను నిర్వహిస్తామని పేర్కొన్నారు.

ప్రజావాణికి 316 దరఖాస్తులు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మహాత్మా జ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 316 దరఖాస్తులు అందాయి. రెవెన్యూ శాఖకు 50, మైనార్టీ సంక్షేమ శాఖకు 61, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు 27, విద్యుత్ శాఖకు 81, ఆరోగ్యశ్రీకి 21, ఇతర శాఖలకు సంబంధించి 79 దరఖాస్తులందాయి. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ చిన్నారెడ్డి, ప్రజాపాలన ప్రత్యేక అధికారి దివ్య దరఖాస్తులను స్వీకరించారు. ప్రజావాణికి వచ్చిన వారి నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటిని పరిష్కరించేందుకు తమ వంతు కృషి చేస్తామని హామీనిచ్చారు.

రాజీవ్‌గాంధీ విగ్రహావిష్కరణకు రండి

- సోనియాగాంధీకి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి
- ప్రాంగణాన్ని పరిశీలించిన మంత్రులు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఈనెల 20న రాజీవ్‌గాంధీ జయంతిని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ఆయన విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయం వద్ద నిర్వహించనుంది. ఆ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రావాలంటూ శుక్రవారం ఢిల్లీలో సోనియగాంధీని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆహ్వానించినట్టు తెలిసింది. అదే రోజు రైతు రుణమాఫీ ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వరంగల్ జిల్లాలో రైతు కృతజ్ఞత సభను నిర్వహించనుంది. ఇదిలా ఉండగా శుక్రవారం సచివాలయం ముందు రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్న ప్రాంగణాన్ని మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ తదితరులు పరిశీలించారు. విగ్రహ ప్రాంగణం మ్యాప్‌ను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఇప్పటికే విగ్రహం ఏర్పాటు పూర్తయినందున ల్యాండ్ స్కేపింగ్, ఇతర పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని మంత్రులు ఆదేశించారు.

అమరవీరులకు అవమానం



బషీర్‌బాగ్ విద్యుత్ అమరవీరుల స్థూపం పక్కన చెత్తకుండీలు

జీహెచ్ఎంసీ నిర్లక్ష్యం

వెంటనే తొలగించాలని సీపీఐ(ఎం) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ డిమాండ్

నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ నగర నడిబొడ్డులో అమరవీరులకు తీవ్ర అవమానం జరుగుతోంది. జీహెచ్ఎంసీ అధికారుల నిర్లక్ష్యం బయటపడింది. అభివృద్ధి చేయాల్సిన విద్యుత్ అమరవీరుల స్మారక స్థూపాన్ని పట్టించుకోకపోవడమే కాకుండా.. ఆ పక్కనే చెత్త కుండీలను పెట్టారు. 2000లో విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో బషీర్‌బాగ్ దగ్గర పోలీస్ కాల్పుల్లో ముగ్గురు అమరులైన విషయం తెలిసిందే. వారి స్మారకంగా బషీర్‌బాగ్‌లో ప్రభుత్వం స్మారక స్థూపాన్ని ఏర్పాటు చేసింది. స్థూపం వద్ద ప్రతి సంవత్సరమూ ఆగస్టు 28న సభలు, నిరసన కార్యక్రమాలు జరుగుతాయి. ఇంతటి ప్రాముఖ్యత కల్గిన ప్రాంతాన్ని జీహెచ్ఎంసీ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. జీహెచ్ఎంసీ చేపట్టిన 'స్వచ్ఛదనం - పచ్చదనం' కార్యక్రమంలోనైనా దృష్టి సారించలేదు. పైగా.. విద్యుత్ అమరవీరుల స్మారక స్థూపం పక్కనే చెత్తకుండీలను ఏర్పాటు చేశారు. స్మారక స్థూపం ప్రాంగణాన్ని అభివృద్ధి చేస్తామని ఇంజినీరింగ్ అధికారులు హామీ ఇచ్చారని సీపీఐ(ఎం) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం.శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం బషీర్‌బాగ్‌లోని విద్యుత్ అమరవీరుల స్మారక స్థూపాన్ని జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.శ్రీనివాస్ రావుతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. స్మారక స్థూపం ప్రాంగణాన్ని అభివృద్ధి చేయాలంటూ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో జూన్‌లో అధికారులకు వినతిపత్రం అందజేసినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పైగా, స్థూపం పక్కనే జీహెచ్ఎంసీ పారిశుధ్య విభాగం అధికారులు మూడు చెత్త బాక్సులతో కూడిన ఐరన్ స్టాండ్స్ ఏర్పాటు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దాంతో ఆ ప్రాంతంలో చెత్తాచెదారంతో పరిసరాలన్నీ కంపుకొడు తున్నాయన్నారు.

చనిపోయిన పావురాలను సైతం అక్కడే పడేస్తున్నారని తెలిపారు. స్మారక స్థూపం పక్కన చెత్త డబ్బాలను ఏర్పాటు చేయడం జీహెచ్ఎంసీ అధికారుల పూర్తి అనాలోచిత చర్యలని విమర్శించారు. వెంటనే వాటిని తొలగించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి స్మారక స్థూపం ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని, ఫెన్సింగ్, గేట్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు జీహెచ్ఎంసీ కమిషనర్‌కు ట్విట్టర్‌లో వినతిపత్రాన్ని పంపించారు.

'మధ్యాహ్న భోజనాన్ని' హరేరామ హరేకృష్ణకు ఇవ్వొద్దు

- సమస్యల పరిష్కారం కోసం 21న విద్యాశాఖ కమిషనరేట్ ఎదుట ధర్నా

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణలో మధ్యాహ్న భోజన పథకం నిర్వహణను హరే రామ హరే కృష్ణ ఫౌండేషన్‌కు ఇచ్చే ప్రతిపాదలను రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలనీ, పెండింగ్ బిల్లులు, వేతనాలు, ఇతర సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్(సీఐటీయూ అనుబంధం) రాష్ట్ర అధ్యక్షులు వై.స్వప్న, ప్రధాన కార్యదర్శి ఎస్వీ.రమ డిమాండ్ చేశారు. ఇవే డిమాండ్లతో ఈ నెల 21న మధ్యాహ్న భోజన కార్మికులు వంటను బంద్‌పెట్టి హైదరాబాద్‌లోని విద్యా శాఖ కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడించనున్నట్టు ప్రకటించారు. శుక్రవారం ఈ మేరకు విద్యాశాఖ కమిషనర్‌కు మెయిల్ ద్వారా లేఖ పంపారు. హరే రామ హరే కృష్ణ ఫౌండేషన్ ప్రతినిధులతో ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి సమావేశమై సెంట్రలైజ్డ్ కిచెన్ ద్వారా ఉదయం టిఫిన్, మధ్యాహ్న భోజనాన్ని రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేసేందుకు అధ్యయనం చేయాలని సూచించడం తగదని పేర్కొన్నారు. ఇప్పటికే కొడంగల్‌లో సెమీ రెసిడెన్షియల్ పైలెట్ ప్రాజెక్టు పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. ఈ ప్రతిపాదనలను వెంటనే ఉపసంహరించుకోవాలని వారు కోరారు. రాష్ట్రవ్యాప్తంగా 54,201 మంది మధ్యాహ్న భోజన కార్మికులు 25 వేల పాఠశాలల్లో, 24 లక్షల మంది విద్యార్థులకు వేడివేడి భోజనం వండి పెడుతున్నారని పేర్కొన్నారు. వారు 24 ఏండ్లుగా అనేక కష్టనష్టాలకు ఓర్చి పనిచేస్తున్నారనీ, వారిలో అత్యధికులు ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజిక తరగతుల వారే ఉన్నారని వివరించారు. మధ్యాహ్న భోజన నిర్వహణను హరేరామ హరే కృష్ణ ఫౌండేషన్‌కు ఇస్తే 54 వేల మంది కార్మికులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడతారని వాపోయారు. మ్యానిఫెస్టోలో ప్రకటించిన రూ.10 వేలను వెంటనే అమలు చేయాలనీ, పెండింగ్ బిల్లులు, వేతనాలు చెల్లించాలని కోరారు. గుడ్లకు అదనంగా బడ్జెట్ కేటాయించాలనీ, అవసరమైన గ్యాస్‌ను సబ్సిడీపై ఇవ్వాలని విన్నవించారు. అక్రమ తొలగింపులు అరికట్టాలనీ, రాజకీయ వేధింపులు ఆపాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపు కార్డులివ్వాలని డిమాండ్ చేశారు.

రుణమాఫీపై దృష్టి మరల్చే యత్నం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రైతు రుణమాఫీని పూర్తిగా అమలు చేయటంలో విఫలమైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆ విషయంలో ప్రజల దృష్టిని మరల్చేందుకు ప్రయత్నిస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించారు. అందుకే ఖమ్మం జిల్లా పర్యటనలో ఆయన గావుకేకలు, పెడబొబ్బలు పెట్టారని ఎద్దేవా చేశారు. కేవలం 40 శాతం మంది రైతులకే రుణమాఫీ చేసి, అందరికీ చేసినట్టు ఊదరగొడుతున్నారని దుయ్యబట్టారు. ఈ అంశంపై చర్చించేందుకు సీఎం సొంత నియోజకవర్గమైన కొడంగల్‌తోపాటు రాష్ట్రంలోని ఏ ప్రాంతంలోనైనా పర్యటిద్దామంటూ సీఎంకు సూచించారు. ఆ రకమైన చర్చకు సిద్ధమా అని రేవంత్‌కు సవాల్ విసిరారు. ఏ ఒక్క గ్రామం, మండలంలోనైనా నూటికి నూరు శాతం రుణమాఫీ అయిందని నిరూపిస్తే తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తాననీ, రాజకీయాలు మానేసి, ఇంట్లో కూర్చుంటానని వ్యాఖ్యానించారు.

శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, శ్రీనివాసగౌడ్, జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే కేపీ వివేకానంద, ఎమ్మెల్సీలు నవీన్ కుమార్, తాతా మధు తదితరులతో కలిసి కేటీఆర్ విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఏకకాలంలో రుణమాఫీ చేస్తామంటూ చెప్పటం ద్వారా కాంగ్రెస్ రైతులను మోసం, దగా చేసిందని ఆయన ఈ సందర్భంగా విమర్శించారు. ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ అనేది భారతదేశంలోనే అతి పెద్ద జోకంటూ ఎద్దేవా చేశారు. దేవుళ్ల మీద ఒట్టేసి రుణమాఫీ చేస్తామంటూ నమ్మబలికిన సీఎం... రైతులను నట్టేట ముంచారని ఆవేదన వ్యక్తం చేశారు. వారిని మోసం చేసిన పాపానికి ఆయనపై చీటింగ్ కేసు పెట్టాలని అన్నారు. కాంగ్రెస్ మోసాన్ని ఎక్కడికక్కడ ఎండగట్టాలంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజా ప్రతినిధులకు పిలుపునిచ్చారు. ఇదే అంశంపై గవర్నర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. ఆయన స్పందించకపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని హెచ్చరించారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా డిసెంబరు 9న ఒకే ఒక్క సంతకంతో రెండు లక్షల రుణమాఫీ చేస్తామంటూ చెప్పిన సీఎం, బీఆర్ఎస్ హయాంలో ఆ పథకాన్ని పొందిన రైతులకు కూడా దాన్ని వర్తింపజేస్తామంటూ ప్రకటించారని గుర్తు చేశారు. ఒకే ఒక్క ఏడాది ప్రభుత్వం, తాను కడుపుకట్టుకుంటే రూ.40 వేల కోట్ల మేర రుణాలను మాఫీ చేయటం పెద్ద కష్టమేమీ కాదంటూ ఆయన ప్రగల్భాలు పలికారని అన్నారు. ఆ తర్వాత అదే ముఖ్యమంత్రి రుణమాఫీకి రూ.35 వేల కోట్లు అవసరమవుతాయంటూ పేపర్లకు లీకులిచ్చారని దెప్పిపొడిచారు. ఆ తర్వాత ఆ లెక్కమారిందనీ, రుణమాఫీకి రూ. 31 వేల కోట్లు అవసరమవుతాయంటూ క్యాబినెట్‌లో తీర్మానించారని వివరించారు. చివరకు రూ.17,934 కోట్లే విడుదల చేశారని విమర్శిం చారు. ఎన్నికల సమయంలో అందరికీ రుణమాఫీ అని చెప్పిన ముఖ్యమంత్రి, ఆ తర్వాత కొందరికే అనటం దారుణమని వాపోయారు. అనవసర కొర్రీలు, షరతులు, నియమ నిబంధనలు పెట్టటం ద్వారా 60 శాతం మంది రైతులకు రుణమాఫీ చేయకుండా ఎగ్గొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రకంగా ఆ పథకం ఫెయిల్ కావటంతో రుణమాఫీ సభకు రావాల్సిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సైతం డుమ్మా కొట్టారని ఎద్దేవా చేశారు. మరోవైపు తన విదేశీ పర్యటన విఫలం కావటంతో సీఎం తీవ్ర అసహనానికి లోనై ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని వ్యాఖ్యానించారు. ఆయన గత ఎనిమిది నెలల కాలంలో 19 సార్లు ఢిల్లీ చుట్టూ చక్కర్లు కొట్టారని విమర్శించారు. ఇంకెన్నిసార్లు అక్కడకు వెళతారోనంటూ సెటైర్లు విసిరారు. ఇటీవల బీఆర్ఎస్ అంతర్గత సమావేశంలో 'మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం'పై తాను చేసిన వ్యాఖ్యలకు కేటీఆర్ ఈ సందర్భంగా విచారం వెలిబుచ్చారు. 'నా అక్క చెల్లెళ్లకు క్షమాపణలు చెబుతున్నా...' అని వ్యాఖ్యానించారు. తనకు ఎవ్వరినీ కించపరిచే ఉద్దేశం లేదనీ, యధాలాపంగా మాట్లాడానని తెలిపారు. తనకున్న సంస్కారం, హుందాతనం సీఎంకు లేకపోవటం వల్లే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డికి ఆయన ఇంత వరకూ క్షమాపణలు చెప్పలేదని విమర్శించారు.

పార్టీ నిర్మాణాన్ని పటిష్టం చేసి, దానిని బలోపేతం చేసేందుకు వీలుగా సెప్టెంబరులో ఇతర రాష్ట్రాల పర్యటనకు వెళుతున్నట్టు కేటీఆర్ తెలిపారు. తద్వారా ఆయా రాష్ట్రాల్లోని ప్రాంతీయ పార్టీల పనితీరును పరిశీ లిస్తామని చెప్పారు. తద్వారా బీఆర్ఎస్ కమిటీల్లో అవసరమైన మార్పులు చేర్పులు చేస్తామన్నారు.

బీజేపీలో బీఆర్ఎస్ విలీనం తథ్యం

(మొదటిపేజీ తరువాయి)

భాగంగా కేసీఆర్‌కు గవర్నర్, కేటీఆర్‌కు కేంద్రంలో మంత్రి పదవి, అపోజీషన్ లీడర్‌గా హరీశ్‌రావుకు పదవులు దక్కనున్నాయని చెప్పారు. ఇక రాజ్యసభలోని నలుగురు బీఆర్ఎస్ ఎంపీల విలీనానికి సమానంగా లిక్కర్ కేసులో కవితకు బెయిల్ రానుందన్నారు. అలాగే కవితకు రాజ్యసభ పదవి వస్తుందని కామెంట్ చేశారు. చిట్ చాట్‌లో భాగంగా రేవంత్ బీజేపీ, బీఆర్ఎస్ విలీనంపై స్పందించారు.

వాళ్లకే కార్పోరేషన్ పదవులు...

కాంగ్రెస్‌లో పార్టీ నేతలకే కార్పోరేషన్ పదవులు ఇస్తామని సీఎం అన్నారు. ఈ కార్పోరేషన్ పదవులు మూడేండ్లేనని... ఇప్పటి వరకు పార్టీలోని పలువురికి అవకాశం కల్పించామన్నారు. మిగిలిన వారికి నెక్ట్స్ రౌండ్‌లో ఛాన్స్ ఉంటుందని క్లారిటీ ఇచ్చారు. మూడేండ్లు పీసీసీగా తన బాధ్యతను సక్రమంగా నిర్వహించానన్నారు. ఇప్పుడు ఆ బాధ్యతను అధిష్టానం ఎవరికైనా అప్పగించవచ్చన్నారు. తనను పీసీసీగా నియమించే టైంలో ఎవరి అభిప్రాయాలు తీసుకోలేదని... ఇప్పుడు అలాగే ఉంటుందన్నారు. పార్టీ నియమించనంత వరకు తమ అభిప్రాయాలు చెప్తామని... . ఇచ్చిన తర్వాత ఎవరైనా తమ మనిషే అని చెప్పుకొచ్చారు.

102 జీవోకు మార్గదర్శకాలు విడుదల

- తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం హర్షం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

జీవో 102ను అమలు చేసేందుకు మార్గదర్శకాలు ఇవ్వటం హర్షణీయమని తెలంగాణ రజక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి ఆశయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు సంఘం బృందం మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వృత్తి సమస్యలను వివరించటంతో ఆయన సాను కూలంగా స్పందించారని తెలిపారు. వెంటనే మార్గదర్శకాలు విడుదల చేస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ప్రభుత్వ సంస్థ (ఆస్పత్రులు, పోలీస్ శాఖలు, గురుకుల పాఠశాలలు, వివిధ దేవస్థానాలు, గెస్ట్ హౌస్)ల్లో వృత్తిపని రజక సొసైటీలకే ఇవ్వాలని గత ప్రభుత్వం జీవో విడుదల చేసినప్పటికీ మార్గదర్శకాలు లేక అమలు కాలేదని తెలిపారు. ఆయా ప్రభుత్వ సంస్థల్లో వృత్తిపనిని కాంట్రాక్టర్లు చేస్తున్నారని తెలిపారు. దీంతో వేలాది మంది వృత్తి దారులు ఉపాధి కోల్పోతున్నారని పేర్కొన్నారు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం అందుకనుగుణంగా మార్గదర్శకాలు విడుదల చేయటం హర్షణీయమని తెలిపారు.

పోలీస్‌నంటూ బెదిరింపులు

- తనిఖీల పేరుతో వసూళ్లు
- ఇరానీ గ్యాంగ్‌కు చెందిన నకిలీ పోలీస్ అరెస్ట్

నవతెలంగాణ-సిటీబ్యూరో

పోలీస్‌నంటూ అమాయకులను బెదిరించి వసూళ్లకు పాల్పడుతున్న ఇరానీ ముఠాకు చెందిన వ్యక్తిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుని నుంచి రూ.95వేలు, (నకిలీ) పోలీస్ ఐడీ కార్డుతోపాటు ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం డీసీపీ వైవీఎస్ సుదీంద్ర వివరాలు వెల్లడించారు.

బీదర్‌కు చెందిన జాఫర్ అలీ అలియాజ్ లంబూ పాత నేరస్థుడు. సులువుగా డబ్బులు సంపాదించాలని హైదరాబాద్‌కు వస్తూ పోతుంటాడు. నగరానికి వచ్చిన సమయంలో బ్యాంక్‌లు, రిజిస్ట్రార్ కార్యాలయాలతోపాటు ఆర్థిక లావాదేవీలు జరిగే ప్రాంతాల్లో సంచరిస్తూ ప్రత్యేక నిఘా వేస్తాడు. ఎవరైనా బ్యాగ్‌లో, కవర్‌లో డబ్బులు తీసుకెళ్తుంటే గమనించి వారిని అడ్డుకుంటాడు. పోలీస్‌నంటూ తనిఖీల పేరుతో వారి నుంచి డబ్బులు తీసుకుంటాడు. వాటిని లెక్కిస్తున్నట్టు నటించి వారి దృష్టిని మళ్లించి కొంత డబ్బులను కొట్టేస్తాడు. అనుమానం రాకుండా మిగిలి డబ్బులను తిరిగి ఇచ్చేస్తాడు. ఇదే తరహాలో నగరంలో ఐదుగురిని మోసం చేశాడు. బాధితుల ఫిర్యాదుతో విచారణ చేపట్టిన టాస్క్‌ఫోర్సు పోలీసులు సీసీటీవీ కెమెరాలను పరిశీలించారు. నిందితుడిని అరెస్టు చేసి విచారించారు. దాంతో నిందితుడు ఇరానీ గ్యాంగ్ సభ్యుడిగా తేలింది. నిందితుడిపై బీదర్, బెంగళూర్‌తోపాటు బేగంబజార్, సుల్తాన్ బజార్, అఫ్జల్‌గంజ్, కుస్సుంపురా లంగర్‌హౌజ్ తదితర పోలీస్‌స్టేషన్లలో కేసులున్నాయని డీసీపీ తెలిపారు.

ఉపరాష్ట్రపతికి గవర్నర్,మంత్రి పొన్నం ఘనస్వాగతం

- పాల్గొన్న సీఎస్, డీజీపీ, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు వేణుగోపాల్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్, ఆయన సతీమణి డాక్టర్ సుదేశ్ ధన్కర్ శుక్రవారం హైదరాబాద్‌కు విచ్చేశారు. శంషాబాద్ విమా నాశ్రయంలో ఉపరాష్ట్రపతి దంపతులకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు హర్కార వేణుగోపాల్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, డీజీపీ జితేందర్ మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. అనంతరం ఉపరాష్ట్రపతి దంపతులు కన్హాశాంతివనంలో ఏర్పాటు చేసిన ప్రయివేటు కార్యక్రమంలో పాల్గొన్నారు.

రైతులంతా తెలంగాణ వైపే చూస్తున్నారు

- ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ పార్టీ వాగ్దానంమేరకు రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ పూర్తి చేయడంతో దేశ రైతులంతా తెలంగాణ వైపు చూస్తున్నారని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య చెప్పారు. వరంగల్ రైతు డిక్లరేషన్‌కు కట్టుబడి సీఎం రేవంత్‌రెడ్డి రుణమాఫీ ప్రక్రియ పూర్తి చేశారని తెలిపారు. ఒకేసారి రెండు లక్షలు మాఫీ చేసిన చరిత్ర రేవంత్‌రెడ్డికే దక్కుతుందని చెప్పారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సీఎల్పీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. సాంకేతిక కారణాల వల్ల రుణమాఫీ కాని రైతులు ఆందోళన చెందవద్దన్నారు. హరీశ్‌రావు మాట మీద నిలబడి రాజీనామా చేస్తావా? లేక తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పి అమరవీరుల స్థూపం వద్ద ముక్కు నేలకు రాస్తవా? అని సవాల్ విసిరారు.

హరీశ్‌రావు రాజీనామా చేయాల్సిందే : ఎమ్మెల్యే మధుసుదన్ రెడ్డి

రైతులకిచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేసిందనీ, హరీశ్‌రావు ఇచ్చిన మాట ప్రకారం రాజీనామా చేయాల్సిందేనని కాంగ్రెస్ ఎమ్మెల్యే మధుసుదన్‌రెడ్డి డిమాండ్ చేశారు.రుణమాఫీ అయిన సంతోషంలో రైతులు సంబరాలు చేసుకుంటుంటే, తట్టుకోలేక హరీశ్, కేటీఆర్ అక్కసు వెళ్లగక్కుతున్నారని చెప్పారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సీఎల్పీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పినా హరీశ్‌కు అహంకారం తగ్గలేదని చెప్పారు. కొంత మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తమ సీఎం రేవంత్‌రెడ్డిపై అడ్డగోలుగా మాట్లాడుతున్నారని చెప్పారు. పైరవీలతోనో, తండ్రిని అడ్డం పెట్టుకోనో రేవంత్ ముఖ్యమంత్రి కాలేదన్నారు. స్వయం కృషితో అంచెలంచెలుగా ఎదిగి ఆ పదవి చేపట్టారని తెలిపారు.

మాట్లాడేటప్పుడు జాగ్రత్త : ఎమ్మెల్యే చిట్టెం పర్ణిక రెడ్డి

మహిళల గురించి మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా మాట్లాడాలని కాంగ్రెస్ ఎమ్మెల్యే పర్ణికా రెడ్డి మాజీ మంత్రి కేటీఆర్‌ను హెచ్చరించారు. శుక్రవారం ఈమేరకు కేటీఆర్ వ్యాఖ్యలను తప్పుపడుతూ వీడియో విడుదల చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఆరు గ్యారంటీల్లో భాగంగా మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం అందిస్తున్నదని తెలిపారు. మహిళలు ఆర్టీసీ బస్సుల్లో బ్రేక్ డ్యాన్స్, రికార్డింగ్ డ్యాన్స్ చేసుకోమంటూ కేటీఆర్ వ్యాఖ్యలను ఖండించారు. వెంటనే కేటీఆర్ తక్షణమే మహిళలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ప్రతిపక్ష నేత కుర్చీ కోసం హరీశ్‌రావు పాట్లు :ఎమ్మెల్యే యెన్నం

శాసనసభలో ప్రతిపక్ష నేత కుర్చీ కోసం మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు పడరాని పాట్లు పడుతున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి ఎద్దేవా చేశారు. ముక్కు నేలకు రాసినా కల్వకుంట్ల కుటుంబం ఆ పదవి ఆయనకు ఇవ్వబోదని స్పష్టం చేశారు.

నాణ్యమైనవి సప్లయ్ చేయకపోతే కాంట్రాక్టు రద్దు చేస్తాం

- అంగన్‌వాడీ కేంద్రాల సప్లయర్లకు మంత్రి సీతక్క హెచ్చరిక



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అంగన్‌వాడీ కేంద్రాలకు నాణ్యత లేని వస్తువులు సరఫరా చేస్తే వారి కాంట్రాక్టులను రద్దు చేస్తామని మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ(సీతక్క) హెచ్చరించారు. నాణ్యమైన గుడ్లు, పప్పులు, వస్తువులు సరఫరా చేయని పక్షంలో తప్పుకోవాలని అల్టిమేటం జారీ చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా అవుతున్న ఆహార పదార్థాలు, కోడి గుడ్లు, ఇతర వస్తువుల నాణ్యత పెంపు కోసం సప్లయ్ కాంట్రాక్టర్లతో మంత్రి సీతక్క, శాఖ కార్యదర్శి వాకాటి కరుణ, కమిషనర్ కాంతి వెస్లీతో కలిసి మంత్రి సమీక్ష నిర్వహించారు. అంగన్‌వాడీ సెంటర్లకు పేద పిల్లలు వస్తారని వారికి పోషకాహారం అందించాల్సిన బాధ్యత తమ ప్రభుత్వానికి ఉందని గుర్తు చేశారు. నాణ్యమైన గుడ్లు సరఫరా చేయటం లేదని వార్తలు రావడంపై సప్లయర్ల వివరణ కోరారు. నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ గుడ్లు, ఆహార వస్తువులను సరఫరా చేయాలని ఆదేశించారు. కేవలం టేక్ హోమ్ రేషన్‌లో భాగంగా ఇంటికి తీసుకెళ్తున్న గుడ్లవల్లనే సమస్యలు తలెత్తుతున్నాయనీ, సకాలంలో కాకుండా చాలా రోజుల తర్వాత వినియోగించడం వల్ల అవి మురిగిపోతున్నాయని చెప్పారు. టేక్ హోమ్ రేషన్ కారణంగా ఎదురవుతున్న సమస్యలను అధిగమించేలా ఆ పథకంలో సంస్కరణలు తీసుకురావాలని మంత్రి అధికారులను ఆదేశించారు. అంగన్‌వాడీ టీచర్లు సిబ్బంది మరింత క్రియాశీలకంగా పనిచేయాలనీ, నాణ్యత లేని వస్తువులను రిజెక్ట్ చేయాలనీ, లేకపోతే చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. పెరిగిన రేట్ల కనుగుణంగా కోడిగుడ్ల రేట్లను పెంచాలనీ, గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఉన్నట్లుగా గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేసి బిల్లులు చెల్లించాలని సప్లయర్లు సీతక్కను కోరారు. ఒప్పంద పత్రాల్లో కుదుర్చుకున్న నిబంధనలను కాదని ధరలు పెంచే ప్రసక్తే లేదని మంత్రి స్పష్టం చేశారు. అంగన్‌వాడీ వ్యవస్థను గాడిలో పెట్టి మెరుగైన సేవలు అందిస్తామని చెప్పారు. క్షేత్రస్థాయిలో కొంతమంది తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారనీ, చెప్పినట్టు నడుచుకోకపోతే తమపై తప్పుడు వార్తలు రాస్తున్నారని కాంట్రాక్టర్లు వాపోయారు. నిజంగా తప్పుడు వార్తలే అయితే అవి రాసినవారిపైనా చర్యలు తీసుకుంటామని మంత్రి హామీనిచ్చారు.

యావజ్జీవ శిక్ష సబబే : హైకోర్టు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

భార్య హత్య కేసులో భర్తకు ట్రయల్ కోర్టు విధించిన యావజ్జీవ కారాగార శిక్షను హైకోర్టు సమర్థించింది. జీవిత ఖైదు విధించడం సరైందేనని స్పష్టం చేసింది. ఆమెతో వివాహం జరిగి ఐదు నెలలే అయిందనీ, ఆమె మంటల్లో కాలిపోతుంటే తాను వేరే గదిలో నిద్రపోతూ....తెలియలేదని భర్త చెప్పడాన్ని హైకోర్టు తప్పు పట్టింది. ఆమె ఆత్మహత్య చేసుకుందంటూ అల్లుడు చేస్తున్న వాదనను తోసిపుచ్చింది. కాలిన గాయాల గురించి కూతురు తనకు ఏమీ చెప్పలేదని మృతురాలి తల్లి చెబుతోంది. అయితే, భర్తకు వ్యతిరేకంగా మృతురాలు వాంగ్మూలం ఇచ్చింది. అందువల్ల ట్రయల్ కోర్టు తీర్పులో జోక్యం చేసుకోవాల్సిన అవసరం కనిపించడం లేదంటూ హైకోర్టు తీర్పు చెప్పింది. రంగారెడ్డి జిల్లా కుత్బుల్లాపూర్ మండలం అన్నారం గ్రామానికి చెందిన పెద్దింటి భాస్కర్‌కు మృతురాలితో 2012, ఏప్రిల్ 25న పెండ్లి జరిగింది. అదే ఏడాది జులై 15న రాత్రి ఇంట్లో భోజనం చేశాక నిద్రించారు. తాను తన తల్లి వద్ద నిద్రిస్తానని భాస్కర్‌ను ఆమె కోరింది. అందుకు నిరాకరించి దుర్భాషలాడుతూ ఆమెపై కిరోసిన్ పోసి నిప్పంటించటంతో ఆస్పత్రిలో మరణించింది. కానీ ట్రయల్ కోర్టులో ప్రాసిక్యూషన్‌కు వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పారు. అయితే ఆస్పత్రిలో మృతురాలు మేజిస్ట్రేట్‌కు ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా భాస్కర్‌ను ట్రయల్ కోర్టు దోషిగా తేల్చింది. ఈ క్రమంలో 2015, ఏప్రిల్ 17న రంగారెడ్డి జిల్లా కోర్టు తనకు యావజ్జీవ శిక్ష విధించడాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో పెద్దింటి భాస్కర్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.సురేందర్, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావుతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. కింది కోర్టు విధించిన యావజ్జీవ కారాగార శిక్షను సబబేనని తేల్చింది.

నవతెలంగాణ

కేటీఆర్ ముక్కు నేలకు రాయాలి

మహిళలపై ఇష్టంవచ్చినట్టు మాట్లాడితే సహించం : మంత్రి కొండా సురేఖ ఆగ్రహం



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కే తారకరామారావు (కేటీఆర్) మహిళలకు బహిరంగంగా క్షమాపణలు చెప్పి, ముక్కు నేలకు రాయాలని రాష్ట్ర అటవీ, పర్యావరణం, దేవాదాయ శాఖల మంత్రి కొండా సురేఖ అన్నారు. కేవలం ట్విట్టర్లో, విలేకరుల సమావేశంలో క్షమాపణలు చెప్పి, ప్రాయశ్చిత్తం చేసుకుంటామంటే కుదరదని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న మహిళలకు ఆర్టీసి బస్సుల్లో ఉచిత ప్రయాణ పథకాన్ని ఉద్దేశించి మాజీ మంత్రి కేటీఆర్ పార్టీ మీటింగ్‌లో తెలంగాణ మహిళలను బ్రేక్ డ్యాన్సులు, రికార్డింగ్ డ్యాన్సులు చేసుకొమ్మని చేసిన వ్యాఖ్యలపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నిరంకుశ విధానాలతో విసిగి వేసారిన ప్రజలు అధికారాన్ని దూరం చేసినా, ఆపార్టీ నేతలకు అహంకారం తగ్గలేదని విమర్శించారు. క్లబ్బుల్లో, పబ్బుల్లో బ్రేక్ డ్యాన్సులు చేసిన చరిత్ర కేటీఆర్‌కు ఉందేమో కానీ, మహిళా సమాజాన్ని నోటికొచ్చినట్లు మాట్లాడితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. రైతులపై ఆపార్టీ నేతలది కపట ప్రేమే అని ఆరోపించారు.

విద్యుత్ కమిషన్ విచారణ షురూ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఛత్తీస్‌గఢ్ ఒప్పందం, భద్రాద్రి, యాద్రాద్రి థర్మల్ కేంద్రాల నిర్మాణాలపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన విచారణ కమిషన్ పనులు వేగవంతం అయ్యాయి. కోర్టు ఆదేశాలతో జస్టిస్ ఎల్ నర్సింహారెడ్డి తన పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో నూతనంగా రాష్ట్ర ప్రభుత్వం జస్టిస్ మదన్ భీమ్‌రావ్ లోకూర్‌ను న్యాయ విచారణ కమిషన్ చైర్మెన్‌గా నియమించింది. వారం రోజులుగా నూతన కమిషనర్ విద్యుత్ ఫైళ్లను పరిశీలిస్తున్నారు. పాత చైర్మెన్ జస్టిస్ నర్సింహారెడ్డి నేతృత్వంలో జరిగిన విచారణ వివరాలను సేకరిస్తున్నారు. అధికారులు, విద్యుత్‌రంగ నిపుణులు, మాజీ సీఎం కే చంద్రశేఖరరావు, మాజీ విద్యుత్‌శాఖ మంత్రి జీ జగదీశ్‌రెడ్డి కమిషన్‌కు ఇచ్చిన లేఖల్ని కూడా పరిశీలిస్తున్నారు. రెండ్రోజుల్లో తదుపరి విచారణ ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయి. మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డికి విచారణకు హాజరు కావాలని మరోసారి నోటీసులు ఇచ్చే అవకాశం ఉన్నట్టు ప్రచారం జరుగుతుంది.

జర్నలిస్ట్ కొండల్ గౌడ్‌కు సత్కారం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

డ్రగ్స్ రహిత తెలంగాణ నిర్మాణం కోసం తన సామాజిక బాధ్యతగా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు డ్రగ్స్‌ను తరిమేద్దామంటూ పాట పాడిన సీనియర్ జర్నలిస్ట్ కొండల్ గౌడ్‌ను మంత్రి సీతక్క అభినందించారు. శాలువతో సత్కరించారు. ప్రతి ఒక్కరూ తమ వృత్తిధర్మం కొనసాగిస్తూనే డ్రగ్స్ రహిత తెలంగాణ కోసం తమ వంతు పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు.

ఖాతాదారుల సొమ్ము రూ.10 లక్షలు స్వాహా

పోస్టాఫీస్‌లో కాజేసిన బినామీ పోస్ట్‌మ్యాన్

- ప్రయివేటు వ్యక్తితో పోస్టాఫీస్ నడుపుతున్న వైనం
- విచారణ చేపట్టిన ఉన్నతాధికారులు

నవతెలంగాణ-వైరా

ఖమ్మం జిల్లా వైరా మండలం గొల్లపూడి బ్రాంచ్ పోస్టాఫీసులో ఖాతాదారులు డిపాజిట్ చేసిన పొదుపు సొమ్ము రూ.10 లక్షలను బినామీ పోస్ట్‌మ్యాన్ కాజేసిన విషయమై అధికారులు ఆ గ్రామంలో శుక్రవారం విచారణ చేపట్టారు. ఈ బ్రాంచ్ పోస్ట్ ఆఫీస్ పరిధిలో ఖాతాదారుల రికరింగ్ డిపాజిట్ల సొమ్ము దశలవారీగా మింగేసినట్టు తెలుస్తోంది. గొల్లపూడి బ్రాంచ్ పోస్ట్‌మెన్ మేడూరి శ్రీనివాసరావు విధులను నిర్వహించకుండా తన స్థానంలో ప్రయివేటు వ్యక్తి వరికూటి ప్రవీణ్‌కుమార్‌ను అనధికారికంగా నియమించి పోస్టల్ కార్యకలాపాలను నిర్వహిస్తున్నారు. గ్రామంలో మెయిన్ రోడ్డుపై తనకున్న ఎరువుల దుకాణం పక్కనే ఓ షెటర్‌లో పోస్ట్‌మెన్ పోస్టాఫీస్‌ను ఏర్పాటు చేశాడు. ఈ కార్యాలయం కేంద్రంగా ఆ ప్రయివేటు వ్యక్తి సుమారు సంవత్సర కాలంగా ఖాతాదారుల నుంచి రోజు, నెలవారీగా పొదుపు సొమ్ము వసూలు చేసేవాడు. ఇలా ఖాతాదారుల నుంచి వసూలు చేసిన నగదును పోస్ట్‌మెన్ పోస్టల్ మెయిన్ బ్రాంచ్‌లో ఉన్న ఖాతాదారుల అకౌంట్‌లో జమ చేయాల్సి ఉంటుంది. అలాగే, నగదు వసూలు చేసినట్టు ఆ ప్రయివేటు వ్యక్తి ఖాతాదారుల పాసుపుస్తకాల్లో స్టాంప్ వేసి ఇచ్చేవాడు. అయితే, ఖాతాదారుల్లో 30శాతం మందికే పాస్ పుస్తకాలు మంజూరు చేసినట్టు తెలుస్తోంది. మిగిలిన వారికి పాస్ పుస్తకాలు మంజూరు చేయకుండానే నగదు వసూలు చేయడం విశేషం. అయితే వసూలు చేసిన నగదును మెయిన్ బ్రాంచ్ పోస్టాఫీస్‌లోని ఖాతాదారుల అకౌంట్‌లో జమ చేయలేదు. సుమారు 50 మంది ఖాతాదారుల నుంచి ఇలా వసూలు చేసిన 10 లక్షల రూపాయల నగదును పోస్ట్‌మెన్ అనధికారికంగా ఉద్యోగంలో పెట్టుకున్న ప్రయివేటు వ్యక్తి కాజేసినట్టు తెలుస్తోంది. విషయం తెలుసుకున్న పోస్టల్ జిల్లా ఉన్నతాధికారులు మధిర పోస్టల్ ఇన్స్‌పెక్టర్ కోటేశ్వరరావు, కలకోట బ్రాంచ్ పోస్టుమెన్‌లను విచారణకు ఆదేశించారు. దాంతో మూడు రోజులుగా గొల్లపూడి గ్రామంలో విచారణ నిర్వహిస్తున్నారు. పోస్ట్‌మెన్ తాను చేయాల్సిన విధులను ప్రయివేటు వ్యక్తిని నియమించి చేయించటం ప్రస్తుతం వివాదాస్పదమైంది. పోస్టల్ శాఖ జిల్లా అధికారులు సమగ్ర విచారణ జరిపి ప్రతి ఖాతాదారునికి నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

కోల్‌కతా ఘటనకు వ్యతిరేకంగా

నేడు కార్పొరేట్, ప్రయివేటు ఆస్పత్రుల్లోనూ ఓపీ సేవలు బంద్

రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతున్న నిరసనలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కోల్‌కతాలో మహిళా వైద్యురాలిపై లైంగిక దాడి, హత్యకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా వైద్యులు, నర్సులు చేపట్టిన నిరసనలు శుక్రవారం కూడా కొనసాగాయి. అన్ని జిల్లాల్లోని ప్రభుత్వ బోధనాస్పత్రులు, మెడికల్ కాలేజీల్లో అత్యవసర సేవలు మినహా అన్ని రకాల సేవలు బంద్ అయ్యాయి. ఈ నేపథ్యంలో వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆస్పత్రుల్లో సిబ్బంది, ముఖ్యంగా మహిళా సిబ్బంది భద్రతపై అత్యవసర ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆస్పత్రుల్లో పూర్తిస్థాయి భద్రత కోసం డాక్టర్లు, నర్సులు, వైద్య సిబ్బంది చేస్తున్న ఆందోళనకు సంఘీభావం ప్రకటించారు. మరోవైపు ప్రభుత్వాస్పత్రుల్లో ఓపీ, ఎలెక్టివ్ సేవలు పూర్తిగా ఆగిపోయాయి. డాక్టర్లు అత్యవసర సేవలకే పరిమితమయ్యారు. రాష్ట్రంలో జూనియర్ డాక్టర్లు, సీనియర్ రెసిడెంట్ డాక్టర్లు చేస్తున్న పోరాటానికి ఇండియన్ మెడికల్ కౌన్సిల్, తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం, తెలంగాణ ప్రభుత్వ బోధనా వైద్యుల సంఘం, తెలంగాణ ప్రభుత్వ పబ్లిక్ హెల్త్ డాక్టర్స్ అసోసియేషన్ సంపూర్ణంగా మద్దతు ప్రకటించాయి.

ఉస్మానియా, గాంధీ, నిమ్స్, ఈఎస్ఐసీ సనత్‌నగర్‌తో పాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాల బోధనాస్పత్రుల్లో జూడాలు, సీనియర్ రెసిడెంట్ డాక్టర్లు ప్రదర్శనలు నిర్వహించారు. ప్లకార్డులను చేతబూని ఆస్పత్రుల ప్రాంగణాల్లో నినాదాలు చేస్తూ బైఠాయించారు. ఆయా ఆస్పత్రుల్లో వైద్యుల సంఘాల నాయకులు, హెచ్ఓడీలు, సూపరింటెండెంట్లు వారి పోరాటానికి సంఘీభావం ప్రకటించారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో భద్రతకు సంబంధించిన భద్రత విషయంలో రాష్ట్ర ప్రభుత్వాలకు స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తగినన్ని సీసీ కెమెరాలు, భద్రతతో కూడిన రవాణా సౌకర్యం కల్పించాలని కోరారు. అనేక ఏండ్లుగా డిమాండ్ చేస్తున్నా కేంద్రంలోని సర్కారు పట్టించుకోకపోవడమే కోల్‌కతా లాంటి ఘటనకు దారి తీసిందని విమర్శించారు. కేంద్రంతో పాటు ఆయా రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం ఇలాంటి సంఘటనలు జరగడానికి దారి తీస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

ఆందోళనల్లో భాగస్వాములవుతాం : తెలంగాణ ప్రభుత్వ నర్సెస్ అసోసియేషన్

దేశవ్యాప్తంగా కొనసాగుతున్న ఆందోళనల్లో తాము కూడా భాగస్వాములమవుతామని తెలంగాణ ప్రభుత్వ నర్సెస్ అసోసియేషన్ తెలిపింది. ఒకవైపు కోల్‌కతా వైద్యురాలిపై లైంగిక దాడి, హత్య ఘటనతో దేశంలో నిరసనలు కొనసాగుతుండగా ఉత్తరాఖండ్‌లో నర్సింగ్ ఆఫీసర్‌పై లైంగికదాడి చేసి హత్య చేశారని ఖండించింది. ఇందుకు నిరసనగా శనివారం ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు అన్ని ఆస్పత్రుల్లో నిరసన ప్రదర్శనలు చేయనున్నట్టు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మరియమ్మ ఒక ప్రకటన విడుదల చేశారు.

పోరాటం ఆపొద్దు : తెలంగాణ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ అసోసియేషన్

ప్రాణాలు నిలిపే వైద్యులపై దాడులు, లైంగికదాడులను ఎంత మాత్రం సహించేది లేదని తెలంగాణ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్ (టీఎస్‌హెచ్‌ఏ) హెచ్చరించింది. వైద్యులు, వైద్య సిబ్బందిపై హింసకు వ్యతిరేకంగా ఇండియన్ మెడికల్ కౌన్సిల్ చేపట్టిన దేశవ్యాప్త ఆందోళనల్లో తాము భాగస్వాములవుతున్నట్టు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆర్.గోవింద్ హరి ఒక ప్రకటన విడుదల చేశారు. శనివారం అత్యవసర సేవలు మినహా అన్ని రకాల సేవలను సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో నిలిపివేస్తున్నట్టు తెలిపారు.

టీఎంఎస్ఆర్‌యూ సంఘీభావం

ఐఎంఏ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమానికి తెలంగాణ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ (టీఎంఎస్ఆర్‌యూల-సీఐటీయూ అనుబంధం) సంఘీభావం తెలిపింది. ఈ మేరకు శుక్రవారం ఆ యూనియన్ సంయుక్త ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 17న ఉదయం 6 గంటల నుంచి 18న ఉదయం 6 గంటల వరకు 24 గంటలపాటు వైద్యసేవలు నిలిపేస్తున్నట్టు తెలిపారు. వైద్యవిద్యార్థినిపై లైంగికదాడి చేసి హత్య చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఆర్‌జీ కార్ ఆస్పత్రిలో ఆందోళన చేస్తున్న జూనియర్ డాక్టర్లు చేస్తున్న నిరసనపై దాడి చేయడం అత్యంత క్రూరమైన చర్యగా తమ యూనియన్ భావిస్తున్నదని చెప్పారు.

ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయాలి : మంత్రి దామోదర రాజనర్సింహ

ఫాస్ట్‌ట్రాక్ కోర్టును ఏర్పాటు చేసి నిందితులను కఠినంగా శిక్షించాలని మంత్రి దామోదర రాజనర్సింహ డిమాండ్ చేశారు. శుక్రవారం మంత్రి హైదరాబాద్‌లో ఆస్పత్రుల్లో భద్రతపై ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. కేసును వేగవంతం చేయాలని సీబీఐను కోరారు. ఉస్మానియా, గాంధీ ఆస్పత్రుల్లో డాక్టర్లు, నర్సింగ్ ఆఫీసర్లు, వైద్య సిబ్బందికి తగినంత భద్రత కల్పించాలని ఆయా ఆస్పత్రుల సూపరింటెండెంట్లను ఆదేశించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్‌లో డాక్టర్లు, నర్సులు, వైద్య సిబ్బంది భద్రత, సంరక్షణకు సంబంధించిన అంశాలను పొందుపరిచినట్టు గుర్తుచేశారు. కోల్‌కతా ఘటన నేపథ్యంలో రాష్ట్రంలోని ఆస్పత్రుల్లో రాష్ట్రంలో అన్ని ప్రభుత్వాస్పత్రుల్లో కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టినట్టు తెలిపారు.

ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయాలి: మంత్రి దామోదర రాజనర్సింహ

- అత్యవసర ఉన్నతస్థాయి సమీక్ష
- ప్రభుత్వాస్పత్రుల్లో ఆగిన ఓపీ, ఎలెక్టివ్ సేవలు
- ఐఎంఏ, టీజీడీఏ, టీజీటీడీఏ, టీజీపీహెచ్‌డీఏ, టీఎన్ఏ సంపూర్ణ మద్దతు
- కేంద్ర సర్కారు నిర్లక్ష్యమే కారణమని మండిపాటు

కొత్తూరులోని శ్రీ శ్రీనివాస క్లినిక్ సీజ్

గిరిజన బాలికకు అబార్షన్ ఘటనతో రంగారెడ్డి జిల్లా వైద్యాధికారి ఆధ్వర్యంలో చర్యలు

- ఆర్ఎంపీలు పరిధి దాటి వైద్యం చేయొద్దు : ఎమ్మెల్యే శంకర్
- జిల్లా వైద్యాధికారులతో సమావేశం



నవతెలంగాణ-కొత్తూరు

రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం ఎర్రగుంట తండాకు చెందిన బాలికకు అబార్షన్ చేసిన కొత్తూరులోని శ్రీ శ్రీనివాస క్లినిక్‌ను వైద్యాధికారులు శుక్రవారం సీజ్ చేశారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఆస్పత్రిని సీజ్ చేశారు. బాలికపై లైంగికదాడి జరిగిన కేసులో అబార్షన్ చేసిన కొత్తూరులోని ఆయుర్వేదిక్ డాక్టర్ రంజిత్‌ను పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో శుక్రవారం కొత్తూరులో పర్యటించిన వైద్యాధికారులు ఆస్పత్రిపై చర్యలకు పూనుకున్నారు. ఈ నేపథ్యంలో వైద్యాధికారులతో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్ఎంపీలు పరిధి దాటి వైద్యం చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులను ఆదేశించారు. ఆర్ఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని, నిబంధనలకు విరుద్ధంగా వైద్యం చేస్తే ఎంతటి వారైనా ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటేశ్వరరావు మాట్లా డుతూ.. ఆయుర్వేదిక్ వైద్యం చదివి అల్లోపతి చికిత్స అందిస్తున్న డాక్టర్ రంజిత్‌కు గతంలో కూడా నోటీసులు ఇచ్చామని గుర్తు చేశారు. ప్రయివేట్ ఆస్పత్రిలో గతంలో ముమ్మరంగా తనిఖీలు నిర్వహించామని అన్నారు. ఈ ఘటనతో మరొక్కసారి ప్రయివేటు ఆస్పత్రులపై తనిఖీలు చేపడతామని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా మాస్ మీడియా ఆఫీసర్ తిరుపతిరావు, జిల్లా హెల్త్‌ఎడ్యుకేషన్ ఎక్స్టెన్షన్ ఆఫీసర్ కె.శ్రీనివాసులు, కొత్తూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ హరికిషన్, హెల్త్ ఎడ్యుకేటర్ జె.శ్రీనివాసులు, సీహెచ్ఓ నాగేష్, శ్రీకాంత్, నవాజ్, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

- ఎస్సీ,ఎస్టీ కమిషన్ సభ్యులు శంకర్, రాంబాబు నాయక్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గిరిజన బాలికపై అఘాయిత్యానికి పాల్పడిన నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఎస్సీ,ఎస్టీ కమిషన్ సభ్యులు జిల్లా శంకర్, రాంబాబు నాయక్ పోలీస్ అధికారులను ఆదేశించారు. రంగారెడ్డి జిల్లా పరిధిలోని శంషాబాద్ మండలం ఎర్రగుంట తండాకు చెందిన బాలిక (13)పై కొన్ని రోజుల పాటు జూకల్ గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి లైంగిక దాడికి పాల్పడ్డాడని తెలిపారు. ఆ బాలికను మానసిక వేదనకు గురిచేయటమేగాక, తల్లిదండ్రులను చంపేస్తానంటూ బెదిరించారని పేర్కొన్నారు. బాలికను శారీరకంగా, మానసికంగా ఇబ్బంది పెట్టిన కృష్ణారెడ్డి పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, కఠినంగా శిక్షించి, తక్షణమే చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ విషయాన్ని కమిషన్ చైర్మెన్ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి బాధితురాలికి న్యాయం జరిగేలా కృషి చేస్తామని వారు హామీ ఇచ్చారు.



నిందితులను కఠినంగా శిక్షించాలి

టీఎస్‌యూటీఎఫ్, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ

నవతెలంగాణ-సంగారెడ్డి

కోల్‌కత్తా నగరంలో ఆర్జిగర్ ప్రభుత్వ ఆస్పత్రి, మెడికల్ కాలేజ్‌లో పనిచేస్తున్న మహిళా జూనియర్ డాక్టర్‌పై అమానుషంగా లైంగికదాడికి పాల్పడి.. హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం సాయంత్రం సంగారెడ్డి పట్టణంలోని ఐబీ నుంచి కొత్త బస్టాండ్ వరకు టీఎస్‌యూటీఎఫ్, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో వేర్వేరుగా క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా టీఎస్‌యూటీఎఫ్ సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి బి. సాయిలు, డాక్టర్స్ యూనియన్ జిల్లా సెక్రెటరీ చక్రపాణి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎర్రోళ్ల మహేష్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అనిల్ మాట్లాడారు. దేశంలో ప్రతిరోజూ ఆడపిల్లలపై లైంగికదాడులు జరుగుతూనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. లైంగికదాడులు, హత్యలను నిలువరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని అన్నారు. కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన లైంగికదాడి, హత్య ఒక్కరే చేశారని నమ్మించి ఒక వ్యక్తిని అరెస్టు చేసి చేతులు దులుపుకునే ప్రయత్నం జరుగుతున్నదని ఆరోపించారు. ఇది సామూహిక లైంగికదాడి అని డాక్టర్లు చెబుతున్నా ప్రభుత్వాలు నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరించడం సరికాదన్నారు. కేంద్ర ప్రభుత్వం భేటీ బచావో.. బేటి పడావో, సబ్కా సాథ్ -సబ్ కా వికాస్ అని ఘనమైన నినాదాలు ఇస్తున్నా.. వాటిని అమలుచేయడంలో వైఫల్యమవుతున్నదని తెలిపారు. నిందితులందరినీ అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా కోశాధికారి పి.శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి బి. సాయి తేజ, చందర్ రాథోడ్ జిల్లా కమిటీ సభ్యులు ఎం. సుచరిత, ఎం. జ్యోతి, ధనరాజ్, సైమన్, బి. కమలాకర్ రావు నాయకులు సుభాష్, లక్ష్మయ్య, సంగయ్య, పి. కిషన్, ఎం. విజయ్ కుమార్, ఎస్ఎఫ్ఐ గర్ల్స్ నాయకురాలు వాణి, అఖిల, శ్రావణి, డీవైఎఫ్ఐ జిల్లా నాయకులు అనిల్, రవి తదితరులు పాల్గొన్నారు.

అక్టోబర్ 21 నుంచి గ్రూప్-1 మెయిన్స్

(మొదటిపేజీ తరువాయి)

చేశామని తెలిపారు. మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు కాకుండా మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పరీక్షలను నిర్వహిస్తామని వివరించారు. అభ్యర్థులు దీన్ని గమనించాలని సూచించారు. అభ్యర్థులకు సంబంధించిన జవాబు పత్రాల నమూనాను విడుదల చేశామని తెలిపారు. అభ్యర్థి ఫొటోతోపాటు ప్రీ ప్రింటెడ్ వివరాలతో ముద్రించామని పేర్కొన్నారు. ఏడు పేపర్లకు సంబంధించిన జవాబు పత్రాల నమూనాలు శనివారం నుంచి టీజీపీఎస్సీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయని వివరించారు. అభ్యర్థులు జవాబుపత్రంలో ఉండే నిబంధనలను చదువుకోవడానికి అవకాశముంటుందని తెలిపారు. నమూనా జవాబుపత్రాలను డౌన్‌లోడ్ చేసుకుని సాధన చేయాలని సూచించారు. అభ్యర్థుల హాల్‌టికెట్లు ముద్రించి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతామని పేర్కొన్నారు. నిబంధనలన్నీ తప్పనిసరిగా పాటించాలని కోరారు. నిబంధనలను ఉల్లంఘిస్తే కమిషన్ బాధ్యత వహించబోదని స్పష్టం చేశారు. అభ్యర్థులు హాల్‌టికెట్‌లో ఉండే నిబంధనలను అర్థం చేసుకుని పాటించాలని కోరారు. తిరస్కరణ, చెల్లుబాటు కాకుండా చూసుకోవాలని సూచించారు. 563 గ్రూప్-1 పోస్టుల భర్తీకి ఫిబ్రవరి 19న గ్రూప్-1 నోటిఫికేషన్‌ను టీజీపీఎస్సీ జారీ చేసిన విషయం తెలిసిందే. గ్రూప్-1 ప్రిలిమినరీ రాతపరీక్షను జూన్ తొమ్మిదిన నిర్వహించింది. ఈ పరీక్షకు 4.03 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేయగా, 3.02 లక్షల మంది హాజరయ్యారు. వారిలో 31,382 మంది అభ్యర్థులు గ్రూప్-1 మెయిన్స్‌కు ఎంపికయ్యారు. ఇతర వివరాలకు www.tspsc.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని నవీన్ నికోలస్ సూచించారు.

గ్రూప్-1 మెయిన్స్ షెడ్యూల్
(మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు)

సబ్జెక్టు	తేదీ
జనరల్ ఇంగ్లీష్ (అర్హత పరీక్ష)	అక్టోబర్ 21
పేపర్-1 జనరల్ ఎస్సే	అక్టోబర్ 22
పేపర్-2 చరిత్ర, సంస్కృతి, జాగ్రఫీ	అక్టోబర్ 23
పేపర్-3 భారతీయ సమాజం, రాజ్యాంగం, పరిపాలన	అక్టోబర్ 24
పేపర్-4 ఎకానమి, అభివృద్ధి	అక్టోబర్ 25
పేపర్-5 సైన్స్ అండ్ టెక్నాలజీ, డాటా ఇంటర్‌ప్రిటేషన్	అక్టోబర్ 26
పేపర్-6 తెలంగాణ ఉద్యమం, రాష్ట్ర ఆవిర్భావం	అక్టోబర్ 27

డీఎస్సీ వెబ్‌సైట్ సేవలు తాత్కాలికంగా నిలిపివేత

- 19న ఉదయం 3 గంటలకు తిరిగి పునరుద్ధరణ
- పాఠశాల విద్యాశాఖ వెల్లడి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సంబంధించిన జిల్లా నియామక కమిటీ (డీఎస్సీ) వెబ్‌సైట్ సేవలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్టు పాఠశాల విద్యాశాఖ వెల్లడించింది. శుక్రవారం సాయంత్రం ఐదు గంటల నుంచి ఈనెల 19న మూడు గంటల వరకు సేవలు అందుబాటులో ఉండబోవని స్పష్టం చేసింది. వార్షిక విద్యుత్ షట్‌డౌన్ కార్యక్రమంలో భాగంగా డీఎస్సీ వెబ్‌సైట్ పనిచేయడం లేదని వివరించింది. డీఎస్సీ రాతపరీక్షలకు సంబంధించిన ప్రాథమిక కీతోపాటు రెస్పాన్స్ షీట్లను ఈనెల 13న విడుదల చేసిన విషయం తెలిసిందే. ప్రాథమిక కీపై ఈనెల 20న సాయంత్రం ఐదు గంటల వరకు ఆన్‌లైన్ ద్వారా అభ్యంతరాలను స్వీకరిస్తారు. గతనెల 18 నుంచి ఈనెల ఐదో తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా కంప్యూటర్ ఆధారిత విధానం (సీబీఆర్టీ)లో డీఎస్సీ రాతపరీక్షలు జరిగిన విషయం తెలిసిందే. రాష్ట్రవ్యాప్తంగా 2,79,957 మంది దరఖాస్తు చేయగా, 2,45,263 (87.61 శాతం) మంది అభ్యర్థులు రాతపరీక్షలకు హాజరయ్యారు. 34,694 (12.39 శాతం) మంది గైర్హాజరయ్యారు. రాష్ట్రంలో 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను ఫిబ్రవరి 29న రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన విషయం తెలిసిందే.

కోల్‌కతా ఘటనపై సమరశీల ఉద్యమం

- నేడు, రేపు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు
- ఫెడరల్ స్ఫూర్తిని కాలరాస్తున్న మోడీ సర్కారు
- ధరల పెరుగుదలకు నిరసనగా 1 నుంచి 7 వరకు పోరాటం
- సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించాలి : సీఎంకు సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ విజ్ఞప్తి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కోల్‌కతాలో మహిళా డాక్టర్ హత్యాచారానికి వ్యతిరేకంగా సమరశీల ఉద్యమం చేపట్టనున్నట్టు సీపీఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ చెప్పారు. ఆమెపై లైంగిక దాడితోపాటు హత్య చేయడాన్ని నిరసిస్తూ శని, ఆదివారాలు రెండు రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని అన్నారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కోల్‌కతాలో జరిగిన ఘటనను నిర్భయ-2గా ఆయన అభివర్ణించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని హిమాయత్‌నగర్‌లో ఉన్న సీపీఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నైట్ డ్యూటీ చేసే డాక్టర్లకు విశ్రాంతి గదుల్లేవని చెప్పారు. కోల్‌కతాలో మహిళా డాక్టర్‌పై సామూహిక లైంగిక దాడి జరిగిందన్నారు. బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఈ ఘటనకు నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. నిందితులను పట్టుకునేందుకు ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తున్నదని అన్నారు. వామపక్ష పార్టీలు ఆందోళనలు చేస్తున్నాయని గుర్తు చేశారు. ఆ ఆస్పత్రిలో ఆధారా ల్లేకుండా చేసేందుకు తృణమూల్ గూండాలూ ప్రయత్నిస్తున్నాయనీ, ల్యాబ్‌ను ధ్వంసం చేశారని చెప్పారు. స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా ప్రధాని మోడీ అబద్ధాలు మాట్లాడారని అన్నారు. ఆర్థికంగా దేశాన్ని ముందుకు తీసుకెళ్తామంటూనే అదానీని మాత్రమే ముందుకు తీసుకెళ్తున్నారని వివరించారు. సెబీని నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. అదానీకి అనుకూలంగా సెబీ చైర్మెన్ వ్యవహరిస్తున్నారని చెప్పారు. స్వాతంత్ర్య ఉద్యమంలో ఆర్ఎస్ఎస్ పాల్గొన్నదా?, ఆ నాయకులు జైలుకు వెళ్లారా?, వారిలో అమరులున్నారా?అని ప్రశ్నించారు. ఫెడరల్ రాజ్యాంగ స్ఫూర్తిని కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కాలరాస్తున్నదని విమర్శించారు. ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న కేరళ, తమిళనాడు, పశ్చిమబెంగాల్, ఢిల్లీ వంటి రాష్ట్రాల్లో గవర్నర్ల ద్వారా పాలన సాగిస్తున్నారని అన్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో ఉన్న హామీలను కేంద్రం అమలు చేయాలని కోరారు. యూనిఫామ్ సివిల్ కోడ్ పేరుతో ప్రజలను విభజిస్తున్నారని చెప్పారు. కార్పొరేట్ సంస్థలకు కేంద్రం ఎర్రతివాచీ పరుస్తున్నదని అన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వచ్చేనెల ఒకటి నుంచి ఏడు వరకు జాతీయ స్థాయిలో ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తామన్నారు. బంగ్లాదేశ్‌లో హసీనా ప్రభుత్వం నియంతృత్వంగా పాలన సాగించిందన్నారు. ఇది మోడీకి, నియంతృత్వ పాలకులకు గుణపాఠం కావాలని కోరారు. హైడ్రా మంచిదేనని అన్నారు. నాలాలు, చెరువుల ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అయితే కబ్జా చేసిన వారిని పట్టుకోవాలని సూచించారు. వారి నుంచి పేదలు కొనుగోలు చేసి ఇండ్లు నిర్మించుకుంటే వాటిని కూల్చేయడం సరైంది కాదన్నారు. వారికి ప్రత్యామ్నాయం చూపించాలని కోరారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలు వచ్చేనెల 11 నుంచి 17 వరకు నిర్వహిస్తామని చెప్పారు. సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ అంశంపై వెనక్కి పోతే రిమోట్ కంట్రోల్ వేరే వారి వద్ద ఉన్నట్టే భావిస్తామన్నారు.

రైతులందరికీ రుణమాఫీ జరగాలి : పశ్యపద్మ

రాష్ట్రంలో రూ.రెండు లక్షల వరకు రుణమాఫీ చేయడం పట్ల సంతోషంగా ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పశ్యపద్మ అన్నారు. ఎస్ఎల్‌బీసీ మినిట్స్ ప్రకారం రీషెడ్యూల్ చేసుకున్న రైతులందరికీ రుణమాఫీ జరగాలని కోరారు. లేదంటే అనేక మంది రైతులు ఇబ్బందులకు గురవుతారని చెప్పారు. రైతులందరినీ రుణ విముక్తులను చేయాలనీ, కొత్త రుణాలు తీసుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈటి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

మాకు రక్షణ కల్పిస్తేనే.. ప్రాణాలు కాపాడగలం

కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై లైంగికదాడి, హత్యను నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం కూడా నిరసనలు కొనసాగాయి. వైద్య విద్యార్థులు, డాక్టర్స్ నల్ల బ్యాడ్జీలు ధరించి ర్యాలీలు తీశారు. "మాకు రక్షణ కల్పిస్తేనే.. రోగుల ప్రాణాలు కాపాడగలం" అంటూ నినాదాలు చేశారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అన్ని ప్రయివేట్ ఆస్పత్రుల్లో శనివారం ఉదయం 6 గంటల నుంచి ఆదివారం ఉదయం 6 గంటల వరకు ఓపీ సేవలను బంద్ చేయనున్నారు.



రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతున్న వైద్యుల నిరసన, ర్యాలీలు

- వైద్య విద్యార్థి ఘటనలో నిందితులపై చర్యలకు డిమాండ్
- రక్షణ కల్పించాలని నినాదాలు
- నేడు ప్రయివేట్ ఆస్పత్రుల్లో ఓపీ బంద్

నవతెలంగాణ- విలేకరులు

ఆదిలాబాద్ రిమ్స్ జూడాలు నల్ల బ్యాడ్జీలు పెట్టుకుని.. రిమ్స్ నుంచి ఎన్టీఆర్ చౌరస్తా వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ చౌరాస్తాలో మనవహారంగా ఏర్పడ్డారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రధాన ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. 72 గంటల్లోపు నిందితులను గుర్తించి, శిక్ష వేయకపోతే నిరసనను ఉధృతం చేసి.. వైద్య సేవలు నిలిపేస్తామని హెచ్చ రించారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులు ఓపీ బంద్ చేసి నిరసన తెలిపారు.

రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో వైద్యులు నిరసన తెలిపారు. పట్టణ కేంద్రంలోని పట్నం మహేందర్‌రెడ్డి, మెడికల్ కాలేజ్ సీనియర్ డాక్టర్లు, వైద్య విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కాలేజీ డీన్ డాక్టర్ పివి సత్యనారాయణ, హాస్టల్ సూపరింటెండెంట్ రామకృష్ణారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.జోయారాణి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

సిద్దిపేట జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాత బస్టాండ్ వద్ద అమ్మాయిలపై జరుగుతున్న దాడులను నాటికల రూపంలో ప్రదర్శించారు. రాఖీ పండుగ సందర్భంగా మహిళా వైద్యులకు పెప్పర్ స్ప్రేలను అందించారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ.. బాంగ్లాదేశ్, గాజాలో జరుగుతున్న దారుణాలపై మాట్లాడే మేధావులు.. కోల్‌కతా ఘటనపై ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. ప్రాణాలు కాపాడే డాక్టర్లకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మెడికల్ కళాశాలల్లో రెస్ట్ రూమ్స్, సెక్యూరిటీ లేదని.. ఇలా ఉంటే డాక్టర్‌లు ఎలా డ్యూటీలు చేయాలని ప్రశ్నించారు. ఘటన జరిగి ఇన్ని రోజులు అయినా సంఘాలు కానీ, మేధావులు, రాజకీయ నాయకులు, ప్రజలు కూడా నోరు తెరవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆడపిల్లని ముట్టుకోవాలంటే భయం ఏర్పడేలా చట్టాలు తేవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిద్దిపేటలోని ప్రయివేట్ ఆస్పత్రుల్లో శనివారం అన్ని రకాల వైద్య సేవలనూ నిలిపివేస్తున్నట్టు సిద్దిపేట ఐఎంఏ అధ్యక్షులు భాస్కరరావు, కార్యదర్శి రవికాంత్ తెలిపారు. అన్నీ బంద్ ఉంటాయని, ప్రజలు గమనించి తమకు సహకరించాలని కోరారు.

జూనియర్ డాక్టర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి నుంచి ర్యాలీ చేపట్టి ఎన్టీఆర్ చౌరస్తాకు చేరుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు జూనియర్ డాక్టర్లు మాట్లాడుతూ.. లైంగికదాడి, హత్య ఘటన నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు మరోసారి పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలు రూపొందించాలని కోరారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కేంద్ర కమిటీ పిలుపు మేరకు నేడు(శనివారం) ప్రయివేటు ఆస్పత్రులు బంద్ పాటించనున్నాయి. జిల్లా కేంద్రంతో పాటు, ఆర్మూర్‌లో కూడా ఆస్పత్రుల బంద్ పాటించనున్నట్టు ఐఎంఏ ప్రతినిధులు తెలిపారు.

నల్లగొండ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి జూనియర్ డాక్టర్లు గడియారం సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్‌కు బైక్ ర్యాలీగా వెళ్లి జిల్లా అదనపు కలెక్టర్ పూర్ణచంద్రకు వినతిపత్రం అందజేశారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాలలో రక్షణ సౌకర్యాలు కల్పించాలని కోరారు. మెడికల్ కళాశాలలో ఇబ్బందులున్నాయి, విధుల నిర్వహణలో (షిఫ్ట్ ప్రాబ్లమ్స్) డాక్టర్లు, విద్యార్థులు సమస్యలు ఎదుర్కొంటున్నట్టు చెప్పారు. అత్యవసర విభాగాలైన ఐసీయూ, ఎంసిహెచ్ వంటి ప్రాంతాల్లో సెక్యూరిటీని నియమించాలని, సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

హైదరాబాద్ నగరంలోని ప్రధాన ఆస్పత్రులైన గాంధీ, ఉస్మానియా, కోఠి ఈఎన్‌టీ, నిలోఫర్, చెస్ట్, మెంటల్, పంజాగుట్ట నిమ్స్ ఆస్పత్రులతోపాటు ఆయా జిల్లా హాస్పిటల్స్‌లో, ఏరియా హాస్పిటల్స్, యూసీహెచ్‌సీలు, పీహెచ్‌సీలలో వైద్య సిబ్బంది ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ర్యాలీలు చేశారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఎల్బీనగర్ -మహేశ్వరం
శనివారం | ఆగస్టు 17, 2024 | www.navatelangana.com

లక్ష్మీదేవి, గోమాతల పూజలో ఉప్పల దంపతులు

నవతెలంగాణ -నాగోల్



శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకొని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్, అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ జాతీయ కార్య నిర్వాహక అధ్యక్షుడు, రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మెన్ ఉప్పల శ్రీనివాస గుప్త నాగోల్ డివిజన్‌లోని కో-ఆపరేటివ్ కాలనీలో ఉన్న తన క్యాంపు కార్యాలయంలో లక్ష్మీదేవి, గోమాతల పూజ కార్యక్రమాలను ఆయన సతీమణి ఉప్పల స్వప్నతో కలిసి నిర్వహించారు.

సైదాబాద్‌లో సింగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి వర్ధంతి

నవతెలంగాణ - మలక్‌పేట్



జీహెచ్ఎంసీ మాజీ ఫ్లోర్ లీడర్ స్వర్గీయ సింగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి వర్ధంతి వేడుకలు సైదాబాద్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సైదాబాద్ ప్రధాన రహదారిపై ఉన్న ఆయన విగ్రహానికి వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సైదాబాద్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి స్వర్ణలతారెడ్డి, సునీల్ రెడ్డి, సంగీతారెడ్డి, అల్లి శ్రవణ్ కుమార్, రవిశంకర్, సుదర్శన్ రెడ్డి, యాదగిరి గౌడ్, డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పగిళ్ల శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మణ్ ఠాకూర్, పరమేశ్ ముదిరాజ్, వెంకటేశ్, రాచకొండ రమేశ్, శంకర్, మధు శ్రీరాం, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు ఓ వరం



• ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

నవతెలంగాణ-బడంగ్‌పేట్

సీఎం సహాయ నిధి పేదలకు ఓ వరం అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీకి 8మంది లబ్దిదారులకు 3లక్షలా 62 వేల రూపాయల సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరయ్యాయి. ఈ మేరకు మహేశ్వరం నియోజకవర్గం మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ జిల్లెలగూడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు రూ.3లక్షలా 62 వేల రూపాయలను ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గణేష్ తండ్రి సోమరాజు రూ.24,500, సయ్యద్ అబ్దుల్ ఖాదర్ తండ్రి అలిజదారి రూ.48వేలు, అంజమ్మ భర్త మల్లేష్‌కు రూ.48 వేలు, నసీన్ సుల్తానా భర్త అబ్దుల్ గాంధీకు రూ.37,500, షేక్ అభిగ్ అహ్మద్ తండ్రి షేక్ లియాగత్‌కు రూ.60 వేలు, యాసీన్ మల్లాహి తండ్రి బిన్ అహ్మద్మల్లాహికి రూ.60వేలు, నాగేశ్వరరావు తండ్రి తుల్జాకు రూ.60వేలు, యంజాల రాజమణి భర్త యాదగిరికి రూ.24వేలను అందజేసినట్టు తెలిపారు. గత ప్రభుత్వంలో మాజీ సీఎం కేసీఆర్ అధికారంలో ఉన్న సమయంలో పేద ప్రజలకు ఎంతో మేలు చేశారని గుర్తు చేశారు. గత ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జల్‌పల్లి మున్సిపాలిటీ వర్కింగ్ ప్రెసిడెంట్లు యంజాల జనార్ధన్, హమీద్ షర్ఫుద్దీన్, మున్సిపాలిటీ యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ యంజాల అర్జున్, సీనియర్ నాయకులు సైదు పటేల్, పోలేమోనీ నాగేష్ ముదిరాజ్ పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఉద్యమించాలి

• సీపీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

నవతెలంగాణ - నాగోల్

దేశ సమగ్రత, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం దేశవ్యాప్తంగా ఉన్న కమ్యూనిస్టులు, ప్రజాస్వామ్య వాదులు ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం, సమయం ఆసన్నమైందని సీపీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివ రావు అన్నారు. నాగోలు డివిజన్‌లోని బండ్లగూడలో ఉన్న గిరి ప్రసాద్ భవన్‌లో నిమ్మల నరసింహ అధ్యక్షతన జరిగిన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సీపీఐ పార్టీ నిర్మాణ మహాసభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో మతోన్మాదం, మను వాదులకు వ్యతిరేకంగా, ఐక్య పోరాటాలు చేస్తూ దేశ సమగ్రతను కాపాడాలని కోరారు. దేశ ప్రధాని అను సరిస్తున్న కార్మిక, కర్షక, విద్యార్థి, రైతు, యువజన, వ్యతిరేక విధానాలను ప్రతి ఒక్కరూ వ్యతిరేకిం చాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో సింగరేణిలో కేంద్రం చేపట్టిన బొగ్గు గనుల వేలాన్ని రద్దుచేసి, సింగరేణి కార్మికులకే కేటాయించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. రాష్ట్ర విభజన సమయంలో కేంద్ర ప్రభుత్వం బయ్యారం స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిందని, ఇంతవరకు దాన్ని నెరవేర్చకుండా కాలయాపన చేస్తుందని విమర్శించారు. విభజన హామీలను అన్ని అమలు చేస్తూ ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం త్వరితగతిన చర్యలు చేపట్టాలన్నారు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్. బాల మల్లేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలుపరిచి మాట నిలబెట్టుకోవాలన్నారు. ముఖ్యంగా పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, రేషన్ కార్డులు, ఇంటి స్థలాలు



పట్టాలు, అర్హులైన వారందరికీ ఇంటి నిర్మాణాలకు రూ.6లక్షలు అందజేయాలని డిమాండ్ చేశారు. సభకు ముందుగా సీనియర్ కమ్యూనిస్టు నాయకులు దశరథ అరుణ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం జిల్లా పార్టీ కార్యదర్శి డి జి సాయిలుగౌడ్ గత కార్యక్రమాలపై రిపోర్ట్‌ను ప్రవేశ పెట్టారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్యదర్శి దామోదర్ రెడ్డి, ఉమా మహేష్, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, పార్టీ నేతలు ఎండి యూసుఫ్, ఏసురత్నము, ఆర్.కృష్ణమూర్తి, స్వామి, టి.శంకర్ హరినాథరావు, రచ్చ కిషన్, లొట్టి.ఈశ్వర్, ఎస్.వెంకట్ రెడ్డి బొడ్డుపల్లి కృష్ణ, ప్రమీల, గిరిజ తదితరులు పాల్గొన్నారు.

ఇన్నోవేటర్స్‌ను అభినందించిన కలెక్టర్



• ప్రశంసా పత్రాల అందజేత

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఇంటింటా ఇన్నోవేటర్-2024 పోటీల్లో విజేతలుగా నిలిచిన పది మంది ఆవిష్కర్తలను 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అభినందించారు. సృజనాత్మకతను ప్రోత్సహించడంతో పాటు స్థానిక సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నూతన ఆవిష్కరణలకు అవకాశమిచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏటా ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. జిల్లా నుంచి ఎంపికైనా పది మంది ఇన్నోవేటర్స్‌ను గురువారం లక్డీకాపూల్‌లోని కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విజేతలకు ప్రశంసా పత్రాలతో సత్కారించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం కోసం విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, వివిధ స్వచ్ఛంద సేవా సంస్థల సహాయం తీసుకుని తెలంగాణ అభివృద్ధికి సహకరించాలని కోరారు. అనంతరం జిల్లా సైన్స్ అధికారి సి.ధర్మేందర్ మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాలు మేరకు జిల్లాలోని 16 మండలాల్లో అన్ని యాజమాన్య పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, గైడ్ టీచర్లకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని, ఇంటింటా ఇన్నోవేటర్ పోటీల్లో జిల్లా నుంచి పది మంది విద్యార్థులలో అయిదుగురు విద్యార్థులు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు చెందినవారే కావడం చాలా సంతోషంగా గర్వంగా ఉందన్నారు. జీహెచ్ఎస్ కుల్సుంపురా, షేక్‌పేట్ విద్యార్థులకు అటల్ టింకరింగ్ ల్యాబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఇన్నోవేషన్ శిక్షణను లెర్నింగ్ లింక్స్ ఫౌండేషన్, డేల్ టెక్నాలజీ సహకారంతో తరీక్ మోజెబి, ఫారహా సహకారం అందించారని తెలిపారు. ఆవిష్కర్తలను, డీఎస్‌వో ధర్మేందర్ రావ్‌ను డీఈవో ఆర్.రోహిణి అభినందించారు.



విజేతలు వారి ఆవిష్కరణలు..

1. మేఘన, జాదవ్ శ్లోక్(జీహెచ్ఎస్ కుల్సుంపుర) - స్మార్ట్ పెస్టిసైడ్స్ స్ప్రేయర్
2. పి.నందప్రియ(జీహెచ్ఎస్ షేక్‌పేట్)- ఆటోమేటిక్ సాంబర్ డిస్పెన్సర్
3. సుజిత్ (జీహెచ్ఎస్ ఎన్‌బీటీ నగర్) - బ్లైండ్ స్టిక్
4. ఆసిహ ఇరుమ్, రిజక్వా(జీహెచ్ఎస్ మహబూబియా)- బయో వాటర్ బాటిల్
5. ఐశ్వర్య క్రిటిసింగ్(సిస్టర్ నివేదిత స్కూల్)-సస్టైనబుల్ అర్బన్ డ్రైయినేజీ సిస్టమ్
6. మెహ్రీన్ ఘోరి(ఎంఎస్ క్రియేటివ్ మురాధనగర్)-స్మార్ట్ సోలార్ పవర్డ్ రీ-సైకిలర్
7. పి.శ్లోక(హెచ్‌పీఎస్ రామంతాపూర్) - చైల్డ్ కేర్ సిస్టమ్
8. బి.అభిలాష్(సీఎంఆర్ కాలేజీ) - ఐవోటీ బేస్ వెదర్ రిపోర్టింగ్ సిస్టమ్ ఫర్ అగ్రికల్చర్
9. ఎల్. అఖిల్ చంద్రా(నారాయణ కాలేజీ-ఎల్బీనగర్)- స్టాప్ అగ్రికల్చర్ రెసిడ్యూ బర్నింగ్
10. కీర్తన - స్మార్ట్ పార్కింగ్ సొల్యూషన్ ఫర్ అన్‌థరైజ్డ్ పార్కింగ్ డిటెక్షన్

డీజీపీగా పదోన్నతి పొందిన నగర పోలీస్ కమిషనర్

• శుభాకాంక్షలు తెలిపిన పోలీసు అధికారుల సంఘం

నవతెలంగాణ-సిటీబ్యూరో

డీజీపీగా పదోన్నతి పొందిన నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డికి సిటీ పోలీస్ అధికారుల సంఘంతోపాటు సిటీ పోలీస్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ సభ్యులు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు నల్లా శంకర్ రెడ్డి నేతృత్వంలో శుక్రవారం బంజారాహిల్స్‌లోని సీసీసీలో పోలీస్ కమిషనర్‌ను కలిశారు. కమిషనర్‌కు శుభాకాంక్షలు తెలిపి, సంతోషాన్ని వ్యక్తం చేశారు.

నగర పోలీస్ సిబ్బందికి సంబంధించిన పలు విషయాలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో నల్లా శంకర్ రెడ్డితోపాటు కోపరేటివ్ సొసైటీ ట్రెజరర్ విక్టర్, వైస్ ప్రెసిడెంట్ ఆసిఫ్ ఖాన్, సభ్యులు జనార్ధన్ రెడ్డితోపాటు తదితరులున్నారు.



కమలానగర్‌లో కార్పొరేటర్ పర్యటన



నవతెలంగాణ-వనస్థలిపురం

హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని కమలానగర్‌లో కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి శుక్రవారం అధికారులతో కలిసి పర్యటించారు. కమలానగర్‌లోని రోడ్ నెంబర్ 2, 7లలో లోతట్టుగా ఉండటం వలన వర్షం వచ్చినప్పుడు ముంపునకు గురై కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారనే విషయాన్ని స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కార్పొరేటర్ మాట్లాడుతూ అతి త్వరలోనే రోడ్ నెంబర్ 2,7 లలో వరద నీటి కాలువ పైపులైన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. తర్వాత అధికారులతో కలిసి వరద నీటి కాలువ పైప్ లైన్ నిర్మాణం కోసం లెవెల్స్ పరిశీలించారు. అనంతరం వరద నీటి కాలువలో ఉన్న చెత్తా చెదారాన్ని సంబంధిత సిబ్బందితో శుభ్రం చేయించారు. ఈ పర్యటనలో డీఈ దామోదర్, ఏఈ చంద్ర శేఖర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సురేష్, కాలనీ అధ్యక్షులు టీవి రావు, బండారి మల్లేశ్వర్, మదన్ రెడ్డి, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

పోలీసులు సమాజం గర్వించేలా పనిచేయాలి



ఏసీపీ కాశీ రెడ్డి

నవతెలంగాణ-హయత్‌నగర్

పోలీసులు ఎక్కడ విధులు నిర్వహించిన సమాజం గర్వించేలా పనిచేయాలని వనస్థలిపురం ఏసీపీ కాశీ రెడ్డి అన్నారు. హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల బదిలీ అయిన 25మంది పోలీస్ సిబ్బందికి హయత్ నగర్ ఇన్స్ పెక్టర్ రామకృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం వీడ్కోలు ఆత్మీయ సమ్మేళం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ప్రతీ పోలీస్ ప్రజలకు జవాబు దారిగా ఉంటూ, విధుల్లో నిక్కచ్చితత్వం, నిబద్ధతతో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వనస్థలిపురం, అబ్దుల్లాపూర్‌మెట్, మీర్‌పేట ఇన్స్‌పెక్టర్లు పాల్గొన్నారు.

భారతరత్న వాజ్‌పేయి వర్ధంతి



నవతెలంగాణ-తుర్కయంజాల్

భారత రత్న మాజీ ప్రధాని అటల్ బీహారి వాజ్ పాయ్ 8వ వర్ధంతిని పురస్కరించుకొని శుక్రవారం తుర్కయంజాల్ కూడలిలో భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కోశాధికారి బచ్చిగళ్ల రమేష్ ఆధ్వర్యంలో ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర క్రమం శిక్షణ కమిటీ సభ్యులు బోసుపల్లి ప్రతాప్ మాట్లాడుతూ వాజ్ పాయ్ సమర్థవంతమైన నాయకుడు అని కొనియాడారు. ఆయన పరిపాలనలో దేశం చాలా అభివృద్ధి చెందిందన్నారు. నేడు కేంద్రంలో నరేంద్ర మోదీ సారథ్యంలో మూడోసారి అధికారంలోకి వచ్చిందంటే అది కేవలం కేంద్రంలో వాజ్ పాయ్ తీసుకోచ్చిన సంస్కరణ లే కారణమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకులు పలుస శ్రవణ్ కుమార్ గౌడ్, సీనియర్ నాయకులు సామ అల్వాల్ రెడ్డి, పుల్లగుట్టం మోహన్ రెడ్డి, బొడ్డు సుక్కయ్య, బీజేపీ మున్సిపాలిటీ ఉపాధ్యక్షులు నాయిని సంజీవ రెడ్డి, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు కంచినాని దాస్, బీజేవైఎం నాయకుడు శివ, మల్లెల రమేష్, మరియన్న, సత్తయ్య, వెంకటేష్ యాదవ్, చింటు తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు కాలనీ వారీగా షెడ్యూల్ తయారు చేయాలి

• కమిషనర్ ఆమ్రపాలి కాట

నవతెలంగాణ-సిటీబ్యూరో

దోమల నివారణకు చేపట్టే ఆంటీ లార్వా ఆపరేషన్, ఫాగింగ్ చర్యలపై కాలనీ వారీగా షెడ్యూల్డ్ తయారు చేయాలని కమిషనర్ ఆమ్రపాలి కాట అధికారులను ఆదేశించారు. శుక్రవారం అడిషనల్, జోనల్ కమిషనర్‌లతో ఆమె టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ దోమల నివారణ చర్యల పై షెడ్యూల్డ్ తయారు చేసి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని తెలిపారు. షెడ్యూల్డ్ ప్రకారంగా నెలకు నాలుగు లేదా ఐదు సార్లు కాలనీకి దోమల నివారణ చర్యలు తీసుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. షెడ్యూల్డ్ ప్రకారంగా ఆంటీ లార్వా ఆపరేషన్, ఫాగింగ్ చర్యలు ఎప్పుడు చేస్తారు అనేది తేదీల వారీగా కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులకు తెలియజేయాలని సూచించారు. కుక్కల ఫీడింగ్ కోసం ఆసక్తి ఉన్న ఎన్జీవోలు సి ఎస్ ఆర్ పద్ధతిలో చేపట్టేందుకు ముందుకు వచ్చిన పక్షంలో వారి తో ప్రయోగాత్మకంగా కొన్ని సర్కిల్ లో చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ - ఎల్బీనగర్



మహిళలను కించపరిచే విధంగా కేటీఆర్ వ్యాఖ్యానించడంపై తెలంగాణ రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ మల్ రెడ్డి రామ్ రెడ్డి ఆధ్వర్యంలో దిల్‌సుఖ్ నగర్ చౌరస్తాలో కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా మల్‌రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ ఉచిత బస్సు ప్రయాణం ద్వారా మహిళలు సంతోషంగా ప్రయాణించడం ఓర్చుకోలేక మహిళలు బస్సులలో కుటుంబాలతో కలిసి డాన్స్ చేసుకోండి అంటూ కేటీఆర్ అనుచిత వ్యాఖ్యలు చేయడం పట్ల తీవ్రంగా మండిపడ్డారు. మీ ఇంట్లో కూడా ఆడవాళ్లు ఉన్నారు కదా వాళ్లు అలానే బస్సులలో బ్రేక్ డాన్సులు చేస్తున్నారా అంటూ ప్రశ్నించారు. నీ అయ్య ఇలా చిల్లర మాటలు మాట్లాడితేనే ఆ కండ కావరన్ని తగ్గించి ఫామ్ హౌజ్‌లో పండబెట్టారని అన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చడం ప్రతిపక్ష నాయకులకు మింగుడు పడక..ఇలాంటి అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని అన్నారు. వెంటనే కేటీఆర్ మహిళలకు క్షమాపణ చెప్పకపోతే కేటీఆర్‌ను మహిళలే రోడ్డుపైన పరిగెత్తించి కొడతారని హెచ్చరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బీఆర్ఎస్ నాయకులకు ఎన్నో పబ్బులు ఉండేవని.. అందులో డ్రగ్స్, మత్తుమందులు సేవించి డాన్సులు చేసిన చరిత్రలు ఉన్నాయని ఆరోపించారు.

మీలాగా ఫామ్ హౌజ్‌లో పడుకొని నడిపే ప్రభుత్వం కాదని, ఇది పూర్తిగా ప్రజా ప్రభుత్వం, ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వం అని తెలిపారు. మీరు 1లక్ష రుణమాఫీని 5 సంవత్సరాలలో, అది కూడా విడతల వారీగా కూడా సక్రమంగా చేయలేకపోయారని విమర్శించారు. మేము అధికారంలోకి వచ్చిన 8 నెలల్లోనే 2 లక్షల వరకు రుణమాఫీని, 30వేల కోట్ల రూపాయిలు రైతుల ఖాతాలో వేశామన్నారు. రైతులు సంతోషంగా ఉండటం కూడా బీఆర్ఎస్‌కు ఇష్టంలేదని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కార్పొరేటర్ ధర్పల్లి రాజశేఖర్ రెడ్డి, గుర్రం శ్రీనివాస్ రెడ్డి, సురేందర్ రెడ్డి, శ్రీపాల్ రెడ్డి, జైపాల్ రెడ్డి, మతిన్ షరీఫ్, సుజాత రెడ్డి, వెంకట్ రామ్ రెడ్డి, పాషా బాయ్, మోహన్ రెడ్డి, మక్షుద్ భాయ్, అరుణ్ అంబేద్కర్, అశోక్ రెడ్డి, అజయ్, షఫీ, కిరణ్, బద్రి, హుస్సేన్, శశికళ, శీను, విజయ్, భాస్కర్, యుగేందర్, శ్రీనివాస్, రామకృష్ణ, భాను, రాము, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో పనులు పూర్తిచేసేందుకు కృషి

• ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్

నవతెలంగాణ - హస్తినాపురం

హస్తినాపురం డివిజన్ స్ట్రాటజిక్ నాలా డెవలప్మెంట్ ప్రోగ్రాం ద్వారా చేపడుతున్న పనులను త్వరలో పూర్తి చేసే విధంగా కృషి చేస్తానని ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ అన్నారు. శుక్రవారం నాడు మార్నింగ్ వాక్‌లో భాగంగా జిల్లా పరిషత్ రోడ్‌లో ఉన్న పంచాయతీరాజ్ టీచర్స్ కాలనీలో పర్యటించి.. ఎస్ఎన్‌డీపీ ద్వారా చేపడుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు.. భారీ వర్షాలు వస్తే వరద ముంపు సమస్య ఏర్పడుతుందని, ఇలాంటి సమస్య తలెత్తకుండా పరిష్కరించాలని కోరారు.

అనంతరం కమిషనర్ మాట్లాడుతూ పనులు పూర్తి చేయడానికి ల్యాండ్ సమస్య ఉందని, వెంటనే ఆ సమస్యను పరిష్కరించి.. పనులు పూర్తి చేసే విధంగా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపరిటెండెంట్ ఇంజనీర్ అశోక్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్తీక్, అసిస్టెంట్ ఇంజనీర్ హేము నాయక్, డిప్యూటీ కమిషనర్ జకియా సుల్తానా, డీసీపీ గజానంద్, జీహెచ్ఎంసీ సిబ్బంది నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, సాయి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





వరలక్ష్మి వ్రతాన్ని పురస్కరించుకొని బాగ్అంబర్‌పేట మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆలయ కమిటీ చైర్మెన్ కోట్ల శివకుమార్, సభ్యులు కోట్ల కిరణ్ కుమార్ గౌరీ, శంకర్, సువర్ణ, తదితరులు

నవతెలంగాణ-అంబర్‌పేట



తెలంగాణ రాష్ట్ర వంజరి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వివిధ సేవా కార్యక్రమంలో సేవ చేసినందుకు అంబర్‌పేట నియోజకవర్గానికి చెందిన లవంగు అంజనేయులుకి సేవ రత్న అవార్డును రాష్ట్ర అధ్యక్షులు కాలేరు నరేష్ అందజేశారు.

నవతెలంగాణ-అంబర్‌పేట

ఐఈఆర్‌పీ ఉపాధ్యాయులను క్రమబద్ధీకరణ చేసి న్యాయం చేయాలి

- ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, ప్రొఫెసర్ హరగోపాల్



నవతెలంగాణ-ముషీరాబాద్

ప్రభుత్వ పాఠశాలలో వికలాంగ విద్యార్థులకు గత 20 సంవత్సరాలుగా విద్యా బోధన చేస్తూ కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న ప్రత్యేక ఉపాధ్యాయులైన 756 మంది ఐఈఆర్‌పి ఉపాధ్యాయులను వెంటనే క్రమబద్ధీకరణ చేసి న్యాయం చేయాలని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, ప్రొఫెసర్ హరగోపాల్ కోరారు. తెలంగాణ ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం బాగ్లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, ప్రొఫెసర్ హరగోపాల్, యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశం, హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వికలాంగ పిల్లలకు ఐఈడి స్కీం ద్వారా ప్రత్యేక ఉపాధ్యాయులను కాంట్రాక్ట్ పద్ధతిలో నియమించి విద్యాబోధన చేయడం జరుగుతుందన్నారు. ఐఈఆర్‌పిలు గత 20 సంవత్సరాలుగా విద్యాబోధన అందిస్తూ కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వం ఐఈఆర్‌పి ఉపాధ్యాయులను క్రమబద్ధీకరణ అంశం గురించి ఆలోచన చేసి డీఎస్సీ నందు కలపలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఈ పోస్టులను డీఎస్సీ 2024 నందు కలపడం వలన ప్రస్తుత ప్రభుత్వ పాఠశాలలో వికలాంగుల పిల్లలకు విద్య బోధన అందిస్తున్న కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు భవిష్యత్తులో ఉద్యోగాలు కోల్పోవాల్సి వస్తుందన్నారు. డీఎస్సీ 2024 ద్వారా నియమించబడే ప్రత్యేక ఉపాధ్యాయులు ప్రస్తుతం పని చేస్తున్న పాఠశాల అలైన్మెంట్ కావడం జరుగుతుంది తద్వారా ఐపిఆర్ లు ఉద్యోగాలు కోల్పోవాల్సి వస్తుందని ఆవేదన చెందారు. ఇతర రాష్ట్రాల అయినా మణిపూర్ హర్యానా పంజాబ్ లాంటి రాష్ట్రాలలో వికలాంగ పిల్లలకు విద్యాబోధన అందిస్తున్న కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న ఐఈ ఉపాధ్యాయులకు క్రమబద్ధీకరణ చేయడం జరిగిందని ఇటీవల కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన సమగ్ర శిక్ష నివేదిక నందు రాష్ట్రాలలో పిల్లలకు ప్రత్యేక ఉపాధ్యాయులను రెగ్యులర్ పద్ధతిలో నియమించి సమగ్ర శిక్ష విభాగంలో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న ప్రత్యేక ఉపాధ్యాయులను ముందుగా క్రమబద్ధీకరణ చేసి మిగిలిన నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేసుకోవాలని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు సూచన చేయడం జరిగిందన్నారు. సుప్రీం కోర్టు తీర్పుకు అనుగుణంగా పిల్లలకు నాణ్యమైన విద్య సౌకర్యాలు అందించే విధంగా పనిచేస్తున్న ఉపాధ్యాయులను క్రమబద్ధీకరణ చేసి సర్వీసును పరిగణలోకి తీసుకొని సంవత్సరానికి ఒక మార్కు ఇస్తూ కనీసం 20 మార్కులు తగ్గకుండా వెయిటేజ్ కల్పించి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐఈఆర్‌టి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిరణ్ కుమార్, 33 జిల్లాల అధ్యక్షులు కార్యదర్శులు పాల్గొన్నారు.

కుక్కకాటు బాధితులకు సత్వర చికిత్స అందించాలి

- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ పొట్రు
- మేడ్చల్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ తనిఖీ



నవతెలంగాణ-సిటీబ్యూరో

మేడ్చల్ మున్సిపాల్టీ పరిధిలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ పొట్రు శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వీధి కుక్కల బారిన పడిన బాధితులకు సత్వర ట్రీట్మెంట్ చేయాలని సూచించారు. ఏ ప్రాంతం నుంచి కుక్క కాటుకు గురై వస్తున్నారో.. ఆ వివరాలను సంబంధిత మున్సిపల్ కమిషనర్‌కి తెలియజేస్తే, వారు ఆ వీధి కుక్కలకు స్టెరిలైజేషన్ చేయిస్తారని తెలిపారు. ఈ ప్రక్రియను వేగవంతం చేసి వీధి కుక్కలు, కోతులు బారి నుంచి ప్రజలను కాపాడే బాధ్యత మనందరిదీ అన్నారు. వీధి కుక్కల నుంచి రక్షించుకోవడానికి కుక్కకాటుకు గురైనపుడు ప్రాథమికంగా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. వాతావరణ పరిస్థితులు మారుతున్నందున సీజనల్ వ్యాధులు, డెంగ్యూ, మలేరియా, డయేరియా, టైఫాయిడ్ జ్వరాలు వస్తుంటాయనీ, వాటర్, ఆహారం కలుషితం కాకుండా, మురుగు నీరు నిల్వ ఉండకుండా తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రాపిడ్ టెస్ట్ కిట్ల ద్వారా బ్లడ్ శాంపిల్స్ తీసుకుని పరీక్షించి తీవ్రతను బట్టి జ్వర నిర్ధారణ చేసి అత్యవసరమైన వైద్యసాయం అందించాలని తెలిపారు. డెంగ్యూ జ్వరం మార్క్ చేసిన ప్రాంతం గుర్తించి మున్సిపల్ స్థాయి సిబ్బంది, గ్రామీణ స్థాయి సిబ్బంది ద్వారా దోమలు వ్యాప్తి చెందకుండా ప్రతిరోజూ ఫాగింగ్ చేయించాలని అధికారులను ఆదేశించారు. ఆసుత్రుల్లో కావాల్సిన మందులు, బెడ్లు, రాపిడ్ టెస్ట్ కిట్స్‌ను అదనంగా అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. డెంగ్యూ వ్యాప్తి చెందకుండా ప్రత్యేకమైన వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి ప్రజలకు తక్షణ వైద్యం అందేలా చూడాలని వైద్య అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా సమీకృత సలహా పరీక్ష కేంద్రం, ఆయుష్ విభాగం, ఫార్మసీ, ల్యాబ్, ఇన్-పేషంట్ /ఔట్-పేషంట్ విభాగాలను పరిశీలించిన అనంతరం ల్యాబ్‌లో అవసరమైన ఆధునిక టెస్టింగ్ ఎక్విప్మెంట్‌లను అందుబాటులో ఉంచుకుని ప్రజలకు మెరుగైన వైద్య సదు పాయలను అందించాలని సూచించారు. కలెక్టర్ వెంట డీఎంఅండ్‌హెచ్ఓ టి.రఘునాథ్ స్వామి, మేడ్చల్ మున్సిపల్ కమిషన్ నాగిరెడ్డి, వైద్య సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

డివిజన్‌ను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్తా..



నవతెలంగాణ-జవహర్‌నగర్

డివిజన్‌ను అభివృద్ధి పదంలో ముందుకు తీసుకు వెళ్తానని కార్పొరేటర్ జమాల్ పూర్ నవీన్ కుమార్ అన్నారు. శుక్రవారం జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 25వ డివిజన్‌లో మున్సిపల్ జనరల్ నిధులు రూ.5 లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రయినేజీ పనులను జవహర్ నగర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు దొంతగాని కోటేష్ గౌడ్, డివిజన్ కార్పొరేటర్ జమాల్ పూర్ నవీన్ కుమార్‌తో కలిసి కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ గొడుగు వేణు, మేకల లలిత యాదవ్, డివిజన్ అధ్యక్షులు శేఖర్, బిజెపి అశోక్, బస్తీ నాయకులు ఓం ప్రకాష్, లక్ష్మి, సిద్ధులు, రవి యాదవ్, ఉమ, మంగమ్మ శివ, వినోద్, కవిత, లక్ష్మిబాయి, రాములు, పోచమ్మ, కృష్ణ, ఎల్లయ్య, ఎల్లమ్మ పాల్గొన్నారు.

డొనేషన్లపై విచారణ జరిపించాలి

- ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మూర్తి, నాగరాజు



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఏరోనాటికల్ ఇంజినీరింగ్ కళాశాల, మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఇంజినీరింగ్ కాలేజీ డొనేషన్లపై విచారణ జరిపించి నష్టపోయిన విద్యార్థి తల్లిదండ్రులకు న్యాయం చేయాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కళాశాల ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. రూ.లక్షలు వసూలు చేసిన కాలేజీ నుంచి విద్యార్థులందరికీ అడ్మిషన్లు ఇప్పించాలని కోరారు. బీ కేటగిరీ అడ్మిషన్ల నోటిఫికేషన్ రాకముందే ఈ డబ్బులను రసీదు లేకుండా వసూలు చేశారని తెలిపారు. మూడో పేజీ కౌన్సిలింగ్ చివరి రోజు విద్యార్థులకు సీట్లను కేటాయించకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు యాజమాన్యాన్ని నిలదీయడంతో చేసేదేమీ లేక సీట్లు ఇవ్వలేమని చేతులెత్తేశారని తెలిపారు. విద్యార్థులకు న్యాయం చేయకుంటే, డబ్బులు తీసుకున్న విద్యార్థులకు అడ్మిషన్లు ఇవ్వకుంటే రాష్ట్ర వ్యాప్త ఉద్యమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. ఈ ధర్నాలో ఎస్ఎఫ్ఐ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.కార్తీక్, రాథోడ్ సంతోష్, జిల్లా ఉపాధ్యక్షుడు వంశీ, జిల్లా కమిటీ సభ్యులు భగత్, నాయకులు అజయ్, నందీశ్వర్, కర్ణాకర్, శ్రీకాంత్, సాయిరాం, తదితరులు పాల్గొన్నారు.

వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ మిమిక్రీ శ్రీను



నవతెలంగాణ-అంబర్‌పేట

జీవీఆర్ కరాటే అకాడమీకి చెందిన ఎం. శ్రీనివాస్ (మిమిక్రీ శ్రీను) 9 నిమిషాల 35 సెకండ్లలో తన కంఠంతో మిమిక్రీ ద్వారా 78 రకాల ధ్వనులను పూర్తిచేసి వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించుకున్నాడు. కాచిగూడలోని జీవీఆర్ కరాటే అకాడమిలో వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధుల సమక్షంలో జరిగిన ప్రదర్శనలో 15 నిమిషాల్లో 78 రకాల ధ్వనులను పూర్తి చేయాల్సిన శ్రీనివాస్ కేవలం 9 నిమిషాల 35 సెకండ్లలోనే లక్ష్యాన్ని చేరుకుని అరుదైన వరల్డ్ రికార్డ్స్‌ను సొంతం చేసుకున్నాడు. వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇండియా చీఫ్ కో ఆర్డినేటర్ బింగి నరేందర్ గౌడ్ శ్రీనివాస్‌కు రికార్డ్స్ మెమోంటో, సర్టిఫికెట్‌ను అందజేశారు. శ్రీనివాస్ వరల్డ్ రికార్డ్ సాధించిన సందర్భంగా శుక్రవారం జీవార్ కరాటే అకాడమిలో ఆయనను ఘనంగా సత్కరించి అభినందించారు. కార్యక్ర మంలో జీవీఆర్ కరాటే ఆకాడమి డైరెక్టర్ డాక్టర్ జీఎస్ గోపాల్ రెడ్డి, కార్పొరేటర్ మహాలక్ష్మీ, అమృతరెడ్డి, జగదీష్ చంద్ర, తదతరులు పాల్గొన్నారు.

మల్కాజిగిరి చౌరస్తాలో కేటీఆర్ దిష్టిబొమ్మల దగ్ధం..



నవతెలంగాణ-మల్కాజిగిరి

మల్కాజ్గిరి చౌరస్తాలో మహిళల ఉచిత బస్ ప్రయాణంపై కేటీఆర్ అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఆదేశాల మేరకు కేటీఆర్ దిష్టి బొమ్మ దహనం చేశారు. ఈకార్యక్రమంలో బీ బ్లాక్ అధ్యక్షుడు వెంకటేశ్ యాదవ్, జీఎస్‌వీ సతీష్ కుమార్ గుండా నిరంజన్, బీ కే శ్రీనివాస్ పిట్టల శ్రీనివాస్ సంతోష్ రాందాస్ కొండా గౌడ్ నరేందర్ గౌడ్ డివిజన్ అధ్యక్షులు జీడి సంపత్ గౌడ్, వైనాల ప్రవీణ్ పంజా శ్రీనివాస్ యాదవ్ వినోద్ యాదవ్ ఉమేష్ సింగ్, సయ్యద్ మబ్బు, ఫరీ ద్, యూత్ అధ్యక్షుడు జీడి చరణ్ జీత్ గౌడ్, చెన్నారెడ్డి, వెంకు, పిట్టల నాగరాజు, సురేష్ సింగ్, శ్రీరామ్, మహిళా నాయకులు ఉమామహేశ్వరి భాగ్య పద్మ జాన్వి ఆశ ప్రభావతి, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

వరి, కురగాయాల సాగులో మెళకువలు పాటించాలి

- దక్షిణ తెలంగాణ మండలం సహా సంచాలకులు డాక్టర్ మల్లారెడ్డి



నవతెలంగాణ- శామీర్‌పేట

వరి, కూరగాయలు, పండ్ల తోటల సాగులో సంబంధిత శాఖ అధికారుల సలహాలు సూచనలతో మెళకువలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని దక్షిణ తెలంగాణ మండలం సహా సంచాలకులు డాక్టర్ మల్లారెడ్డి, ఏరువాక కేంద్రం భువనగిరి ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ అనిల్ కుమార్ రైతులకు సూచించారు. శుక్రవారం శామీర్ పేట మండలంలోని అలియాబాద్ బాబాగూడ గ్రామాల్లో వారు పర్యటించి వరి పొలాలు, కూరగాయలు, పండ్ల తోటలను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా అలియాబాద్‌లో వరి పంట ఆశించే పురుగు, తెగుళ్ళు, ఎరువులు వాడకం విత్తన రకం గురించి అదేవిధంగా బాబా గూడ గ్రామంలో కూరగాయ సాగు, పండ్ల తోటలు, వరి పొలాలు పరిశీలించి రైలు రైతులతో ముఖాముఖి మాట్లాడారు. కూరగాయల్లో కూలీల ఖర్చు, మార్కెట్ ధర విత్తనాలు గూర్చి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలు సలహాలు సూచనలు రైతులకు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శామీర్‌పేట వ్యవసాయ అధికారి సిహెచ్ రమేష్, ఏఈఓ రవి యాదవ్, రైతులు రాంరెడ్డి, సురేందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, కృష్ణ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రావణమాసం మహిళలకు ఎంతో విశిష్టమైనది

- కార్పొరేటర్ సునీత శేఖర్ యాదవ్

నవతెలంగాణ-నేరేడ్‌మెట్



తెలుగు రాష్ట్ర ప్రజలకు, ముఖ్యంగా మహిళలకు శ్రావణమాసం జరుపుకునే వరలక్ష్మి వ్రతం ఎంతో విశిష్టమైనదని మౌలాలి డివిజన్ కార్పొరేటర్ సునీత శేఖర్ యాదవ్ అన్నారు. శుక్రవారం వరలక్ష్మి వ్రతం సందర్భంగా కార్పొరేటర్ తమ నివాసంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వరలక్ష్మి వ్రత పూజ పూర్తైన అనంతరం ముత్తైదువులను ఇంటికి పిలిచి కుంకుమ బొట్టు, గంధం, పాదాలకు పసుపు రాసి వారి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరి ఇంట లక్ష్మీదేవి కరుణ కటాక్షం కలగాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు.

మున్సిపల్, రెవిన్యూ శాఖలు సమన్వయంతో పనిచేయాలి



నవతెలంగాణ-జవహర్ నగర్

మున్సిపల్, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పని చేయాలని మున్సిపల్ కమిషనర్ తాజ్ మోహన్ రెడ్డి అన్నారు. రెవెన్యూ శాఖలో ఇటీవల జరిగిన బదిలీల ప్రక్రియలో భాగంగా జవహర్ నగర్ నూతన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లుగా నియమితులైన రమేష్, విజయేంద్ర సాయిలు శుక్రవారం జవహర్ నగర్ మున్సిపల్ కార్యాలయంలో కమీషనర్ తాజ్ మోహన్‌రెడ్డితో సమావేశమయ్యారు. మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ పోట్రు ఆదేశాల మేరకు ప్రభుత్వ భూములను రక్షించడమే లక్ష్యంగా మున్సిపల్, రెవెన్యూ డిపార్ట్మెంట్‌లు సమన్వయంతో పని చేస్తామని పేర్కొన్నారు. భూ కబ్జాలకు పాల్పడే వ్యక్తుల వివరాలను సేకరించి వారిపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు. జవహర్ నగర్ మున్సిపల్ పరిధిలో ఉన్న పేద ప్రజలు ప్రభుత్వ భూమిని కబ్జాదారుల నుండి కొనుగోలు చేసుకొని మోసపోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ టౌన్ ప్లానింగ్ జూనియర్ అసిస్టెంట్ పాండు, రెవెన్యూ రికార్డ్ అసిస్టెంట్లు కాశీరామ్, రమేశ్ లు పాల్గొన్నారు.

చెత్త తీయాల్సిన చోటే... చెత్త వేస్తున్న రాంకీ

- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నా పట్టించుకోని అధికారులు



నవతెలంగాణ-సిటీబ్యూరో

మహానగరంలో అపరిశుభ్రత విజృంభిస్తోంది. అధికారుల నిర్లక్ష్యంతో నగరంలోని పలు ప్రాంతాలు వీధులు, రోడ్లు చెత్తకుప్పలుగా మారడం, దానికితోడు చుట్టుపక్కల కంపుకొడుతుండడంతో నగరవాసులు అల్లాడిపోతున్నారు. కూరగాయల మార్కెట్లు, పూల మార్కెట్లు, మూసీ పరివాహక ప్రాంతాలు, అంతర్గత రోడ్లు, నాలాల్లో చెత్తాచెదారం పేరుకుపోయి కంపుకొడుతోంది. మరికొన్ని ప్రాంతాల్లో చెత్తసేకరణను పట్టించుకోవడంపోవడంతో రోడ్లపై చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. దాంతో స్థానికులు జబ్బులు, దోమలతో స్థానిక ప్రజలు, వాహనదారులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యంగా నగరంలో ప్రతిరోజు వ్యర్థాల తొలగింపు సవ్యంగా జరగకపోవడంతో ఆయా ప్రాంతాలల్లో దుర్గంధ వాశనతో ముక్కు పూటలు అధురుతున్నాయి.

గ్రేటర్‌లో 7500 మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తన్నం

జీహెచ్ఎంసీ పరిధిలో 6 జోన్లు, 30 సర్కిల్స్‌లో ప్రతి రోజు 4500 స్వచ్ఛ ఆటోల ద్వారా నగరంలో ఇంటింటి నుండి చెత్త సేకరణ చేస్తున్నారు. ఇలా గ్రేటర్‌లో 7500 మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తవుతుంది. సేకరించిన చెత్తను నగరంలోని సెంకడరీ ట్రాన్స్‌పోర్టు స్టేషన్‌కు చేరుస్తారు. అక్కడి నుంచి రాంకీ సంస్థ చెత్తను తీసుకెళ్లి డంపింగ్ యార్డుకు తరలిస్తారు. ఇదిలావుండగా కొన్ని కాలనీలల్లో సేకరించిన చెత్తను రాంకీ సంస్థ నేరుగా లారీలల్లో డంపింగ్ యార్డుకు తరలిస్తుంది. నగరంలోని సెంకడరీ ట్రాన్స్‌పోర్టు స్టేషన్‌కు తరలించిన చెత్తతోపాటు భవన నిర్మాణ వ్యర్థాల (సి అండ్ డి) ప్రతిరోజు 1500 మెట్రిక్ టన్నుల సి అండ్ డి సేకరించి, దాదాపు 250 లారీలల్లో జవహర్ నగర్ డంపింగ్ యార్డుకు తరలిస్తున్నామని అధికారుల లెక్కలు చెపుతున్నాయి.

రాంకీ... ఇదేం పని?

నగరంలోని సెంకడరీ ట్రాన్స్‌పోర్టు స్టేషన్ నుంచి సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుకు తరలించాలి కానీ కొన్ని ప్రాంతాలల్లో సెంకడరీ ట్రాన్స్‌పోర్టు స్టేషన్లలో చెత్తవేస్తుండడంతో విమర్శలు వస్తున్నాయి. చర్లపల్లి డివిజన్ ఆదర్శనగర్‌లోని సెంకడరీ ట్రాన్స్‌పోర్టు స్టేషన్లలో రాంకీ లారీలతో చెత్తను డంపింగ్ చేయడం ఆందోళన కలిగిస్తోంది. జవహర్ నగర్ డంపింగ్ యార్డ్‌కు వెళ్లాల్సిన చెత్తను తీసుకొచ్చి సెకండరీ ట్రాన్స్‌పోర్టు స్టేషన్లోనే వేయడంపై స్థానికుల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గార్బేజ్ విస్తరించకుండా చుట్టూరా రేకులు అమర్చాలని స్థానికులు డిమాండ్ చేసినా ఆ సంస్థ పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోయారు. చెత్త నిర్వహణ సరిగా లేకపోవడంతో దుర్వాసన, దోమలు, కుక్కల బెడద ఎక్కువైందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మూడు నాలుగు ట్రిప్పులు తిరుగాల్సిన రాంకీ వాహనాలు ఒకటి రెండు ట్రిప్పులకే సరిపెడుతున్నాయన్న ఆరోపణలు చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని నగర వాసులు డిమాండ్ చేస్తున్నారు.

మందకృష్ణ మాదిగను కలిసిన గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ నాయకులు

నవతెలంగాణ-మేడ్చల్



ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగను నగరంలోని ఆయన నివాసంలో శుక్రవారం గుండ్లపోచంపల్లి మున్సిపల్ నాయకులు కుండ భాను చందర్, మారేపల్లి సుధాకర్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 30 సంవత్సరాల నుండి మందకృష్ణ మాదిగ ఏ,బీ,సీ,డీ వర్గీకరణ కోసం అనేక పోరాటాలు చేశారన్నారు. కేంద్ర రాష్ట్ర, ప్రభుత్వాల పైన ఎప్పటికప్పుడు ఉద్యమిస్తూ పేద బడుగు బలహీన వర్గాలకు సంక్షేమ పథకాలు అందే విధంగా కృషి చేశారని తెలిపారు. ఆరోగ్యశ్రీ అమలు, వృద్ధులు, వితంతువులు, అనాధ పిల్లలకు పెన్షన్ కోసం అనేక పోరాటాలు చేశారని గుర్తు చేశారు. కలసిన వారిలో కొంపల్లి మహేష్ ఉన్నారు.

ప్రభుత్వ మార్కెట్ బిల్డింగ్‌లో ఇష్టానుసారంగా కూల్చివేతలు, నిర్మాణాలు



నవతెలంగాణ-కాప్రా

కుషాయిగూడ కూరగాయల మార్కెట్ బిల్డింగ్‌లో, ఇష్టానుసారంగా కూల్చివేతలు, నిర్మాణాలు, కూరగాయల మార్కెట్ బిల్డింగ్ మొదటి అంతస్తులో ఉన్న వాష్ రూమ్‌లను కూరగాయల వ్యాపారుల అసోసియేషన్ సభ్యులు అధికారులకు సమాచారం లేకుండా అక్రమంగా కూల్చివేశారు. తమకు ఇష్టానుసారంగా రూములు నిర్మిస్తున్నారు. మార్కెట్ అసోసియేషన్ కమిటీ సభ్యులు ఏకపక్షంగా, బలవంతంగా చందాలు వసూలు చేసి అసోసియేషన్ కార్యాలయం నిర్మిస్తున్నారని సమాచారం. మార్కెట్ సముదాయంలో పదుల సంఖ్యలో మడిగెలు ఖాళీగా ఉన్నాయి. అందులో ఏదైనా ఖాళీగా ఉన్న మడిగలో తమ కార్యాలయ వ్యవహారాలకు వాడుకోవచ్చు.. కానీ ప్రజలకు ఉపయోగపడే వాష్‌రూమ్‌లను తొలగించి కార్యాలయం నిర్మించాల్సిన అవసరముందని ప్రజలు, వినియోగదారులు, కూరగాయల వ్యాపారులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటకైనా సంబంధిత అధికారులు స్పందించి అక్రమంగా కూల్చివేతలు, నిర్మాణాలు చేపడుతున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అటల్ బిహారీ వాజ్ పేయికి ఘననివాళులు



నవతెలంగాణ-మేడ్చల్

మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్ పేయి వర్ధంతి సందర్భంగా శుక్రవారం మేడ్చల్ పట్టణంలోని అయన విగ్రహానికి బీజేపీ నాయకులు పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా అందరు మెచ్చిన బహుముఖ ప్రజ్ఞాశాలి అటల్ బిహారీ వాజ్ పేయిని కొనియాడారు. ప్రతి పక్ష పార్టీ నాయకులు సైతం ప్రశంసలు అందుకున్న వాజ్ పేయి జీవితం అందరికీ ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధ్యక్షుడు కొండం ఆంజనేయులు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు పాతూరి ప్రభాకర్ రెడ్డి, మున్సిపల్ ప్రధాన కార్యదర్శులు జాకట ప్రేమ్ దాస్, లవంగ శ్రీకాంత్, ఉపాధ్యక్షులుమైసరిరాజు,సర్వేశ్వర్ రెడ్డి,శ్రీశైలం,బీజే వై ఎం నాయకులు అర్జున్,రాఘవరెడ్డి, నాయకులు మహేష్,వంశీధర్ రెడ్డి,విశ్వజిత్, పురోత్తం,నర్సింగ్ రావు, వెంకటేష్, భూత్ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొని నివాళులర్పించారు.

చిరస్మరణీయుడు గౌతు లచ్చన్న



నవతెలంగాణ-మల్కాజ్గిరి

బీసీల అభ్యున్నతికి సర్దార్ గౌతు లచ్చన్న ఎనలేని కృషి చేశారని బీసీ కులాల ఐక్యవేదిక మల్కాజిగిరి నియోజకవర్గం అధ్యక్షుడు కామల్ల ఐలన్న అన్నారు. గౌతు లచ్చన్న జయంతి సందర్భంగా శుక్రవారం భరత్ నగర్ లోని బీసీ భవన్ లో బీసీ కులాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలన్న మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి అహర్నిశలు శ్రమించిన మహోన్నత వ్యక్తి గౌతు లచ్చన్న అని గాంధీ స్ఫూర్తితో స్వాతంత్ర్య పోరాటంలో లచ్చన్న పాల్గొన్నారని భారతదేశంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ తర్వాత సర్దార్ అనే గౌరవం పొందిన ఏకైక వ్యక్తి అని ఈ తరం రాజకీయ నాయకులంతా లచ్చన్నను స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు జీనుకుంట్ల రమేష్ , కార్యదర్శులు కాసర్ల నాగరాజు, పిట్టల భాస్కర్, జోగు శ్రీనివాస్, గోపాల్ గౌడ్, బి.లక్ష్మీనారాయణ, పేపర్ శ్రీనివాస్, శివ, వెంకటేశ్వర్లు, తదితరులు కలిసి నివాళులర్పించారు.

ఘనంగా శ్రావణ శుక్రవారం పూజలు



నవతెలంగాణ-చాంద్రాయణగుట్ట

పాతబస్తీలోని దేవాలయాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకుని ప్రతి ఇండ్లలో శ్రావణ శుక్రవారం పూజలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించుకున్నారు. ప్రతి ఒక్కరి ఇంట లక్ష్మీదేవి కరుణ కటాక్షం కలగాలని అమ్మవారిని ప్రార్థించారు. ఇండల్లోని ముత్తైదువులు భక్తిశ్రద్ధలతో నిర్వహించి అమ్మవారికి రకరకాల పిండి వంటలు మిఠాయి లు నైవేద్యం సమర్పించి ముత్తైదువులకు కుంకుమ బొట్టు, గంధం, పాదాలకు పసుపు రాసి వారి ఆశీర్వాదం తీసుకు న్నారు. ఈ శ్రావణ శుక్రవారం సందర్భంగా మార్కెట్‌లో పూలకు ధరకు రెక్కలు వచ్చాయి. సాధారణంగా చామంతి పువ్వులు రూ. 100లకు కేజీ ఉండేవి ఇప్పుడు రూ.300 కిలో అమ్ముతున్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కూకట్‌పల్లి - కుత్బుల్లాపూర్
శనివారం | ఆగస్టు 17, 2024 | www.navatelangana.com

నిందితుడిని బహిరంగంగా ఉరి తీయాలి



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న కోల్‌కతాలోని ఆర్‌జీ కార్ మెడికల్ కళాశాల ఆస్పత్రి ఆవరణలో 31 సంవత్సరాల జూనియర్ విద్యార్థినిపై పాశవికంగా జరిగిన అత్యాచార ఘటనకు నిరసనగా ఐఎంఏ పిలుపుమేరకు.. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని మల్లారెడ్డి ఆస్పత్రి నుంచి వైద్యులు, వైద్య విద్యార్థులు శుక్రవారం సూరారం చౌరస్తా వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. నిందితుడిని బహిరంగంగా ఉరి తీయాలని నినాదాలు చేశారు.

కేటీఆర్ అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నాం

- కేటీఆర్ బహిరంగ క్షమాపణ చెప్పాలి
- మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు
- గుండెమోనీ జయమ్మ మల్లేష్

నవతెలంగాణ-మంచాల

మహిళలపై అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని కేటీఆర్ బహిరంగ క్షమాపణ చెప్పాలని మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు గుండెమోనీ జయమ్మ మల్లేష్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆమె మాట్లాడుతూ కేటీఆర్ మహిళలకు ఫ్రీ బస్సు ఎందుకని, ఆర్‌టీసీ బస్సులో ప్రయాణం చేస్తూ మహిళలు కాలయాపన చేస్తున్నారని, మ హిళలను చిన్నచూపు చూస్తూ మాట్లాడిన మాటలను తీవ్రంగా ఖండిస్తున్నామని వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

కోదండ రామిరెడ్డికి .. శుభాకాంక్షలు తెలిపిన నాగిరెడ్డి



నవతెలంగాణ-కూకట్‌పల్లి

తెలంగాణ రాష్ట్ర గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేసిన, ప్రొఫెసర్ కోదండ రామిరెడ్డికి కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ పి.నాగిరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



నవతెలంగాణ-కూకట్‌పల్లి

కూకట్‌పల్లి నియోజకవర్గం, కూకట్‌పల్లి డివిజన్‌లోని దయార్ గూడకు చెందిన, సింగూరి నర్సింగరావు (కి.శే.) అనారోగ్యంతో కూకట్‌పల్లి లోని ఓమ్ని, రాందేవ్ రావు దవాఖానల్లో చికిత్స పొందుతుండగా మరణించారు. అనంతరం అయన కుమారుడు జీవన్, కూకట్‌పల్లి కాంగ్రెస్ నాయకుడు గొట్టిముక్కల వెంకటేశ్వర రావును సంప్రదించగా.. కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ ద్వారా, ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేయించగా రూ.60 వేలు మంజూరు అయ్యాయి. ఆ చెక్కును బండి రమేష్ చేతులమీదుగా సింగూరి జీవన్‌కు అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇన్‌చార్జి బండి రమేష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు మేకల రమేష్, మేకల సుదర్శన్ పాల్గొన్నారు.

శ్రావణ శుక్రవారం ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-కూకట్‌పల్లి

శ్రావణ శుక్రవారం సందర్భంగా.. ఆల్విన్ కాలని డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, ఆల్విన్ కాలనీ ఫేస్ 2 లోని శ్రీశ్రీశ్రీ భ్రమరాంభా మల్లికార్జున స్వామి దేవాలయ చైర్మెన్ భాస్కర్ రెడ్డి ఆహ్వానం మేరకు, ఆలయాన్ని కార్పొరేటర్ సందర్శించారు. ధనలక్ష్మీ అవతారంలో అలంకరించిన అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సమ్మారెడ్డి, భాస్కర్ రెడ్డి, శ్యామల, అఖిలేష్ శర్మ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

బాలానగర్ : కూకట్‌పల్లి మూసాపేట సర్కిల్ ఫత్తేనగర్ డివిజన్‌లోని జవహర్ కాలనీలో గల పైపులైన్ రోడ్డులోని శ్రీ కనకదుర్గాదేవి, శీతలాదేవి, కాళికాదేవి ఆలయంలో వరలక్ష్మీ అమ్మవారికి 2వ శుక్రకారం శుభ సందర్భంగా నిర్వాహకులు అమ్మ వారికి విశేష అలంకరణ జరిపించారు. అభిషేకం, కుంకుమ పూజ, పసుపు పొట్లు కార్యక్రమం ఆదితర పూజలు నిర్వహించి.. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మహిళా భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ప్రధానంగా ఈనెల 19న సోమవారం కనకదుర్గాదేని 28వ వార్షికోత్సవం నిర్వహిస్తునట్లు ఆలయ కమిటి వివరించారు. ఆలయ అర్చకులు దోర్బల కాశీనాథశర్మ పలు కార్యక్రమాలను నిర్వహించునట్టు తెలిపారు.



జేఎన్‌టీయూ హెచ్‌లో తీజ్ ఉత్సవ నిమజ్జన మహొత్సవం



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ విశ్వవిద్యాలయంలో తీజ్ ఉత్సవ నిమజ్జన మహొత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవంలో విశ్వవిద్యాలయ రెక్టర్ ప్రొఫెసర్ విజయ్ కుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వెంకటేశ్వరరావు, ప్రిన్సిపల్ జీఎన్ నరసింహారెడ్డిలు ముఖ్య అతిథులుగా హజరై భోగ్బండారో కార్యక్రమంతో ఈ ఉత్సవం ప్రారంభమైంది. బంజారా యువతులు తీజ్ గుట్టలను భక్తిశ్రద్ధలతో అమ్మవారికి సేవలాల్ మహరాజ్‌కి నైవేద్యం సమర్పించారు. బాలకృష్ణ, కోటియా నాయక్, రీసెర్చ్ స్కాలర్స్ గూగుల్ అవినాష్‌తో పాటు అనేక మంది విద్యార్థులు ఈ ఉత్సవంలో పాల్గొన్నారు. తీజ్ మొక్కల్ని పూజించి, యూనివర్సిటీ పెద్దల ఆశీర్వాదం తీసుకుని, యువతులు దైవాన్ని కొలిచిన ఘట్టం చాలా గొప్పగా జరిగింది. ఈ కార్యక్రమంలో ధరావత్ వినోద్ నాయక్, జేఎన్‌టీయూ హెచ్ బంజార విద్యార్థి సంఘం అధ్యక్షుడిగా ఉత్సవాన్ని నిర్వహించగా.. పూర్వ అధ్యక్షులు ధరావత్ నరేందర్ నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆకాశ నాయక్, సింహాద్రి భూక్యా విష్ణు నాయక్, లాకావత్ లైలా, బానోత్ అనూష, గౌతమి హర్షిని తదితరులు పాల్గొన్నారు.

మాకు న్యాయం చేయండి

- మంత్రికి జీవో 317 బాధిత ఉపాధ్యాయ బృందం విజ్ఞప్తి



నవతెలంగాణ-సిటీబ్యూరో

జీవో నెంబర్ 317కు చెందిన వివిధ జిల్లాలకు చెందిన పలువురు బాధిత ఉపాధ్యాయులు, మహిళా ఉపాధ్యాయురాల బృందం శుక్రవారం మినిస్టర్ క్వార్టర్స్‌లో 317 జీవో క్యాబినెట్ సబ్ కమిటీ చైర్మెన్ మంత్రి దామోదర్ రాజనర్సింహను కలిశారు. ఈ సందర్భంగా మహిళా ఉపాధ్యాయురాలు మంత్రికి రాఖీ కట్టి.. వారు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించి వినతిపత్రం అందజేశారు. 317 బాధితులమైన తమకు న్యాయం చేయాలని, తమ స్థానికతను బట్టి తమ జిల్లాలకు బదిలీ చేయాలని మంత్రిని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా బాధిత ఉద్యోగ మహిళా నాయకురాలు కవిత, అలివేలు, షమీం, శ్రీనివాసరెడ్డి, జ్ఞానేశ్వర్, శివరామకృష్ణ మాట్లాడుతూ మహిళా ఉద్యోగులను ఆందోళన చెందవద్దని.. అందరికీ అతి త్వరలో న్యాయం జరుగుతుందని మంత్రి భరోసా ఇచ్చారని తెలిపారు. సబ్ కమిటీ చైర్మెన్‌పై పూర్తి నమ్మకం ఉందని, తమకు ఈ ప్రభుత్వంలో న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నామని వారు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో పంతు, షమీం బేగం, యాస్మిన్ సుల్తానా, పర్వీన్ భాను, సైరా బాను, టాస్లీమ్ బేగం, అమ్రిన్ ఉనిసా, మునీరా బేగం పాల్గొన్నారు.

తీరనున్న ఓల్డ్ రామంతాపూర్ సీవరేజీ కష్టాలు!



- జలమండలి ఎండీ ప్రత్యేక దృష్టితో సీవర్ పునరుద్ధరణ పనులు

నవతెలంగాణ-సిటీబ్యూరో

నగరంలోని ఓల్డ్ రామాంతాపూర్‌లో ఉన్న సివర్ మెయిన్ పైపు లైన్ పునరుద్ధణ పనులు వెంటనే ప్రారంభించాలని ఎండీ అశోక్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన ఉన్నతాధికారులతో కలిసి సివర్ మెయిన్ పైపు లైన్‌ను పరిశీలించారు. ఓల్డ్ రామంతాపూర్ పరిసర ప్రాంతాల్లో ఉత్పన్నమయ్యే మురుగు నీటిని నల్లచెరువు ఎస్టీపీలోకి మళ్లించి శుద్ధి చేయడానికి నేషనల్ రివర్ కన్జర్వేషన్ డైరెక్టరేట్ నిధులతో గతంలో 6720 మీటర్ల పొడవుతో 1000 ఎంఎం డయా పైపు లైన్ నిర్మించారు. ఆ తర్వాత ఉప్పల్ మున్సిపాలిటి పరిధిలోని రామంతాపూర్, శ్రీనివాస నగర్, రామంతాపూర్ చెరువు ప్రాంతాలు కలిసేలా 600 ఎంఎం డయా, 450 ఎంఎం డయా పైపు లైన్ల నిర్మాణం చేపట్టారు. నగర శివారు సీవరేజీ బాధ్యతల్ని జీహెచ్‌ఎంసీ నుంచి జలమండలికి అప్పగించినప్పుడు 2021లో ఆ సీవర్ మెయిన్ నిర్వహణ బాధ్యతను బోర్డు చేపట్టింది. ఇదిలావుండగా నాగోల్ మెట్రో స్టేషన్ నుంచి అంబర్ పేట్ వరకు కొత్త రోడ్ వేసే క్రమంలో పైపు లైన్‌తో పాటు కొన్ని మ్యాన్ హెూల్స్ మరమ్మతులకు గురయ్యాయి. దాంతో ప్రజలకు సీవరేజీ కష్టాలు ప్రారంభమయ్యాయి. తాజాగా ఈ విషయం జలమండలి ఎండీ అశోక్ రెడ్డి దష్టికి రావడంతో శుక్రవారం ఓల్డ్ రామంతా పూర్‌ను సందర్శించారు. పైపు లైన్‌ను సందర్శించి పునరుద్ధరణ చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానికులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. డైరెక్టర్ ఆపరేషన్స్ -2 స్వామి, సీజీఎం సుజాత, జీఎం సంతోష్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా సయ్యద్ రషీద్ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కుత్బుల్లాపూర్ మున్సిపల్ మాజీ కోఆప్షన్ సభ్యులు, ఏ.ఎం.ఎస్.గ్రూప్ సంస్థల చైర్మెన్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, సయ్యద్ రషీద్ జన్మదిన వేడుకలు గురువారం సాయంత్రం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి సోమయ్యనగర్ లోని ఎం.కె.ఆర్. ఫంక్షన్ హాల్‌లో కుటుంబ సభ్యులు, అభిమానులు, కాంగ్రెస్ కార్యకర్తలు,నాయకుల మధ్య ఘనంగా జరిగింది. ఈ వేడుకలకు జగద్గిరిగుట్ట డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మెంలు కటకం, జయరాం, తంగ లక్ష్మారెడ్డితోపాటు బొట్టు సత్యనారాయణ(బట్టల్ సత్రి)దుర్గ చిన్న పైల్వాన్, డివిజన్ బీఆర్‌ఎస్ ఉపాధ్యక్షులు సయ్యద్ సాజిద్ లు ఆయన చేత కేక్ కట్ చేయించి శాలువా వేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సయ్యద్ రషీద్ మాట్లాడుతూ తన జన్మదిన వేడుకలు కుటుంబ సభ్యులు, అభిమానులు మధ్య జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. తన జీవితం సామాజిక,ప్రజాసేవకే అంకితం అని స్పష్టం చేశారు. అనంతరం కుటుంబ సభ్యులు, అభిమానులు భారీ గజమాలతో సయ్యద్ రషీద్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు కంటెస్టెంట్ కుత్బుల్లాపూర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సయ్యద్ రేహాన్, సయ్యద్ నవాజ్, షబ్బీర్, ముస్తకీం, ఫిరోజ్, హాజీ, రియాసత్, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వైద్యురాలి హత్యకు నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

డా.బీ.ఆర్.కే.ఆర్ ఆయుర్వేదిక్ కళాశాల వైద్య విద్యార్థులు కోల్కతాలో వైద్యురాలి పై జరిగిన దుశ్చర్యను నిరసిస్తూ ఎర్రగడ్డలోని కళాశాల ప్రాంగణంలో, కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అనంతరం తన ఆత్మకు శాంతి చేకూరాలని, తన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. స్వాతంత్రం వచ్చి 78 సంవత్సరాలు గడిచినా స్త్రీలపై అత్యాచారాలు మాత్రం ఆగడం లేదని విద్యార్థులు బాధను వ్యక్తం చేశారు. ఈ అత్యాచారానికి వ్యతిరేకిస్తూ పీజీ విద్యార్థులు తమ యొక్క సేవలను నెలిపివేయదలుచుకున్నారు. ఈ కార్యక్రమంలో పీజీ విద్యార్థులు, ఇంటర్న్స్, యూజీ విద్యార్థులు పాల్గొన్నారు.

కురులతోనే వ్యక్తులకు అందం



నవతెలంగాణ-సిటీబ్యూరో

కురులతోనే వ్యక్తుల అందం ఇనుమడిస్తుంది అని బాలీవుడ్ హెయిర్ స్టైలిస్ట్ హబీబ్ అహ్మద్ తెలిపారు. కేశ సంరక్షణపై దృష్టిని కేంద్రీకరించాలని యువతీ, యువకులకు సూచించారు. నగరంలో నల్లగండ్ల రోడ్డు ఫ్లైఓవర్ సమీపంలో కొత్తగా ఏర్పాటు చేసిన హబీబ్ హెయిర్ అండ్ బ్యూటీ సెలూన్‌ను హబీబ్ అహ్మద్, అమన్ అహ్మద్, శ్రితి లడ్డా, ప్రశాంత్ లడ్డా, విశాల్ వర్మ, గౌతం మంఘాని (తెలంగాణ, ఆంధ్ర మాస్టర్ ఫ్రాంచైజర్)తో కలిసి ప్రారంభించిన అనంతరం కేశ సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను హబీబ్ అహ్మద్ వివరించారు. పౌష్టికాహారం, సరైన నిద్ర, విశ్రాంత జీవనం, మానసిక ఆనందం, శారీరక వ్యాయామం, యోగా, ధ్యానం వంటివి కురులపై ప్రభావాన్ని చూపుతాయని పేర్కొన్నారు. తద్వారా నడి వయసులో కేశాలు పటిష్టంగా ఉంటాయన్నారు. బ్యూటీకి హైదరాబాద్ కేరాఫ్ అడ్రస్‌గా మారిందని హబీబ్స్ హెయిర్ అండ్ బ్యూటీ వ్యవస్థాపకులు అమన్ హబీబ్ అన్నారు. శిరోజాల సంరక్షణలో రాజీపడరని శ్రితి లడ్డా, ప్రశాంత్ లడ్డా తెలిపారు. బంజారాహిల్ హబీబ్స్ అకాడమీ అధిక ప్రాధాన్యత పొందిన సెంటర్‌లో ఒకటి అనీ, ఇక్కడ అన్ని ప్రాథమిక, అధునాతన శిక్షణను అందిస్తామనీ, టాప్ రేటెడ్ సెలూన్ సర్వీస్ ట్రైనింగ్ హెయిర్, అప్‌టు డేట్ సర్వీస్ తమ ప్రత్యేకత అని శ్రితి అన్నారు.

హాప్ ఆన్ కంగారూ బ్రాండ్ అంబాసిడర్‌గా అదితి



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రముఖ స్పోర్ట్స్, లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ ఇనిషియేటివ్ 'హాప్ ఆన్ కంగారూ' బ్రాండ్ అంబాసిడర్‌గా మాజీ ప్రధాని పి.వి.నరసింహారావు ముని మనవరాలు అదితి సిరి గాయత్రీ మారంరాజుని నియమించారు. శుక్రవారం మాదాపూర్ జూబ్లీ రిడ్జ్ హెూటల్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ ప్రకటన చేశారు. 'అదితి విశిష్టమైన వంశం, వారసత్వం.. సమాజంపై సానుకూల ప్రభావం చూపేందుకు ఆమె స్వీయ అంకితభావం.. మా లక్ష్యంతో సంపూర్ణంగా సరిదిద్దపడుతుంది. మా విభిన్న కార్యక్రమాలతో యువతీ, యువకులను ఉత్సాహపర్చడానికి అదితితో కలిసి పని చేయడానికి ఎదురు చూస్తున్నాం' అనిహాప్ ఆన్ కంగారూ వ్యవస్థాపకులు, మేనేజింగ్ డైరెక్టర్ హరీష్ బిసామ్ తెలిపారు. 'భారతదేశంలో హాప్ ఆన్ కంగారూకి అధికారిక బ్రాండ్ అంబాసిడర్‌గా నియమితులైనందుకు గౌరవంగా భావిస్తున్నాను. ఈ అవకాశం నాకు నా ముత్తాత అందించిన నాయకత్వం, సేవ వారసత్వాన్ని పెంపొందించడానికి వీలు కల్పిస్తుంది. క్రీడలు, వ్యక్తిగత అభివద్ధి ద్వారా మన దేశంలోని యువతకు సాధికారత కల్పించేందుకు హాప్ ఆన్ కంగారూతో కలిసి పని చేయడానికి నేను సంతోషిస్తున్నాను' అని అదితి సిరి గాయత్రి మారంరాజు అన్నారు.

బ్రైట్ కాన్సెప్ట్ పాఠశాలకు అరుదైన పురస్కారం



- కరస్పాండెంట్ వినోద్ జాదవ్‌కు ఐ.ఎస్.ఒ. ధ్రువపత్రం అందజేత

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

78 వ స్వాతంత్ర దినోత్సవం పురస్కరించుకొని ప్రముఖ హెచ్.వై.ఎం.(హిమ్)ఇంటర్నేషనల్ సంస్థ అందజేస్తున్న ప్రతిభ పురస్కారాలకు గాను కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని బ్రైట్ కాన్సెప్ట్ స్కూల్ ఎంపికైంది. ఈ మేరకు రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి, రంగారెడ్డినగర్ ప్రాంతంలో గల పాఠశాలలో క్యాంపస్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన పంద్రాగస్టు వేడుకలకు కుత్బుల్లాపూర్ సర్కిల్ ఉప కమిషనర్ వి.నరసింహులు,హెచ్.వై.ఎం.సంస్థ ప్రతినిధి ఆలపాటి శివయ్యలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విద్యారంగంలో గత రెండున్నర దశాబ్దాలుగా విశిష్ట సేవలందిస్తున్నం దుకుగాను (ఐ.ఎస్.ఒ9001-2015)"ఉత్తమ విద్య సేవారత్న" ప్రశంసాపత్రాన్ని వారి చేతులు మీదుగా వినోద్ జాదవ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఉప కమిషనర్ వి.నరసింహులు మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభ కనుగుణంగా తల్లిదండ్రులు వారు ఎంచుకున్న రంగాలలో ప్రోత్సహించాలని సూచించారు. విద్య, శాస్త్ర,సాంకేతిక క్రీడారంగాల్లో రాణించి..మన ప్రాంతం, రాష్ట్ర, దేశస్థాయిని ఇనుమడింపజేయాలని విద్యార్థులను ఆకాంక్షించారు. హెచ్.వై.ఎం. ఇంటర్నేషనల్ సంస్థ ప్రతినిధి ఆలపాటి శివయ్య మాట్లాడుతూ విద్యార్థుల మనోభావాలకు అనుగుణంగా వారిలో దాగివున్న సృజనాత్మకతను వెలికి తీసి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతున్న పాఠశాల కరస్పాండెంట్ వినోద్ జాదవ్ ప్రత్యేకంగా అభినందించా రు. కరస్పాండెంట్ వినోద్ జాదవ్ మాట్లాడుతూ తమ పాఠశాలలో విద్య, సంస్కారం, విలువలతో కూడిన జీవనశైలిని విద్యార్థులకు నేర్పిస్తు ఉత్తములుగా తీర్చిదిద్దుతున్నామన్నారు. తమ పాఠశాలకు తనకు ఇంతటి అరుదైన పురస్కారం లభించడం ఎంతో సంతోషంగా ఉందని విద్యార్థుల, ఉపాధ్యాయుల కృషి వల్లే ఇది సాధ్యమైందని ఆయన స్పష్టం చేశారు. పాఠశాల డైరెక్టర్ కృష్ణంరాజు, ఎంటమాలజిస్ట్ ఉమారాణి, సహా యకులు రజాక్, సంపత్, పాఠశాల ఇన్‌చార్జి ఆయేషా బేగం, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



సత్యం శ్రీరంగం దంపతులకు వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు



నవతెలంగాణ-బాలానగర్

కూకట్‌పల్లిలోని టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం, ఇందుమతి 26వ వివాహ వార్షికోత్సవ వేడుకలు వారి నివాసంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారిని కాంగ్రెస్ నాయకులు శాలువాతో సత్కరించి, కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మహిళా అధ్యక్షురాలు రాజానోళ్ల లక్ష్మి, బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, బాలాజీనగర్ డివిజన్ అధ్యక్షులు కృష్ణ రాజ్ పుత్, గోవింద్ గౌడ్, నజీర్ భాయ్, యూత్ కాంగ్రెస్ నాయకులు హరీష్, కలికోట శంకర్, పెద్ద ఎత్తున మహిళలు, నాయకులు పాల్గొన్నారు.

గ్రేటర్ హైదరాబాద్ యాదవ సంఘం జాంబాగ్ నూతన అధ్యక్షుడిగా బోయిని వెంకటేశ్ యాదవ్



నవతెలంగాణ-ధూల్‌పేట్

గ్రేటర్ హైదరాబాద్ యాదవ సంఘం (జాంబాగ్) నూతన అధ్యక్షుడిగా బోయిని వెంకటేశ్ యాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం జాంబాగ్‌లోని సంఘం భవనంలో యాదవ సంఘం గ్రేటర్ హైదరాబాద్ చైర్మెన్, ట్రస్టు సభ్యులు చిట్టబోయిన నంద కిశోర్ యాదవ్ చేతుల మీదుగా బోయిని వెంకటేశ్ యాదవ్‌కు నియమాక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గ్రేటర్ హైదరాబాద్‌లో ఉన్న యాదవులందరిని ఏకతాటిపైకి తీసుకొచ్చి సంఘం అభివృద్ధి కోసం నిరంతరం పాటుపడుతానన్నారు. తనపై నమ్మకంతో ఈ పదవీ అప్పగించిన నంద కిశోర్ యాదవ్, రాష్ట్ర ట్రస్టు బోర్డు సభ్యులు ఉస్కెల కిషన్ యాదవ్, డి.గోపాల్ యాదవ్, అందెల శైలేందర్ యాదవ్, మేకల రాజేందర్, ఎ.మనీష్ యాదవ్, రామారావు యాదవ్, పి.కిషన్ యాదవ్, కుల పెద్దలకు అభినందనలు ఆయన తెలిపారు.

పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతంగా పూర్తి చేయాలి



నవతెలంగాణ-ధూల్‌పేట్

చుడీబజార్‌లోని రాంమనోహర్ లోహియా అంబేద్కర్ కమ్యూనిహాల్ నిర్మాణము పెండింగ్ పనులు పూర్తి చేయాలని బందు మిత్ర సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి అల్వాల్ శివ కుమార్, ఆర్ సుమన్ కుమార్‌లు అన్నారు. బందు మిత్ర సంఘం ఆధ్వర్యంలో కలిసి ప్రజావాణిలో ప్రణాళిక సంఘం వైస్ చైర్మెన్ చెన్న రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ కమ్యూనిహాల్ నిర్మాణం 80 శాతం వరకు పనులు పూర్తి చేసి వదిలేశారన్నారు. మిగిలిన పనులు చేయకుండా బిల్లు రాలేదంటూ కమ్యూనిహాల్‌కు తాళం వేశారని తెలిపారు. పలు సార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లామని గుర్తు చేశారు. వెంటనే పెండింగులో వున్న పనులను వేగవంతంగా పూర్తి చేసి స్థానికుల కమిటీ అందుబాటులోకి తేవాలని సంబంధిత జి. హెచ్.ఎం.సి. అధికారులకు ఆదేశించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బందు మిత్ర సంఘం నాయకులు నాగరాజు, అనిల్ కుమార్, వేణు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ కల్పించాలి

జూనియర్ డాక్టర్‌పై లైంగికదాడికి పాల్పడిన నిందితులను ఉరి తీయాలి

- భారీ ఎత్తున తరలివచ్చిన ప్రయివేట్, ప్రభుత్వ జూనియర్ డాక్టర్ లు..
- ఉవ్వెత్తున మారు మోగిన నిరసన నినాదాలు..
- దద్దరిల్లిన ఉస్మానియా ఆస్పత్రి
- విధులు బహిష్కరించి నిరసన ర్యాలీ..



నవతెలంగాణ-ధూల్‌పేట్

కోల్‌కత్తా పశ్చిమ బెంగాల్‌లో విధి నిర్వహణలో ఉన్న జూనియర్ మహిళ డాక్టర్ పై పైశాచికంగా వ్యవహరించి లైంగికదాడికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించి ఉరి తీయాలని రాష్ట్ర జుడా(జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్) అధ్యక్షులు డాక్టర్ రాహుల్ అన్నారు. రాష్ట్ర జుడా ఆధ్వర్యంలో లైంగికదాడికి నిరసనగా ఉస్మానియా ఆస్పత్రి పాత భవనం నుండి ఓపీ ఎమర్జెన్సీ భవనం వరకు విధులను బహిష్కరించి నిరసన ర్యాలీ భారీ ఎత్తున నిర్వహించారు. నగరంలో వివిధ ప్రయివేట్, ప్రభుత్వ జూనియర్‌లు వేలాదిగా తరలివచ్చారు. దీంతో ఉస్మానియా ఆస్పత్రిలో జూనియర్ వైద్యులతో దద్దరిల్లింది. నిందుతులను శిక్షించాలి, మహిళలకు రక్షణ కల్పించాలని నిరసన ర్యాలీ, నినాదాలతో మారు మ్రోగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వస్తే అర్ధరాత్రి మహిళ వలవచ్చని మహాత్ముడు చెప్పిన నేటికీ మహిళలకు రక్షణ లేదన్నారు. స్వాతంత్రం దినం రోజు దుండగులు వచ్చి దాడులకు పాల్పడటం దారుణమన్నారు. ఉస్మానియా యునిట్ స్టేట్ జుడా ప్రధాన కార్యదర్శి డాక్టర్ చంద్రిక మాట్లాడుతూ.. ఇది డాక్టర్‌లకు కాదు మహిళలకు జరిగిన అన్యాయమని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీన్ని ప్రజలు గమనించాలన్నారు. వైద్యం నిర్వహించే మహిళ వైద్యులకు రక్షణ లేకుండా పోయిందని, ఎలా విధులు నిర్వహించాలన్నారు. ఇలాగే వదిలేస్తే ఈ రోజు కల్ కత్తా లో రేపు మన రాష్ట్రంలో అవుతుందన్నారు. మరో నిర్భయ కంటే దారుణం అని నిందితులను ఉరితీయాలన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. ఘటన జరిగి 48 గంటలు కావొస్తున్నా ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం పై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే, నిందితులను శిక్షించకపోతే రాష్ట్ర, మొత్తంలో విధులు, ఎమర్జెన్సీ విధులను బహిస్కరించి ఆందోళన



చేపడతామని హెచ్చరించారు. నేడు ధర్నా చౌక్ లో నిరసన ధర్నా చేపడామని తెలిపారు. ఈ నిరసనలో మహిళా ప్రొఫసర్ లు సంఘీభావం తెలిపారు.

మూసీ పక్కనున్న బస్తీ వాసులకు న్యాయం చేయాలి

- సీపీఐ(ఎం) గోషామహల్ జోన్ నాయకులు పి.నాగేశ్వర్..



నవతెలంగాణ-ధూల్‌పేట్

మూసీ పక్కనున్న బస్తీవాసులకు న్యాయం చేయాలని సీపీఐ(ఎం) గోషామహల్ జోన్ నాయకులు పి.నాగేశ్వర్ అన్నారు. సీపీఐ(ఎం) సౌత్ కమిటీ ఆధ్వర్యంలో మూసీ పరిసర ప్రాంతాల బస్తీ వాసుల సమస్యల గురించి జీహెచ్ఎంసీ హెడ్ ఆఫీస్ వద్ద నిర్వహించనున్న ధర్నా కరపత్రాన్ని చుడి బజార్ శంకర్ బజార్‌లో బస్తీ కమిటీ నాయకుల సమక్షంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపట్టిన మూసీ సుందరీకరణ ప్రాజెక్టుతో ఎంతో మంది నిరుపేదల కుటుంబాలు రోడ్డున పడతాయన్నారు. మూసీ ఇరుపక్కలా బస్తీల ప్రజలు పైసా పైసా కూడబెట్టుకొని నివాసాలు ఏర్పరచుకున్నారన్నారని వారికి న్యాయం చేయాలన్నారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం ముందు చేపట్టే ధర్నాలో స్థానిక బస్తీవాసులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బస్తీ అధ్యక్ష, కార్యదర్శులు రాం ప్రసాద్, బీ.సురేష్, కార్యవర్గ సభ్యులు స్థానిక మహిళలు శోభ, దేవమ్మ, సీపీఐ(ఎం) నాయకులు ఎం.డి. అయ్యూబ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

నవభారత నిర్మాణం కోసం బాల బాలికలు పనిచేయాలి

నవతెలంగాణ-ముషీరాబాద్

నవభారత నిర్మాణం కోసం బాల బాలికలు పని చేయాలని ప్రభుత్వ సలహాదారులు అయోధ్య రామిరెడ్డి అన్నారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా తెలంగాణ బాలోత్సవం బాల బాలికల మధ్య ఆనందోత్సవాల నడుమ బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ బాలోత్సవం చానల్‌ను ప్రారంభించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రభుత్వ సలహాదారు అయోధ్య రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ మాతృభూమి స్వేచ్ఛ కోసం ప్రజల బాగు కోసం తమ జీవితాలను ధారబోసిన త్యాగదనులకు నివాళులర్పిస్తూ స్వాతంత్ర్య భారత ప్రస్తానాన్ని ఒకసారి సింహలోకనం చేసుకోవాల్సిందని తెలిపారు. ఆనాడు తెల్ల దొరలను తరిమికొట్టడంతో పాటు ఆకలి, విద్య అనారోగ్యం ఆర్థిక అసమానతలు కుల, మత, లింగ వివక్షలకు తావులేని నవభారతాన్ని కలలుకన్నారు. పౌరులందరికీ సామాజిక న్యాయం, ఆర్థిక న్యాయం, రాజకీయ న్యాయం వస్తుందని భావించారని తెలిపారు. భావ ప్రకటన స్వేచ్ఛ, సమానత్వ అవకాశాలు వ్యక్తి గౌరవాలు జాతీయ సమైక్యత పెరుగుతుందని ఆశించారు కానీ ఆదర్శాలన్ని కాగితాలకే పరిమితమైన దురదృష్టకర వాతావరణంలో ఉందన్నారు. సెంట్రల్ సిలబస్ పేరుతో చరిత్రను చేరిపేస్తూ మనువాద సంస్కృతి, జ్యోతిష్య శాస్త్రం పాఠ్యపుస్తకాల్లోకి వస్తున్నాయన్నారు. విజ్ఞాన కావాలంటే విజ్ఞాన కేంద్రానికి రావాలని విజ్ఞానం మాత్రమే శాశ్వతం అని అన్నారు. నవ భారత నిర్మాణం కోసం విద్యార్థులంతా పనిచేయాలని అందుకు తెలంగాణ చానల్ ఉపకరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రం కార్యదర్శి ఎస్. వినయ్ కుమార్, తెలంగాణ బాలోత్సవం అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు, ఎస్ సోమయ్య కార్యదర్శి, కోశాధికారి జి. బుచ్చిరెడ్డి, ఉపాధ్యక్షురాలు కే సుజావతి కె.మమత, సమన్వయం చేశారు.

పాలస్తీనాపై దాడులు ఆపాలి

- ఆవాజ్ నిరసనలో ఆవాజ్ నగర కార్యదర్శి అబ్దుల్ సత్తార్



నవతెలంగాణ-ధూల్‌పేట్

పాలస్తీనాపై దాడులు ఆపాలని ఆవాజ్ నగర కార్యదర్శి అబ్దుల్ సత్తార్ అన్నారు. గురువారం సంతోష్ నగర్ చౌరస్తాలో ఆవాజ్ హైదరాబాద్ సౌత్ కమిటీ ఆధ్వర్యంలో పాలస్తీనాపై జరుగుతున్న దాడులను తక్షణమే ఇజ్రాయిల్ విరమించుకోవాలని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఆరు నెలల నుంచి నిరంకుశంగా, రక్తపిశాచిల, మానవత్వాన్ని మంట కలుపుతున్న ఇజ్రాయిల్ దాడులు తక్షణమే ఆపడానికి ఐక్యరాజ్యసమితి కఠినంగా వ్యవహరించాలని కోరారు. అరబ్ దేశాలు, ప్రపంచం పాలస్తీనాపై మానవత్వంతో ఆలోచించి తక్షణమే ఈ దాడులను ఆపిశాంతియుత వాతావరణాన్ని కల్పించాలన్నారు. భారత ప్రభుత్వం మానవత్వం మరచిన ఇజ్రాయిల్ యుద్ధాన్ని నిలుపుదల చేయడానికి ముందు భాగములో ఉండాలని విజ్ఞప్తి చేశారు. అత్యంత ఘోరంగా జరుగుతున్న ఈ దాడులను ప్రపంచం టీవీ సీరియల్ లాగా చూస్తూ ఉండిపోవడం దురదృష్టకరమన్నారు. వెంటనే శాంతి వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు యూసుఫుదిన్, మహబూబ్ అలీ, యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

అంబర్‌పేటలో కేటీఆర్ దిష్టిబొమ్మల దగ్ధం..



నవతెలంగాణ-అంబర్‌పేట

మహిళల ఉచిత బస్ ప్రయాణం పై కేటీఆర్ అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా అంబర్‌పేట శ్రీరమణ చౌరస్తాలో ఖైరతాబాద్ మహిళా అధ్యక్షురాలు షంబుల ఉషశ్రీ శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో కేటీఆర్ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మహిళలకు ఉచిత బస్ ప్రయాణం పట్ల అనుచితంగా మాట్లాడారు. మహిళలను కించ పరుస్తూ బస్‌లలో బ్రేక్ డాన్సులు, రికార్డింగ్ డాన్స్‌లు చేయండి అంటూ అత్యంత అవహేళనగా మాట్లాడడం తెలంగాణ మహిళల పట్ల ఇంత అవమాన కరంగా మాట్లాడి వారి ఆత్మ గౌరవాన్ని దెబ్బతీసిన కేటీఆర్ వైఖరిని నిరసిస్తూ అన్ని మండల, నియోజక వర్గ, జిల్లా కేంద్రాలలో దిష్టి బొమ్మల దగ్ధం, నిరసన కార్యక్రమాలు చేశామని తెలిపారు. ఈ నిరసన కార్యక్రమాలలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కేటీఆర్ పై చర్యలు తీసుకోవాలని ఆయన మహిళ లోకానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శాంతమ్మ, కవిత తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికుల బ్యాగుల చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్ట్

- 15 తులాల బంగారం, 20 తులాల వెండి స్వాధీనం..



నవతెలంగాణ-ధూల్‌పేట్

ఆగిన బస్సులో ప్రయాణికుల బాగులలో చోరీలకు పాల్పడుతున్న నిందితుడునీ అఫ్జల్ గంజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. వాని వద్ద నుండి 15 తులాల బంగారం, 20 తులాల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా అఫ్జల్ గంజ్ పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈస్ట్ జోన్ డీసీపీ పి.బాల స్వామి, అదనపు డీసీపీ జె.నర్సయ్య, సుల్తాన్ బజార్ ఏసీపీ కె.శంకర్, అఫ్జల్ గంజ్ ఇన్‌స్పెక్టర్ జి.లింగేశ్వర్ రావు, డిటెక్టివ్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ ఎం.మధు కుమార్‌లతో కలిసి నిందితుని వివరాలు వెల్లడించారు. మేడ్చల్ జిల్లా అల్వాల్ ప్రాంతానికి చెందిన కంది సంపత్ రెడ్డి(48) రియల్ ఎస్టేట్ చేసంటాడు. గోదావరి ఖని ప్రాంతానికి చెందిన కె.సరిత నగరంలోని సరూర్ నగర్ తమ్ముడు కె.శ్రీకాంత్ ఇంటికి వచ్చి ఈ నెల 5న తిరుగు ప్రయాణం అయ్యింది. సూపర్ లక్సరి బస్ బుక్ చేసి ఎంజీబీఎస్ బస్ స్టేషన్‌లో ఆగిన బస్సులో సీటుపై బాగ్ పెట్టి తమ్ముడితో కాసేపు మాట్లాడింది. అంతలోపు నిందితుడు ప్రయాణికుడు లా వెళ్లి బాగ్ లోని ఆభరణాలు చోరీ చేశాడు. బస్ స్టార్ట్ కాగానే సరిత బస్సులో కూర్చుని గోదావరి ఖని లో ఇంటికి వెళ్లి బాగ్ చెక్ చేయగా ఆభరణాలు కనబడ లేదు. దీంతో వెంటనే తమ్ముడు శ్రీకాంత్‌కు ఫోన్ చేసి సమాచారం ఇయ్యగా అతడు అఫ్జల్ గంజ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేశారు. బస్ స్టాండ్ సీసీ కెమెరాలు చెక్ చేస్తూ బస్ లో సీసీ కెమెరాలు చెక్ చేయగా నిందితుడు చోరీ చేస్తున్న చిత్రాలు బయట పడ్డాయి. వాటి ఆధారంగా నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించారు. ఇలా ఇంతకు ముందు రెండు సార్లు ఇలాగే చోరికి పాల్పడ్డాడు. దీన్ని పై కేసు నమోదు చేసి నిందితుని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు. చాకచక్యంగా వ్యవహరించి నిందితుని, ఆభరణాలను స్వాధీనం చేసుకున్న క్రైమ్ టీమ్‌ను అభినందించి రివార్డను అందజేశారు.

ఇండియన్ పోలీస్ మెడల్ గ్రహీత సాహితి శ్రీనివాస్‌కు ఘన సన్మానం



నవతెలంగాణ-చాంద్రాయణ గుట్ట

స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా గోల్కొండలో జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఇండియన్ పోలీస్ మెడల్ అందుకున్న డీఎస్‌పీ సాయితి శ్రీనివాస్‌కు సుల్తాన్ సాయి శ్రీ జగదంబా దేవాలయం చైర్మెన్ రాకేష్ తివారి ఘనంగా సన్మానం నిర్వహించారు. 1995 బ్యాచ్‌కు చెందిన సాహితీ శ్రీనివాస్ మొగల్‌పురా ఎస్సైగా, టాస్క్ ఫోర్స్ విభాగంలో ఎసీపీగా, ఆక్టోపస్, టాస్క్ ఫోర్స్, సీఐడీ ట్రాఫిక్ తదితర విభాగాలలో దీక్ష కంకణ భక్తుడై ఎనలేని సేవలు అందించిన సాహితీ శ్రీనివాస్‌కు ప్రభుత్వం ఇండియన్ పోలీస్ మెడల్ అందజేయడం సంతోషకరమన్నారు. సుల్తాన్ సాయి జగదాంబ దేవాలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం ఎస్పి సాహితీ శ్రీనివాస్‌కు గజమాల శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మెన్ రాకేష్, శశాంక్ తివారి, రాజేష్ తివారి, వేణుగోపాల్, నంసింహ ముదిరాజ్, కిట్టు ముదిరాజ్, అనంతోజు హంసరాజ్, బాబురావు దేవాలయ కమిటీ తదితరులు పాల్గొన్నారు.

రెండు షిఫ్టులలో చెత్త సేకరించాలి

- నగరంలో పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆకస్మిక తనిఖీలు





నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్‌లోని పలు ప్రాంతాలను పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిశోర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మొదటగా జర్నలిస్టు కాలనీలోని పాలపిట్ట సర్కిల్ పరిసర ప్రాంతాల్లో వెళ్లిని ఆయన రహదారుల పైవున్న ప్యాచ్ వర్క్స్ చేయకుండా వదిలేసిన గుంతలను పరిశీలించి స్థానిక అధికా రులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వాటర్ లాగింగ్ పాయింట్‌ను గుర్తించి సంపు నిర్మించడానికి అనువైన ప్రాంతాన్ని చూడాలని జోనల్ కమిషనర్ ను ఆదేశించారు. వర్షం కాలం లో అంటు వ్యాధులు ప్రబలించే అవకాశం ఉన్నందని, జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్న గార్బేజీ వనరబుల్ పాయింట్లపై (తరచూ చెత్త వేసే ప్రాంతాలు) ప్రత్యేకంగా దష్టి సారించాలని సూచించారు. జూబ్లీహిల్స్ రోడ్ నం.45, రోడ్ నం.70, గౌతంనగర్ బస్తీ, దీన్ దయాళ్ నగర్ బస్తీ, ఫిల్మ్ నగర్, పీఈటీ పార్క్ ప్రాంతాల్లో తరచూ చెత్త వేసే ప్రాంతాలు పరిశీలించారు. అక్కడ పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులతో మాట్లాడారు. వారి సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. పని తీరుపై వివరాలు ఆరా తీశారు. పారిశుధ్య కార్మికుల హాజరు తదితర వివరాలను పారదర్శకంగా నమోదు చేయాలని సూచించారు. పని వేళల్లో కార్మికులు తప్పనిసరిగా యూనిఫాం, హ్యాండ్ గ్లౌజ్ ధరించాలని రక్షణ చర్యలు పాటించాలన్నారు. నగరంలో చెత్త ఎక్కువగా ఉత్పన్నమయ్యే ప్రాంతాలపై ప్రధానంగా దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. అలాంటి ప్రాంతాల్లో రెండు షిఫ్టులో చెత్త సేకరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించా రు. పలు వాటర్ లాగింగ్ ప్రాంతాల్లో ప్రభుత్వం నిర్మిస్తున్న నీటి నిల్వ సంపుల పనుల్ని పరిశీలించారు. ఈ కార్యక్ర మంలో జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, ఈఈ విజయ్ కుమార్, జలమండలి జీఎం హరిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

సర్వాయి పాపన్న పోరాట స్ఫూర్తితో బహుజనలంతా ఏకం కావాలి

- సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలో పలువురు వక్తలు



నవతెలంగాణ-ముషీరాబాద్

సర్దార్ సర్వాయి పాపన్న పోరాట స్ఫూర్తితో బహుజన రాజ్యాధికారం కోసం బహుజనలంతా ఏకం కావాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. జనాభాలో సగభాగం పైగా ఉన్న బహుజనులు రాజ్యాధికారంలోకి వచ్చినప్పుడే సర్దార్ సర్వాయి పాపన్నకు నిజమైన నివాళులర్పించినట్లువుతుందని వారన్నారు. తెలంగాణ గౌడ కల్లు గీత సంఘాల సమన్వయకమిటీ చైర్మెన్ బాలగౌని బాలరాజ్ గౌడ్ అధ్యక్షతన శుక్రవారం చిక్కడపల్లిలో సర్దార్ సర్వాయి పాపన్న 374వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్, మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్, మాజీ ఎంపీ వి. హనుమతరావు, మాజీ ఎమ్మెల్సీ స్వామిగౌడ్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీసీ కార్పొరేషన్ చైర్మెన్ నూతి శ్రీకాంత్ గౌడ్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యకుడు జాజుల శ్రీనివాస్ గౌడ్, మాజీ ఐఏఎస్ అధికారి చిరంజీవులు, బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మెన్ కుందారం గణేష్ చారి హజరై సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. పాపన్న ఆశయాల సాధన కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. గౌడ కులస్తులకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను దశల వారిగా చేపడుతుందన్నారు. మల్కాజ్‌గిరి ఎంపీ ఈటెల రాజేందర్ మాట్లాడుతూ.. బీసీలు ఏకమై రాజ్యాధికారాన్ని కైవసం చేసుకునే దిశగా ఎదగాలన్నారు. మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో పాపన్న జయంతి వేడుకలు అధికారికంగా నిర్వహించిందని, పాఠ్యా పుస్తకాలలో జీవిత చరిత్రను రూపొందించిందన్నారు. మాజీ ఎమ్మెల్సీ స్వామి గౌడ్ మాట్లాడుతూ. పాపన్న స్ఫూర్తితో గౌడ కులస్తులందరూ రాజ్యాధికారం కోసం పోరాటం చేయాలని సూచించారు. మాజీ ఎంపీ వి.హనుమంతరావు మాట్లాడుతూ.. పాపన్న చేసిన పోరాటం బీసీలలో స్ఫూర్తి నింపిందన్నారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్ మాట్లాడుతూ.. బహుజన రాజ్యాధికారం కోసం బీసీలందరూ ఏకం కావాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యకుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. బీసీలందరూ పాపన్న పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకుని ఎన్నికల సమయంలో రాజకీయాలకతీతంగా బీసీలందరూ తమ ఓటును బీసీలకు వేసి గెలిపించాలని తద్వారానే బీసీలకు రాజ్యాధికారం సిద్ధించి పాపన్న కలలు నెరవేరుతాయని అన్నారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన తెలంగాణ గౌడ కల్లు గీత సంఘాల సమన్వయకమిటీ చైర్మన్ బాలరాజు గౌడ్ మాట్లాడుతూ.. పాపన్న పోరాట స్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు గౌడ కల్లు గీత కార్మిక సంఘాల సమాఖ్య తరపున గత పది సంవత్సరాలుగా పాపన్న జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్న గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎలికట్టే విజయ్కుమార్ గౌడ్, వైస్ చైర్మన్ గడ్డమీది విజయ్ కుమార్ గౌడ్, నాయకులు వెంకటేష్, జైహింద్ గౌడ్ ఎం. వి. రమణ, చక్రవర్తిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా డ్రగ్స్ సరఫరా చేస్తున్న ఇద్దరు అరెస్ట్

నవతెలంగాణ-సుల్తాన్ బజార్

అక్రమంగా డ్రగ్స్‌ను సరఫరా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను ఎస్ఎఫ్టి పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు. శుక్రవారం నాంపల్లి అబ్కారీ భవన్‌లో ఎక్సైజ్ జాయింట్ కమిషనర్ ఖురేషి వివరాలను వెల్లడించారు. కర్ణాటకకు చెందిన పీవీ రాహుల్, మహేష్ అనే ఇద్దరు వ్యక్తులు బెంగుళూరు నుంచి హైదరబాద్‌లోని కూకట్‌పల్లి ప్రాంతానికి చెందిన వ్యక్తులకు డ్రగ్స్‌ను సరఫరా చేసేందుకు తీసుకువెళ్తుండగా ఎస్టీఎఫ్ డీఎస్పీ తుల శ్రీనివాసరావు పర్యవేక్షణలో 29.6 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. నితిన్‌రెడ్డి, నైజీరియాకు చెందిన జాక్సన్ అనే వ్యక్తుల ప్రమేయం ఉందని వారిని కూడ పట్టుకోవడానికి ప్రత్యేక నిఘా బృందాలను ఏర్పాటు చేశామన్నారు. వీటి విలువ రూ. 4.50 లక్షల ఉంటుందన్నారు. మరో కేసులో ఎక్సైజ్ ఎన్ ఫోర్స్‌మెంట్ ఎస్టీఎఫ్ ప్రదీప్‌రావు పర్యవేక్షణలో ఎస్సై బలరాం ఇతర సిబ్బందితో కలిసి కోల్లాపూర్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో కర్ణాటక నుంచి బోలెరో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న బెల్లం, అల్లంను పెద్దకొత్తపల్లి ఎంపీడీఓ కార్యాలయం ముందు పట్టుకున్నారు. రూ.1.20 లక్షలు, రూ.15 లక్షలు విలువ చేసే వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పోలిసులు తెలిపారు. ప్రభుత్వ అదేశాల మేరకు నాటుసారా, గంజాయి, డ్రగ్స్‌ను పూర్తిగా అరికట్టడానికి ఎక్సైజ్ శాఖ నిత్యం పోరాటం చేస్తుందన్నారు. ఆగస్టు 31 నాటికి తెలంగాణలో అన్ని జిల్లాలో నాటు సారాను లేకుండా చేయడంతో పాటు హైదారబాద్‌లోని ధూల్‌పేట్‌లో అపరేషన్ దూల్‌పేట్ పేరుతో గంజాయి అమ్మకాలపై ఉక్కు పాదం మోపుతున్నామన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ భాస్కర్, డీఎస్పీలు తుల శ్రీనివాసరావు, తిరుపతి యాద్, ఎక్సైజ్ సూపరిండెంట్ ఎస్టీఎఫ్ ప్రదీప్ రావు, సీఐ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- కార్పొరేటర్ పావని వినయ్ కుమార్



నవతెలంగాణ-ముషీరాబాద్

ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలతో ప్రజల అప్రమత్తంగా ఉండాలని గాంధీ నగర్ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ అన్నారు. డివిజన్ లో భారీ వర్షానికి కూలిన చెట్టు కొమ్మలు విద్యుత్ తీగలపై పడటంతో కరెంట్ షార్ట్ సర్క్యూట్‌తో చిక్కడపల్లి వివేక్ నగర్,త్యాగరాయ గానసభ పరిసర ప్రాంతాల్లోని ఇళ్ళల్లో ఏసీ, టీవీ, ఫ్రిడ్జులు పడయ్యాయని స్థానికుల ఫిర్యాదు మేరకు శుక్రవారం కార్పొరేటర్ స్పందించి డిఆర్ఎఫ్, విద్యుత్ సిబ్బందిని అప్రమత్తం చేశారు. విద్యుత్ సిబ్బందిని అప్రమత్తం చేసి కరెంటు సరఫరాలను నిలిపివేసి రోడ్డుకు అడ్డంగా విరిగి పడిన చెట్లను తొలగించి ప్రజలకు ఇబ్బందులు లేకుం డా చేశారు. వెంటనే స్పందించి సమస్య పరిష్కారానికి కృషిచేసిన కార్పొరేటర్‌కి స్థానిక ప్రజలు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు పి.నర్సింగ్ రావు, కృష్ణ చేతుర్వెదుల, సాయి, ఆనంద్ రావు పాల్గొన్నారు.

నేడు దేశవ్యాప్తంగా వైద్య సేవలు బంద్

- నేడు ఇందిరాపార్క్ వద్ద భారీ ధర్నా.. ఇండియన్ మెడికల్ అసోసియేషన్

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

కోల్‌కతాలోని మహిళా వైద్యురాలి పై హత్య, అత్యాచారం కేసులో అసంతృప్తిగా దర్యాప్తు జరుగుతుందని దానిని నిరసిస్తూ ఈ నెల 17 శనివారం (నేడు) 24 గంటల పాటు దేశవ్యాప్తంగా వైద్యసేవలు నిలిపివేస్తున్నట్లు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ పి. కాశీప్రసాద్ రావు, డాక్టర్ జె. విజయరావులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ధర్నాకు పెద్ద ఎత్తున వైద్యులు హాజరు కావాలని పిలుపుని చ్చారు. వైద్యురాలి హత్యకేసులో కోల్‌కత్తా హైకోర్టు ఇప్పటి వరకు జరిగిన దర్యాప్తుపై అసంతృప్తిని వ్యక్తం చేస్తూ కేసును సీబీఐకి అప్పగించాలని రాష్ట్ర పోలీసులను ఆదేశించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. మహిళా వైద్యురాలిపై జరిగిన అత్యాచారానికి నిరసనగా వైద్యులు నిరసనలు తెలుపుతుంటే దాడులకు పాల్పడడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామ న్నారు. ఈ ఘటనపై దర్యాప్తు వేగవంతం చేసి బాధితురాలి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
సికింద్రాబాద్ - సనత్‌నగర్ - జూబ్లీహిల్స్
శనివారం | ఆగస్టు 17, 2024 | www.navatelangana.com

హరీశ్ రావు రాజీనామా చేయాలంటూ ఫ్లెక్సీల కలకలం



నవతెలంగాణ-బేగంపేట్

బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు రాజీనామా చేయాలంటూ శుక్రవారం పలు ప్రాంతాల్లో ఫ్లెక్సీలు కలకలం రేపాయి. సికింద్రాబాద్, ప్యాట్నీ, ప్యారడైజ్, రసూల్ పురా, బేగంపేట్, పంజాగుట్ట సహా పలు ప్రాంతాల్లో రాత్రికి రాత్రే మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత రావు అభిమానుల పేరిట ఫ్లెక్సీలు వెలిశాయి. 'దమ్ముంటే రాజీనామా చెయ్.. రుణ మాఫీ అయి పోయే.. నీ రాజీనామా ఏడ బోయే.. అగ్గిపెట్ట హరీశ్ రావు' అని రాసి ఉన్న ఫ్లెక్సీలను ఏర్పాటుచేశారు.

ఓయూ ప్రొఫెసర్‌కు ప్రతిష్టాత్మక జాతీయ అవార్డు



నవతెలంగాణ-ఓయూ

ఓయూ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్ పెరుమాళ్ల నవీన్ కుమార్‌కు ప్రతిష్టాత్మక ఐఈటీఈ జాతీయ అవార్డుకు ఎంపికయ్యారు. ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ టెలిక మ్యూనికేషన్ ఇంజినీర్స్, న్యూఢిల్లీ శ్రీనివాసన్ మెమోరియల్ అవార్డు 2024ను ప్రొఫెసర్ నవీన్ కుమార్ కు ప్రకటించింది. ఐదేండ్లుగా ఎలక్ట్రానిక్స్. టెలికమ్యూనికేషన్ ఇంజినీరింగ్‌కు ఆయన చేసిన విశిష్ట సేవల కు గాను ఈ అవార్డుకు ఎంపికయ్యారు. ప్రొ. నవీన్ కుమార్ 120కి పైగా పరిశోధనా ప్రచురణలు, ఇస్రోతో అనేక ప్రాజెక్టులు చేశారు. ఓయూలో అధునాతన జీఎన్ఎస్ఎస్ రీసెర్చ్ లాబొరేటరీ స్థాపన లో కీలక భూమిక పోషించారు.ఓయూ-టీశాట్ ఎంఓయూలో భాగంగా "ఉస్మానియా టీవీ"ని ప్రారంభిం చడంలో ప్రధాన పాత్ర పోషించారు. ప్రొ. నవీన్ కుమార్ కుమార్‌కు ప్రతిష్టాత్మక ఐఈటీఈ జాతీయ అవార్డు దక్కటం పట్ల విద్యార్థులు,ప్రొఫెసర్స్ హర్షం వ్యక్తం చేశారు. సెప్టెంబర్ 14న భోపాల్‌లో జరగనున్న ఐఈటీఈ మిడ్ సింపోజియం కార్యక్రమంలో ప్రొఫెసర్ నవీన్ అవార్డు అందుకోనున్నారు.

సాంకేతిక శిక్షణ కోసం టాస్క్‌తో 'మాట' ఒప్పందం



నవతెలంగాణ - బంజారాహిల్స్

అర్బన్, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న యువతను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీలైన ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, ప్రాంప్ట్ ఇంజినీరింగ్, సైబర్ సెక్యూరిటీ, యాప్ డెవలపింగ్, క్లౌండ్ కంప్యూటింగ్, మొబైల్ యాప్ డెవలప్‌మెంట్లలో ఉచితంగా శిక్షణ ఇచ్చేందుకు తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన టాస్క్(తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్)తో ఒప్పందం కుదుర్చుకున్నట్టు మాట(మన అమెరికన్ తెలుగు అసోసియేషన్) ఫౌండర్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ గనగోని తెలిపారు. ఇందుకు సంబంధించిన ఎంవోయూను తెలంగాణ అకాడమి ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్(టాస్క్)తో ఐటీ శాఖా మంత్రి శ్రీధర్‌బాబు,ఐటీ సెక్రటరీ జయేష్ రంజన్‌తో మార్చుకున్నట్టు వారు ప్రకటించారు. వారు మాట్లాడుతూ.... తెలంగాణలోని గ్రామీణ, అర్బన్, సబర్బన్ ప్రాంతాల్లో ఉండే యువత స్కిల్స్‌ను పెంచేందుకు, టెక్నాలజీ రంగంలో ఉండే వివిధ కోర్సులను వారికి నేర్పించడంతో పాటు వారి సామర్థ్యాన్ని పెంచేందుకు మాట సంస్థ కషి చేస్తుందని తెలిపారు. టాస్క్‌తో సమన్వయం చేసుకుంటూ తాము పని చేస్తామని తెలిపారు. ఈ ఏడాది సెప్టెంబర్ 2 నుంచి కామారెడ్డి జిల్లా నుంచి తాము ఈ శిక్షణను ప్రారంభిస్తున్నామని తొలి దశలో వెయ్యి మంది విద్యార్థులను లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. సంస్థ కో-ఫౌండర్ ప్రదీప్ సామల, నాగేష్ చిక్కలపాటి తదితరులు పాల్గొన్నారు.

అపార్ట్‌మెంట్‌లలో చెత్త సేకరణకు డస్ట్ బిన్‌లను ఏర్పాటు చేయాలి

- డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి



నవతెలంగాణ-ఓయూ

అపార్ట్‌మెంట్‌లలో డోర్ టూ డోర్ తిరగకుండా ఒక చోట డస్ట్ బిన్ లను ఏర్పాటు చేస్తే చెత్త సేకరణ సులభ తరం అవుతుందని, అందుకోసం తార్నాక డివిజన్‌లోని అపార్ట్‌మెంట్ అసోసియేషన్ వారిని సంప్రదించి బిన్ ఏర్పాటు చేసుకోవాలని డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి ఆదేశించారు.ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ అపార్ట్‌మెంట్‌లలో వివిధ కారణాల వలన పూర్తి స్థాయిలో స్వచ్ఛ ఆటోలో చెత్త వేయడం లేనందున అక్కడ తడి, పొడి చెత్తను వేయడానికి బిన్‌లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. బిన్ లలో వేసిన చెత్తను స్వచ్ఛ ఆటో తీసుకువెళ్లేందుకు సులభతరం అవుతుందని డిప్యూటీ మేయర్ తెలిపారు. విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ ల వద్ద చెత్త వేయకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

సీపీఐ(ఎం) సంతకాల సేకరణ



నవతెలంగాణ-ఓయూ

మెట్రో బోగీలను 3 నుండి 6కు పెంచాలని, బస్సుల సంఖ్య రెట్టింపు చేయాలని, ఎంఎంటీఎస్ లోకల్ రైళ్లను పెంచాలని శుక్రవారం రెజిమెంటల్ బజార్ మెట్రో స్టేషన్ లో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో కరపత్రల పంపిణీ సంతకాల ను సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ సికింద్రాబాద్ జోన్ కమిటీ కార్యదర్శి ఎం. అజయ్ బాబు మాట్లాడుతూ.గ్రేటర్ హైదరాబాద్ వేగంగా విస్తరిస్తున్న ప్పటికీ అదే స్థాయిలో మౌలిక సదుపాయాల కల్పన జరగడం లేదన్నారు. నగర ప్రజలు నిత్యం ట్రాఫిక్ రద్దీతో ,కాలుష్య సమస్యలతో తీవ్రంగా సతమత మవుతున్నారని తెలిపారు. నగరంలో ఎక్కువ మంది ప్రయాణించే బస్సులు, రైళ్లను పెంచకుండా ఈ సమస్య పరిష్కారం కాదన్నారు. బస్సుల సంఖ్య పెరగకపోగా భారీగా తగ్గిపోతున్నాయని... సొంత వాహనాలు కొత్తగా ప్రతి ఏటా లక్షల సంఖ్యలో రోడ్లపైకి వస్తున్నాయని తెలిపారు. ఇది ఇలాగే కొనసాగితే నగర ప్రజలు ట్రాఫిక్ పద్మవ్యూహంలో ఉక్కిరి బిక్కిరి అయ్యే పరిస్థితి ఏర్పడుతుం దన్నారు. అలాగే మెట్రో రైలు బోగీలను పెంచాలని ఎల్ అండ్ టీ, కేంద్ర ,రాష్ట్ర , ప్రభుత్వాలపై ఒత్తిడి చేద్దాం అంటు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జోన్ కార్యదర్శి అజయ్ బాబు, సికింద్రాబాద్ జోన్ నాయకులు కే వెంకటేష్,రమేష్,నరేష్ పాల్గొన్నారు.

బెల్ట్ షాపు నిర్వాహకురాలు పరారీ

- త్వరలో అరెస్టు చేస్తాం : ఎస్ఆర్ నగర్ ఏసీపీ వెంకట్ రమణ



నవతెలంగాణ- జూబ్లీహిల్స్.

బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలోని సైట్ త్రీ లో ఎంతోకాలంగా బెల్ట్ షాపు నిర్వహిస్తూ, మద్యం అక్రమంగా ఇంట్లో అమ్ముతున్న ఓ మహిళ ఇంటి నుంచి పారిపోయింది. గురువారం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా వైన్స్ షాపులు పూర్తిగా మూసి ఉన్నందున, వైన్స్ షాప్ యజమానులతో కుమక్కై బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో సరళ అనే మహిళ తన ఇంటిలో మద్యం బాటిల్స్ నిల్వ చేసినట్టు పక్కా సమాచారంతో , బోరబండ ఎస్సై జమాల్ సిబ్బందితో శుక్రవారం ఉదయం ఆమె ఇంటి వద్దకు వెళ్లారు. విషయం తెలుసుకున్న మహిళ ఇంటి గేటుకు లోపల నుండి తాళం వేసి పరారైంది. పోలీసులు గేటు తాళం తెరిపించి ఇంటి లోపలికి వెళ్లి చూడగా 326 చిన్న మద్యం బాటిళ్లు, రూ.3620 క్యాష్ ఉన్నట్లు గుర్తించి వాటిని బోరబండ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

ఈ సందర్భంగా ఎస్ఆర్ నగర్ ఏసీపీ వెంకట్ రమణ మీడియాతో మాట్లాడుతూ బోరబండలో నివసిస్తున్న సరళపై 9 కేసులు ఉన్నాయని, అనేకసార్లు జైలుకు కూడా వెళ్లి వచ్చిందని తెలిపారు. అయినా కూడా బెల్ట్ షాప్ నిర్వహిస్తూ మద్యం అమ్ముతున్నదని, ఆమెను త్వరలో అరెస్టు చేస్తామని తెలిపారు. మరల బెల్ట్ షాపు నిర్వహించకుండా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. బెల్టు షాపులకు మద్యం సరఫరా చేసే వైన్స్ దుకాణం యజమానులపై కూడా కేసులు పెట్టి చర్యలు తీసుకుంటామని అన్నారు.

పాపన్న గౌడ్ జయంతిని అధికారికంగా నిర్వహించడం హర్షణీయం

- ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్‌ను కలిసిన బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్



నవతెలంగాణ-ఓయూ

18న బహుజన విప్లవ వీరుడుసర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 374వ, జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించడం పట్ల ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్‌ను బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ కలిసి హర్షం వ్యక్తం చేస్తూ ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. పాపన్న గౌడ్ బహుజన రాజ్యం కోసం తన జీవితాన్నే త్యాగం చేసిన గొప్ప మహనీయుడని అన్నారు. నిజాం పాలకులు, భూస్వామ్య పెత్తందారులకు వ్యతిరేకంగా పోరాడి బహుజనుల అభివృద్ధికి కృషి చేసి గోల్కొండ కోటపై బహుజనుల జండా ఎగరేశారని అన్నారు. బహుజనులం దరూ ఐక్యమై రాజ్యాధికారం కోసం కృషి చేయాలని అన్నారు.

బీఆర్ఎస్ మద్దతిస్తే రాజ్యసభ బరిలో దిగుతా..

- డా. గాలి వినోద్ కుమార్



నవతెలంగాణ-ఓయూ

బీఆర్ఎస్ భేషరతుగా మద్దతిస్తే తెలంగాణ నుంచి రాజ్యసభ సభ్యుడిగా ఇండిపెండెంట్ సభ్యుడిగా పోటీ చేయడానికి తాను సిద్ధంగా ఉన్నట్టు దక్షిణ భారత రాజకీయ జేఏసీ చైర్మెన్ ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్ తెలిపారు శుక్రవారం తార్నాకలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ మాదిగలకు ఇస్తానన్నా రాజ్యసభ సీటు ఢిల్లీకి చెందిన అభిషేక్ సింగ్వికి ఇవ్వడాన్ని తాము పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. ఇది మాదిగలను మరోసారి కాంగ్రెస్ పార్టీ మోసం చేయడమేనన్నారు.

"రిచింగ్ ది అన్ రీచ్డ్"కు అంతర్జాతీయ గుర్తింపు

- గుత్తికోయ చిన్నారుల బతుకు చిత్రం ఇతివృత్తంగా వచ్చిన లఘు చిత్రం
- ఓయూ ఈఎంఆర్‌సీ డైరెక్టర్ పి.రఘుపతి దర్శకత్వం
- పలువురు ప్రశంసలు
- చిత్రానికి వచ్చే ప్రాచుర్యంతో పిల్లలకు మేలు జరుగుతుంది : డైరెక్టర్ పి.రఘుపతి





నవతెలంగాణ-ఓయూ

సమాజానికి దూరంగా అడవుల్లో బ్రతుకుతున్న గుత్తికోయ చిన్నారుల బతుకు జీవన విధానమే , చిత్రమే ఇతివృత్తంగా తీసిన లఘుచిత్రానికి అంతర్జాతీయ గుర్తింపు దక్కడంతో పలువురు అభినందిస్తున్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయ ఎడ్యుకేషనల్ మల్టీమీడియా రీసెర్చ్ సెంటర్ (ఈఎంఆర్సీ), డైరెక్టర్ పి. రఘుపతి "రీచింగ్ ది అన్ రీచ్" పేరుతో రూపొందించిన 12 నిమిషాల నిడివి కలిగిన చిత్రం యూజీసీ - సీఈసీ 16వ, అంతర్జాతీయ ప్రకృతి ఫిల్మ్ ఫెస్టివల్ కోసం నిర్వహించిన లఘుచిత్ర పోటీల్లో అగ్రభాగాన నిలిచింది. అభివృద్ధి విభాగంలో అవార్డు కైవసం చేసుకోగా , మానవ హక్కుల విభాగంలోనూ సైటేషన్ కు ఎంపిక కావడం విశేషం .ప్రతి ఏటా యూజీసీ - సీఈసీ పర్యావరణం, అభివృద్ధి, మానవహక్కులు, స్వచ్ఛ భారత్ నాలుగు విభాగాల్లో లఘుచిత్ర పోటీలను నిర్వహిస్తోంది. ఈ పోటీలకు పలు దేశాలతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఎంట్రీల నుంచి జ్యూరీ విజేతలను ఎంపిక చేసింది. ఎంపికైన చిత్రాలను ఏటా నిర్వహించే అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్ లో ప్రదర్శిస్తారు. విజే తలకు ప్రశంసాపత్రం, నగదు బహుమతి అంద జేస్తారు. ప్రకృతి అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్ లో ఓయూ ఈఎమ్మార్సీకి అవార్డు రావటం ఇదే మొదటి సారి.

గుత్తి కోయల బతుకు చిత్రమే ఆధారంగా...



ఛత్తీస్‌గఢ్ అడవుల్లో నెలకొన్న రాజకీయ కారణాలతో ఏండ్ల క్రితమే వందలాది కుటుంబాలు వలస వచ్చి ములుగు, భూపాల పల్లి జిల్లాల్లోని అటవీ ప్రాంతంలో తాత్కాలిక ఆవాసాలను ఏర్పాటు చేసుకున్నాయి. అటవీ ఉత్పత్తులపై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నాయి. అయితే వారి పిల్లలకు విద్య అందుబాటులో లేకపోవటంతో ఉస్మానియా విద్యార్థులు సంతోష్ ఇస్రం, నరేష్ తో పాటు వారి మిత్రులు శశిధర్ రెడ్డి, చందా గున్నంతరావు ఏకోపాధ్యాయ భీం చిల్డ్రన్స్ హ్యాపినెస్ సెంటర్లను ఏర్పాటు చేశారు.

ఆవాసాల్లో చిన్నారుల విద్యకు చేయూత

సారలమ్మ గుంపు, ముసలమ్మ పెంట, తక్కెళ్లగూడెం, ప్రాజెక్టు సాగర్, నీలంతోగు, బండ్ల పహాడ్, దండుపల్లి, కాల్వపల్లి, ఐలాపురం తొమ్మిది ఆవాసాల్లో ఏకోపాధ్యాయ పాఠశాలలు ఎర్పాటు చేసి పిల్లలకు ప్రీ ప్రైమరీ విద్యను అందిస్తున్నారు. వారిని రెండుమూడు ఏండ్ల పాటు సిద్ధం చేసి ప్రభుత్వ ఆశ్రమపాఠశాలల్లో చేరుస్తున్నారు. భీం చిల్డ్రన్ హ్యాపినెస్ కేంద్రాలపై ఈఎమ్మార్సీ రూపొందించిన 12 నిమిషాల షార్ట్ ఫిలిం విద్యాభివృద్ధి విభాగంలో అంతర్జాతీయ అవార్డు దక్కించుకుంది. వచ్చే నెలలో జరగనున్న 16వ ప్రకృతి ఫిల్మ్ ఫెస్టివల్ లో లఘుచిత్ర రూపకర్త పి. రఘుపతి ఈ అవార్డును అందుకోనున్నారు.

లఘుచిత్రానికి వచ్చే ప్రాచుర్యంతో గుత్తికోయ పిల్లలకు మేలు జరుగుతుందని భావిస్తున్నా..



" మేడారం అటవీ ప్రాంతంలో చిన్నారులకు ఓయూ విద్యార్థులు విద్యను అందించటం ఆసక్తి కలిగించింది. స్వచ్ఛందంగా కొంత మంది విద్యార్థులు వారి స్నేహితులు అక్కడికి వెళ్లి చిన్నారులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడి ఒక్కో ఆవాసంలో ఒక్కో చిన్న గుడిసె నిర్మించి హ్యాపినెస్ కేంద్రాలను ఏర్పాటు చేయ టం నన్ను డాక్యుమెంటరీ రూపొందిం చేలా ప్రేరేపించింది. నాలుగు రోజుల పాటు అక్కడే ఉండి డాక్యుమెంటరీ కోసం చిత్రీకరణ చేశాం. ఇందుకు ఈఎమ్మార్సీ సిబ్బంది, ఇతర స్నేహితులు సహకరించారు. అవార్డు వచ్చినందుకు సంతోషంగా ఉంది. ఈ లఘుచిత్రానికి వచ్చే ప్రాచుర్యం ద్వారా అక్కడి పిల్లలకు మేలు జరుగుతుందని ఆశిస్తున్నా. వారు మా పట్ల చూపిన ప్రేమ అభిమానం ఎప్పటి మరువలేం"

- ఈఎంఆర్సీ డైరెక్టర్ రఘుపతి



డ్రయినేజీని పరిశీలించిన అధికారులు

నవతెలంగాణ-ఓయూ

హబ్సిగూడకార్పొరేటర్ కక్కిరేణి చేతన హరీష్ సూచన మేరకు జలమండలి ఎండి అశోక్ రెడ్డి , ఎస్‌టీపీ సీజీఎం సుజాత, డీటీపీ స్వామి, జీఎం సంతోష్ , సీజీఎం రజనీకాంత్ , రవీందర్ అండ్ ఎస్‌టీపీ డీజీఎం రామ్ రెడ్డి నగర్ డ్రయినేజీ సమస్య గురించి పరిశీలించారు. ట్రంక్ లైన్ ద్వారా రామ్ రెడ్డి నగర్ లో డ్రయినేజీ సమస్య లేకుండా చేయాలని కార్పొరేటర్ చేతన పలుమార్లు వినతి పత్రాలు అందజేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు అధికారులు శుక్రవారం రామిరెడ్డి నగర్‌లో పనుల పరిశీలించగా.. త్వరలోనే సమస్య పూర్తిగా తీరుతుందని కార్పొరేటర్ తెలిపారు.



హైదరాబాద్‌లో వరల్డ్ హిస్టరీ కాంగ్రెస్..

- సెప్టెంబర్ 14, 15 తేదీలలో నిర్వహణ
- ప్రొ. కోదండరాంకు ఆహ్వానం

నవతెలంగాణ-ఓయూ

సెప్టెంబర్ 14,15 తేదీల్లో హైదరాబాద్‌లోని అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో నిర్వహించనున్న రెండో వరల్డ్ హిస్టరీ కాంగ్రెస్ సమావేశానికి ముఖ్య అతిథిగా ప్రముఖ విద్యావేత్త , ప్రొఫెసర్ కోదండరాంను నిర్వాహకులు ఆహ్వానించారు. డాక్టర్ గోపాల్, డాక్టర్ విద్యాసాగర్ , రాఘవేంద్ర రెడ్డి ఆహ్వానించారు. ఈ కార్యక్రమానికి తప్పక హాజరవుతానని కోదండరాం హామీ ఇస్తూ, ఇట్లాంటి సెమినార్లు ఎన్నో నిర్వహించి, చరిత్ర పట్ల ప్రజలకు అవగాహన కల్పించి, చరిత్రను భవిష్యత్ తరాల వారికి అందించి, భారత దేశ చారిత్రక సంపదను ప్రతి ఒక్కరూ సంరక్షించలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గోపాల్, డాక్టర్ విద్యాసాగర్, ప్రముఖ కవి దరువు ఎల్లన్న, రాఘవేంద్ర రెడ్డి పాల్గొన్నారు.



ప్రొ.కోదండరాంకు శుభాకాంక్షలు

నవతెలంగాణ-ఓయూ

రాష్ట్ర శాసనమండలి సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా తెలంగాణ జన సమితి అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాంను తెలంగాణ ఆల్ యూనివర్సిటీ పార్ట్ టైం టీచర్స్ కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సోమేశ్వర్ బోనకుర్తి,కార్యనిర్వాహక అధ్యక్షులు డాక్టర్ జానకి రెడ్డి అరుట్ల,ఉపాధ్యక్షులు డాక్టర్ జూలు నాగేశ్వర్,.ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ చంద్రశేఖర్ బానోతు పాల్గొన్నారు.

అక్రమంగా కొనసాగుతున్న రిటైర్డ్ ఉద్యోగస్తులను తొలగించాలి



- టీఎస్ఏ రాష్ట్ర అధ్యక్షులు శ్రీకాంత్ యాదవ్

నవతెలంగాణ-ఓయూ

రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లో అక్రమంగా కొనసాగుతున్న 1050 మంది పదవీ విరమణ చేసిన వారిని వెంటనే తొలగించాలని తెలంగాణ స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.ఎం.శ్రీకాంత్ యాదవ్ కోరారు. ఓయు ఆర్ట్స్ కళాశాల ఎదుట శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాదాపు 1050 మంది రిటైర్డ్ ఉద్యోగస్తులు ప్రభుత్వంలో ఉన్న శాఖల్లో ఉన్నత పదవుల్లో డిపార్ట్మెంట్ హెడ్‌లుగా, ఇతర ఉన్నత స్థానాల్లో కొనసాగుతున్నారు.. వీరికి అలవెన్స్ లు, ఇతరత్రా వాటికి దాదాపు సంవత్సరానికి రూ. 150 కోట్లు ప్రజాధనం కేటాయించాల్సి వస్తుందని.. అర్హులైన సీనియర్ ఉద్యోగులకు ప్రమోషన్లు దక్కకుండానే రిటైర్ అవ్వాల్సిన దుస్థితి ఏర్పడుతోందన్నారు. అలాగే నిరుద్యోగులకు కూడా నష్టం జరుగుతున్నదన్నారు.సీఎం రేవంత్ రెడ్డి ప్రతిపక్షం లో ఉన్నప్పుడు తాము అధికారంకి వస్తే ఈ రిటైర్డ్ ఉద్యోగులను వెంటనే తొలగించి సీనియర్ ఉద్యోగులకు ప్రమోషన్ కల్పించి తద్వారా ఏర్పడిన ఖాళీలను నిరుద్యోగులకు ఉద్యోగ నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేస్తామన్నారని గుర్తు చేశారు. దాదాపు ప్రభుత్వం ఏర్పడి 8 నెలలైనా నేటికి అమలుకు నోచుకోలేదన్నారు.ఒకవైపు నిరుద్యోగ సమస్య పెరుగుతోందని.. మరోవైపు రిటైర్డ్ ఉద్యోగులు మాత్రం పెన్షన్‌తో పాటు అక్రమంగా వేతనాలు,అలావెన్స్ లు పొందుతున్నారన్నారు. దీనిపై ముఖ్యమంత్రి స్పందించి వెంటనే వారిని తొలగించాలని డిమాండ్ చేశారు. లేని యెడల మరో ఉద్యమానికి శ్రీకారం చూడతామని,సెక్రటేరియట్ ముట్టడిస్తామని హెచ్చరించారు. టీఎస్ఏ నాయకులు రామ్ కిషన్, మురళి కృష్ణ, రంజిత్ వర్మ, కార్తీక్ పాల్గొన్నారు.

వైద్యురాలి హత్య ఘటనకు నిరసనగా ర్యాలీ



నవతెలంగాణ-బేగంపేట్

కోల్‌కతాలో వైద్యురాలిపై లైంగికదాడి, హత్య ఘటన నేపథ్యంలో మృతి చెందిన జూనియర్ డాక్టర్ ఆత్మకు శాంతి కలగాలని బేగంపేటలోని కిమ్స్ సన్ షైన్ హాస్పిటల్ వైద్యులు శుక్రవారం ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఏ వి గురవారెడ్డి ఆధ్వర్యంలో శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా డాక్టర్లతో కలిసి ప్ల కార్డులతో ర్యాలీ నిర్వహించారు. కోల్‌కతా ఘటనలో న్యాయం జరగాలని నినాదాలు చేస్తూ పెద్ద ఎత్తున డాక్టర్లు హాస్పిటల్స్ సిబ్బంది ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా హాస్పిటల్ ఎండి డాక్టర్ ఏవీ గురవారెడ్డి మాట్లాడుతూ ఈ సంఘటన యావత్ భారతదేశాన్ని దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. ఈ విషాద సంఘటనకు నిరసనగా ఐఎంఏ పిలుపుమేరకు శనివారం కిమ్స్ సన్ షైన్ హాస్పిటల్ బేగంపేటలో డాక్టర్ల ఓపిడీలు, శస్త్ర చికిత్సలను నిలిపివేస్తున్నట్టు తెలిపారు. హాస్పటల్ సిబ్బంది భద్రత, శ్రేయస్సు కోసం ప్రత్యేకంగా ఓ కమిటీని ఏర్పాటు చేశామని, మహిళా సిబ్బంది డాక్టర్లు తమను తాము రక్షించుకునేలా సెల్ఫ్ డిఫెన్స్ నేర్చుకోవాలని, అందుకోసం వారంలో ఒకరోజు మార్షల్ ఆర్ట్స్ కోచింగ్ ఇవ్వనున్నట్టు తెలిపారు. మహిళలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని, మహిళలు కూడా వారికి ఎలాంటి ఇబ్బంది కలిగించే సంఘటనలు జరిగినా ఫిర్యాదు చేయడంతో పాటు ధైర్యంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు.



ఎర్రగడ్డలో విద్యార్థుల కొవ్వొత్తుల ర్యాలీ



నవతెలంగాణ - జూబ్లీహిల్స్

కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన దుశ్చర్యను నిరసిస్తూ ఎర్రగడ్డ లోని కళాశాల ప్రాంగణంలో విద్యార్థులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి తన ఆత్మకు శాంతి చేకూరాలని తన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియ జేశారు. స్వాతంత్రం వచ్చి 78 సంవత్సరాలు గడిచినా స్త్రీలపై లైంగికదాడులు మాత్రం ఆగడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. లైంగికదాడి, హత్యకు నిరసనగా పీజీ విద్యార్థులు వారి సేవలను నెలిపివేయదలుచుకున్నారు. ఈ కార్యక్రమంలో పీజి విద్యార్థులు, ఇంటర్న్స్, యూజీ విద్యార్థులు పాల్గొన్నారు.



పెండ్లి తర్వాత...

పెండ్లయిన తర్వాత అందరి జీవితాల్లో కొన్ని మార్పులు కచ్చితంగా వస్తాయి. బాల్యం నుండి పెండ్లి అయ్యే వరకు జీవితాలు ఒకలా ఉంటాయి. పెండ్లి తర్వాత వచ్చే ఈ మార్పులు సర్వసాధారణం. అయితే అబ్బాయిలతో పోల్చితే అమ్మాయిల్లో ఈ సమస్య ఎక్కువగా ఉంటుంది. అమ్మాయిలు అప్పటి వరకు తాము పుట్టి పెరిగిన ఇంటిని వదిలి కొత్తగా అత్తగారింటికి వెళ్ళాలి. అక్కడంతా కొత్త వాతావరణం. కొన్ని ఆంక్షలు కూడా వచ్చి పడతాయి. తల్లి ఇంటిలో వలె స్వేచ్ఛగా ఉండే అవకాశం చాలా తక్కువ. ప్రతి దానికీ భర్త, అత్తమామల పర్మిషన్ తీసుకోవల్సి వస్తుంది. అదే ఇద్దరూ కొత్తగా వేరు కాపురం పెడితే ఆ సమస్యలు వేరే ఉంటాయి. అలాంటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్న ఓ జంట కథే ఈ వారం ఐద్వా అదాలత్...

మీనాకు 24 ఏండ్లు ఉంటాయి. రమేష్‌తో పెండ్లి జరిగి ఎనిమిది నెలలు అవుతుంది. ఇద్దరూ మంచి ఉద్యోగాలు చేస్తున్నారు. ఉద్యోగ రీత్యా ఇద్దరూ సిటీలో కొత్త కాపురం పెట్టారు. పెండ్లయి ఎక్కువ రోజులు కాలేదు. పైగా పెద్దలు కుదర్చిన వివాహం కాబట్టి ఒకరి గురించి ఒకరు పూర్తిగా అర్థం చేసుకోడానికి కొంత సమయం పడుతుంది. దీని కోసం ఇద్దరూ ఒకరితో ఒకరూ కొద్ది సేపు గడపడం, ఒకరి ఇష్టాలు మరొకరు పంచుకోవడం చేయాలి. అప్పుడే ఇద్దరి మధ్య అనుబంధం ఏర్పడుతుంది.

కానీ మీనా, రమేష్‌ల ప్రవర్తన విచిత్రంగా ఉంది. పైగా వారిద్దరి మధ్య ఏమైనా సమస్యలు వస్తే సరిదిద్దే వారు ఎవ్వరూ దగ్గర్లో లేరు. మీనా తల్లిదండ్రులు గానీ, అత్తమామలు గానీ వచ్చి వీరి దగ్గర ఉండే అవకాశం లేదు. వాళ్ళ ఊళ్ళో వ్యవసాయం చేస్తారు. దాన్ని వదిలి సిటీలో ఎక్కువ రోజులు ఉండలేరు. ఒక వేళ వచ్చినా ఒక్కరోజు ఉండి వెళ్లిపోతారు. అయితే ఇక్కడ సమస్య ఏంటంటే మీనా, రమేష్ ఇద్దరూ పెండ్లికి ముందు ఎలా ఉండేవారో పెండ్లి తర్వాత కూడా అలాగే ఉంటున్నారు. అంటే ఎవరి ఇష్టం వచ్చినట్టు వాళ్ళ ఉంటారు. బయటకు వెళ్లినా ఒకరితో ఒకరు చెప్పుకోరు.

రమేష్, మీనతో చెప్పకుండానే తన స్నేహితులను ఇంటికి తీసుకు వస్తుంటాడు. వచ్చిన స్నేహితులు మీన వంట గురించి కామెంట్లు చేయడం, ఇంటి పద్ధతుల గురించి మాట్లాడుతుండేవారు. ఇదంతా ఆమెకు నచ్చేది కాదు. రమేష్ సహెూద్యోగుల్లో మహిళలు కూడా ఉండేవారు. వారు మీనా డ్రెస్సింగ్ గురించి మాట్లాడేవారు. ఇది ఆమెకు అస్సలు నచ్చేది కాదు.

రమేష్, మీనతో చెప్పకుండానే తన స్నేహితులను ఇంటికి తీసుకు వస్తుంటాడు. వచ్చిన స్నేహితులు మీన వంట గురించి కామెంట్లు చేయడం, ఇంటి పద్ధతుల గురించి మాట్లాడుతుండేవారు. ఇదంతా ఆమెకు నచ్చేది కాదు. రమేష్ సహెూద్యోగుల్లో మహిళలు కూడా ఉండేవారు. వారు మీనా డ్రెస్సింగ్ గురించి మాట్లాడేవారు. ఇది ఆమెకు అస్సలు నచ్చేది కాదు. ఆ విషయం రమేష్‌తో చెప్పినా పెద్దగా పట్టించుకోడు. ఇంట్లో ఆమె ఒంటరిగా వుందని తెలిసి కూడా రమేష్ ఆలస్యంగా ఇంటికి వస్తాడు. 'కొత్త చోటు నాకు ఒక్కదాన్నే ఉండటం ఇబ్బందిగా ఉంది' అన్నా పట్టించుకునేవాడు కాదు. పైగా 'నేను ఏం చేసినా నీకు ఇబ్బందిగానే ఉంటుంది. నేను ఏంచేయాలో, చేయకూడదో నీ దగ్గరి నుండి నేర్చుకోవాలా' అనేవాడు.

దీంతో మీన కూడా 'సరే నీకు నచ్చినట్టు నువ్వు ఉండు, నేను కూడా నాకు నచ్చినట్టుగా ఉంటాను' అంటూ ఆమె తన స్నేహితులతో లేట్‌నైట్ వరకు బయట వుండి ఇంటికి రావడం మొదలుపెట్టింది. ఇంట్లో వంట చేయడం మానేసింది. 'నేను బయట తిని వచ్చాను. నీకు ఆకలిగా ఉంటే ఆర్డర్ చేసి తెప్పించుకో, లేకపోతే నువ్వే వంట చేసుకొని తిను' అనేది. ఇలా ఇద్దరూ ప్రతి చిన్న విషయానికీ నామాటే నెగ్గాలి అనుకుంటూ పోట్లాడుకునేవారు. ఇది గమనించి ఇంటి పక్కనే ఉండే సుమతి వాళ్లకు నచ్చజెప్పే ప్రయత్నం చేసింది. కానీ వాళ్లు గొడవ పడడం మాత్రం మానుకోలేదు. దాంతో సుమతి వారిద్దరినీ తీసుకొని ఐద్వా అదాలత్‌కు వచ్చింది.

ఐద్వా అదాలత్
సెల్: 9490098024

మేము ఇద్దరినీ కూర్చోబెట్టి 'పెండ్లి అంటే బాధ్యతగా వ్యవహరించాలి. అంతే గానీ 'నువ్వు ఎక్కువా, నేను ఎక్కువగా' అంటూ గొడవలు పడితే సంసారం సాఫీగా సాగదు. ఒకరి ఇష్టాలను ఒకరు గౌరవించుకోవాలి. ఏ పని చేసినా ఇద్దరూ కలిసి చేసుకోవాలి. ఇద్దరూ కలిసి మాట్లాడుకుంటే ఎలాంటి సమస్యలూ ఉండవు. ఇలా మీరు గొడవలు పడుతూ ఒక్కరోజైనా సంతోషంగా ఉన్నారా? మీరే ఆలోచించుకోండి. ఇద్దరికీ మనశ్శాంతి ఉండదు. అదే ఒకరి గురించి ఒకరు ఒక్కసారి ఆలోచించండి. అప్పుడు మీకే అర్థమవుతుంది. ప్రతి చిన్న విషయానికి గొడవ పడడం సరైనది కాదు. బయటకు వెళ్లాలనుకుంటే ఇద్దరూ కలిసి వెళ్ళండి. ఎవరి దారిన వారు మీ స్నేహితులతో తిరుగుతుంటే ఇక మీ గురించి మీరు ఎప్పుడు తెలుసుకుంటారు. కొత్తగా పెండ్లయిన వారు ఎంత సంతోషంగా ఉండాలి? అనవసరమైన ఈగోలకు వెళ్ళి హాయిగా గడపాల్సిన సమయం మొత్తం గొడవలతో గడుపుతున్నారు.

'సరే నీకు నచ్చినట్టు నువ్వు ఉండు, నేను కూడా నాకు నచ్చినట్టుగా ఉంటాను' అంటూ ఆమె తన స్నేహితులతో లేట్‌నైట్ వరకు బయట వుండి ఇంటికి రావడం మొదలుపెట్టింది. ఇంట్లో వంట చేయడం మానేసింది. 'నేను బయట తిని వచ్చాను. నీకు ఆకలిగా ఉంటే ఆర్డర్ చేసి తెప్పించుకో, లేకపోతే నువ్వే వంట చేసుకొని తిను' అనేది.

ఇప్పటి నుండి ఇద్దరూ కలిసి వంట చేసుకోవడం, ఇల్లు సర్దుకోవడం వంటివి చేయండి. వారానికి ఒకసారి ఇద్దరూ కలిసి సరదాగా బయటకు వెళ్లండి. ఎవరి స్నేహితులు ఇంటికి వచ్చినా ముందు ఒకరితో ఒకరు చెప్పుకోండి. ఇద్దరూ ఒక మాటపై ఉండి వాళ్లను ఇంటికి ఆహ్వానించండి. భార్యాభర్తలంటే ఇలా ఉండాలి. ఎవరి ఇష్టం వచ్చినట్టు వాళ్లుంటే అది సంసారం కాదు' అని ఇద్దరికీ సర్ది చెప్పాము.

తర్వాత రమేష్‌తో 'మీ భార్య డ్రెస్సింగ్ గురించి ఇతరులు మాట్లాడే అవకాశం ఇవ్వకండి. ఆమె ఎలాంటి డ్రెస్సులు వేసుకోవాలో ఆమె నిర్ణయించుకుంటుంది. మీకు ఏమైనా అభ్యంతరం ఉంటే ప్రేమగా ఆమెకు చెప్పుకోండి' అని చెప్పాము.

అలాగే మీనాతో 'నువ్వు కూడా నీ పద్ధతులు కొన్ని మార్చుకోవాలి. ఇంట్లో ఎలా ఉండాలో, బయట ఎలా ఉండాలో నేర్చుకో. ఇద్దరూ ఎవరితో ఎలా ప్రవర్తించాలో తెలుసుకోండి. అనవసరంగా గొడవలు పెట్టుకోవద్దు. ఇద్దరి మధ్య ఏమైనా సమస్య వస్తే మా దగ్గరకు రండి' అని చెప్పాము.

దానికి ఇద్దరూ 'నిజమే మేడం, ఇప్పటి వరకు మేము ఒకరి గురించి ఒకరం తెలుసుకునే ప్రయత్నమే చేయలేదు. ఎప్పుడూ మా స్నేహితులు, మా ఉద్యోగాల గురించే ఆలోచించాము. ఇకపై మీరు చెప్పినట్టే చేస్తాం' అని చెప్పి వెళ్లిపోయారు.

- వై వరలక్ష్మి
9948794051

శనగలతో ఆరోగ్యం

శనగలు మనందరికీ బాగా తెలుసు. వీటిని నానబెట్టుకొని పోపేసుకొని తింటాం. ముఖ్యంగా శ్రావణమాసం వచ్చిందంటే చాలు ప్రతి ఒక్క శుభకార్యంలో ఈ శనగలను వాడుతూ ఉంటాం. ఇందులో మటన్, చికెన్ కంటే అధికంగా ప్రోటీన్ ఉంటుంది. శాకాహారులకు ఇది ఒక ప్రోటీన్ సోర్స్‌గా చెప్పవచ్చు. కేవలం ప్రోటీన్ మాత్రమే కాదు ఇందులో అనేక రకాల పోషకాలు ఉన్నాయి. ముఖ్యంగా కాల్షియం, ఐరన్, జింక్, పొటాషియం మూలకాలు అధికంగా ఉన్నాయి. ఇవన్నీ కూడా మనకు ఆరోగ్యాన్ని అందించేవే. ప్రతిరోజూ నాన పెట్టిన శనగలు తీసుకుంటే కలిగే ఆరోగ్య ప్రయోజనాలు ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం.



నానబెట్టిన శనగల గ్లైసిమిక్స్ ఇండెక్స్ చాలా తక్కువ. కాబట్టి షుగర్ పేషెంట్స్ నిరభ్యంతరంగా వీటిని తీసుకోవచ్చు. నానబెట్టిన శనగల్లో ఫైబర్ అధికంగా ఉంటుంది. కాబట్టి దీన్ని తీసుకోవడం ద్వారా జీర్ణక్రియ సక్రమంగా జరుగుతుంది. ఫైబర్ ఎక్కువగా ఉండటం వల్ల త్వరగా ఆకలి వేయదు. దీని ద్వారా అధిక బరువు నుండీ బయటపడతారు. ఇందులో విటమిన్ ఏ, విటమిన్ సి , పుష్కలంగా ఉంటాయి. కాబట్టి ఇది గుండె సంబంధ జబ్బులు ఉన్నవారికి క్యాన్సర్ రోగులకు చక్కటి పరిష్కారం.

నానపెట్టిన శనగల్లో ప్రోటీన్ అధికంగా ఉండడం వల్ల వ్యాయామానికి ముందు ఒక గుప్పెడు నానబెట్టిన శనగలను తీసుకున్నట్లయితే కండరాలకు శక్తిని ఇస్తుంది. అంతేకాకుండా ప్రోటీన్ లోపం సమస్యతో బాధపడే వారికి ఇది ఒక చక్కటి పరిష్కారమని చెప్పొచ్చు. అదేవిధంగా చర్మం నిగారింపుకు జుట్టు పోషణకు కూడా ఇవి ఎంతో సహకరిస్తాయి. నానపెట్టిన శనగలను తీసుకున్నట్లయితే జ్ఞాపక శక్తి పెరుగుదలకు, ఏకాగ్రతకు చక్కటి రెమిడిగా పని చేస్తుంది. అంతేకాకుండా చాలామంది అల్జీమర్ సమస్యతో బాధపడుతూ ఉంటారు. అటువంటి వారు కూడా ఈ శనగల్ని తీసుకున్నట్లయితే సమస్య తగ్గుతుంది.

చాలామందికి మొహం పైన తెల్లటి మచ్చలతోపాటు.. కొన్ని రకాలైన చర్మ సంబంధ వ్యాధులు కూడా ఉంటాయి. ఈ నానబెట్టిన శనగలను ఆహారంలో భాగం చేసుకుంటే అలాంటి సమస్యల నుంచి బయటపడొచ్చు.

మోగిన మరో నగారా

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

హర్యానా, జమ్మూకాశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది. శుక్రవారం నాడిక్కడ విజ్ఞాన భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎన్నికల కమిషనర్లు జ్ఞానేష్ కుమార్, సుఖ్బీర్ సింగ్ సంధుతో కలిసి ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ షెడ్యూల్‌ను విడుదల చేశారు. హర్యానా అసెంబ్లీకి ఒకే దశలో ఎన్నికలు నిర్వహించనున్నారు. మొత్తం 90 స్థానాలకు అక్టోబర్ 1న అసెంబ్లీ ఎన్నికలకు పోలింగ్ జరగనుంది. జమ్మూ కాశ్మీర్‌లో మొత్తం మూడు విడతల్లో పోలింగ్ నిర్వహించనున్నారు. సెప్టెంబర్ 18, 25, అక్టోబర్ 1న జమ్మూ కాశ్మీర్ అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్నాయి. మొత్తం 90 స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ రెండు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు అక్టోబర్ 4న వెల్లడి అవుతాయి. ఈ సందర్భంగా రాజీవ్ కుమార్ మాట్లాడుతూ.. '2024 లోక్‌సభ ఎన్నికలు ప్రపంచంలోనే అతిపెద్ద ఎన్నికల ప్రక్రియ. ఆ ఎన్నికలు విజయవంతంగా, శాంతియుతంగా పూర్తయ్యాయి. దేశవ్యాప్తంగా యువత మొదలుకుని వద్ధుల వరకు భారీ సంఖ్యలో తరలివచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు. ముఖ్యంగా జమ్మూకాశ్మీర్ ఎన్నికల్లో అక్కడి ఓటర్లు ఎంతో చైతన్యం చూపించారు. ఈసారి వారు హింసను పక్కనపెట్టి ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వినియోగించుకునేందుకే మొగ్గు చూపారు' అని అన్నారు.

'జమ్మూ కాశ్మీర్‌లో మొత్తం 90 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. వాటిలో 74 జనరల్, 7- ఎస్‌సి, 9- ఎస్‌టి స్థానాలు ఉన్నాయి. జమ్మూ కశ్మీర్‌లో మొత్తం 88,66,704 లక్షల మంది (జులై 25 నాటికి) ఓటర్లు ఉన్నారు. అందులో 87,90,870 మంది జనరల్ ఓటర్లు, 75,834 మంది సర్వీస్ ఓటర్లు ఉన్నారు. 69,974 మంది 85 ఏళ్ల దాటిన..వద్ధులు ఉన్నారు. 83,072 మంది దివ్యాంగులు ఉన్నారు. 44.46 లక్షల మంది పురుషులు కాగా, 42.62 లక్షల మంది మహిళా ఓటర్లు. 167 మంది థర్డ్ జండర్ ఓటర్లు ఉన్నారు. ఇక 4,27,813 మంది మొదటి సారి ఓటర్లు, 20.7 లక్షల మంది యువ ఓటర్లు. 11838 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నాం' అని రాజీవ్ కుమార్ వివరించారు. ఓటర్ల తుది జాబితాను 19న అమర్‌నాథ్ యాత్ర ముగిన తరువాత ఆగస్టు 20న ప్రకటించనున్నట్లు తెలిపారు. హర్యానాలో 90 అసెంబ్లీ స్థానాల్లో 17 ఎస్‌సి స్థానాలున్నాయి. మిగిలిన 73 స్థానాలు జనరల్ కేటగిరీ కిందకే వస్తాయి. హర్యానాలో 2,03,00,255 మంది ఓటర్లు ఉన్నారు. అందులో 2,01,90,184 మంది జనరల్ ఓటర్లు కాగా, 1,10,071 మంది సర్వీస్ ఓటర్లు ఉన్నారు. 4,70,460 మంది మొదటి సారి ఓటర్లు ఉన్నారు. 2,46,207 మంది 85 ఏళ్ళ దాటిన..వద్ధులు, 1,49,239 మంది దివ్యాంగులు ఉన్నారు. థర్డ్ జెండర్ ఓటర్లు 455 మంది ఉన్నారు. పోలింగ్ స్టేషన్లు 20,629 ఏర్పాటు చేస్తున్నారు.

హర్యానా ఎన్నికల షెడ్యూల్

హర్యానాలో మొత్తం 90 అసెంబ్లీ స్థానాలకు ఒకే విడతలో అక్టోబర్ 1న పోలింగ్ జరుగుతుంది. ఇందుకు గాను, సెప్టెంబర్ 5న నోటిఫికేషన్ విడుదలవుతుంది. సెప్టెంబర్ 12తో నామినేషన్ల దాఖలకు గడువు ముగుస్తుంది. సెప్టెంబర్ 13న నామినేషన్ల పరిశీలన జరుగుతుంది. 16తో నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగుస్తుంది. అక్టోబర్ 1న పోలింగ్ జరుగుతుంది.

జమ్మూకశ్మీర్ ఎన్నికల షెడ్యూల్

తొలి విడత పోలింగ్ సెప్టెంబర్ 18న జరుగుతుంది. ఇందుకోసం ఆగస్టు 20న నోటిఫికేషన్ విడుదలవుతుంది. ఆగస్టు 27తో నామినేషన్ల దాఖలకు గడువు ముగుస్తుంది. ఆగస్టు 28న నామినేషన్ల పరిశీలన ఉంటుంది. నామినేషన్ల ఉపసంహరణ గడువు ఆగస్టు 30తో ముగుస్తుంది. రెండో విడత పోలింగ్ సెప్టెంబర్ 25న జరుగుతుంది. ఇందుకోసం ఆగస్టు 29న నోటిఫికేషన్ విడుదలవుతుంది. సెప్టెంబర్ 5తో నామినేషన్ల దాఖలకు గడువు ముగుస్తుంది. సెప్టెంబర్ 6న నామినేషన్ల పరిశీలన జరుగుతుంది. సెప్టెంబర్ 9తో నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగుస్తుంది. మూడో విడత పోలింగ్ అక్టోబర్ 1న జరుగుతుంది. దీనితో పోలింగ్ ముగుస్తుంది. ఇందుకోసం సెప్టెంబర్ 5న నోటిఫికేషన్ వెలువడుతుంది. సెప్టెంబర్ 12తో నామినేషన్ల దాఖలకు గడువు ముగుస్తు ంది. సెప్టెంబర్ 13న నామినేషన్ల పరిశీలన జరుగతుంది. సెప్టెంబర్ 17తో నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగుస్తుంది. 90 అసెంబ్లీ స్థానాలకు గాను తొలి విడతలో 24 అసెంబ్లీ స్థానాలకు, రెండో విడతలో 26 అసెంబ్లీ స్థానాలకు, మూడో విడతలో 40 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ జరుగుతుంది.

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ తరువాత ప్రకటిస్తాం

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ తరువాత ప్రకటిస్తామని ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ అన్నారు. గతసారి మహారాష్ట్ర, హర్యానా అసెంబ్లీ ఎన్నికలను ఏకకాలంలో నిర్వహించామని, అప్పుడు జమ్మూకాశ్మీర్ ఎన్నికల అంశం తెరపైకి రాలేదని అన్నారు. ఈ ఏడాది నాలుగు ఎన్నికలు ఉన్నాయని, ఇవి పూర్తయిన వెంటనే ఐదో రాష్ట్రానికి అసెంబ్లీకి ఎన్నికలు ఉంటాయని చెప్పారు. జమ్మూకాశ్మీర్, హర్యానా, మహారాష్ట్ర, జారా?ండ్, ఢిల్లీ ఎన్నికలు వరుసగా జరగాల్సి ఉన్నాయని చెప్పారు. భద్రతా బలగాలు అందుబాటులో ఉండే విషయాన్ని పరిగణనలోకి తీసుకుని రెండేసి రాష్ట్రాల అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించినట్టు చెప్పారు. దీనికి తోడు, మహారాష్ట్రలో వర్షాలు కురుస్తుండటంతో పాటు వరుసగా..పిత పక్షం, దీపావళి, గణేష్ చతుర్థి పండుగలు ఉండటం కూడా కారణాలని చెప్పారు. వెంటనే ఎన్నికలు జరిగితే ఎన్నికల ప్రక్రియను క్లిష్టతరం చేస్తుందని అన్నారు. శాసనసభ పదవీకాలం ముగియడానికి ఆరు నెలల ముందు ఎన్నికలను షెడ్యూల్ చేసే వెసులుబాటు ఈసిఐకి ఉందని, అవసరమైన అన్ని సన్నాహాలు పూర్తయిన తరువాత మహారాష్ట్ర ఎన్నికలకు మరింత అనుకూలమైన సమయాన్ని ఎంచుకోవడానికి వీలు కల్పిస్తుంద ని అన్నారు.మహారాష్ట్ర ఎన్నికలకు సంబంధించిన షెడ్యూల్‌ను విడుదల చేయకుండా వాయిదా వేయడంపై శివసేన నేత ఆదిత్య ఠాక్రే విమర్శించారు. కేంద్ర ఎన్నికల సంఘం, కేంద్ర ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. కేంద్ర ఎన్నికల సంఘం రాజకీయ ఒత్తిళ్లకు లొంగిపోయిందని విమర్శించారు. జమ్మూకాశ్మీర్‌లో భద్రతను మెరుగుపరిచేందుకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న వాదనలను ఆయన ప్రశ్నించారు. మహారాష్ట్ర ఎన్నికల్లో జాప్యం అధికార పార్టీకి సిద్ధం కావడానికి మరింత సమయం ఇచ్చేందుకు వాయిదా వేశారని ఆదిత్య ఠాక్రే ఆరోపించారు. అయితే మహారాష్ట్ర ప్రజలు ఇప్పటికే లోక్‌సభ ఎన్నికల్లో ప్రస్తుత ప్రభుత్వాన్ని తిరస్కరించారని, మరోసారి అసెంబ్లీ ఎన్నికల్లో కూడా తిరస్కరిస్తారని స్పష్టం చేశారు.

ఎస్ఎస్ఎల్‌వీ-డీ3 ప్రయోగం సక్సెస్

(మొదటిపేజి తరువాయి)

పర్వతాలపై ఇది పర్యవేక్షించనుంది.

ఇస్రోకు చెందిన యూఆర్ రావు శాటిలైట్ సెంటర్‌లో ఈవోఎస్‌ను అభివద్ధి చేశారు. ఇందులో ఉండే ఎలక్ట్రో ఆప్టికల్ ఇన్‌ఫ్రారెడ్ (ఈవోఐఆర్) పేలోడ్ మిడ్-వేవ్, లాంగ్ వేవ్ ఇన్‌ఫ్రా-రెడ్‌లో చిత్రాలను క్యాప్చర్ చేస్తుంది. విపత్తు నిర్వహణలో ఈ సమాచారం ఉపయోగపడుతుందని ఇస్రో పేర్కొంది. ప్రయోగం విజయవంతం కావడంతో శాస్త్రవేత్తలను ఇస్రో ఛైర్మెన్ అభినందించారు.

తెగ తాగేస్తున్నారు

(మొదటిపేజి తరువాయి)

వెల్లడయ్యాయి. మద్యం వినియోగంలో నగరాలకు, పట్టణాలకు మధ్య.. పురుషులకు, స్త్రీలకు మధ్య ఉన్న వ్యత్యాసాలను ఈ సర్వే వెల్లడించింది. దేశంలో నగరాల్లో కంటే గ్రామాల్లోనే ఎక్కువగా మద్యం సేవిస్తున్నారని స్పష్టం చేసింది.ఈ సర్వే ప్రకారం...దేశంలో అత్యధికంగా పురుషులు మద్యం సేవిస్తున్న రాష్ట్రంగా అరుణాచల్ ప్రదేశ్ మొదటి స్థానంలో ఉంది. ఈ రాష్ట్రంలో 52.6 శాతం మంది మందుబాబులు మద్యం సేవిస్తున్నారు. తర్వాతి స్థానంలో తెలంగాణ రాష్ట్రం నిలిచింది. ఇక్కడ 43.4 శాతం మంది మద్యం సేవిస్తున్నారు. మూడో స్థానంలో సిక్కిం (39.9 శాతం), అండమాన్ (38.8 శాతం) ఉన్నాయి. ఆ తర్వాతి స్థానాల్లో వరుసగా మణిపూర్ (37.2 శాతం), గోవా (36.8 శాతం), ఛత్తీస్‌గఢ్ (34.7 శాతం) నిలిచాయి.

అతి తక్కువ తాగుబోతుల రాష్ట్రంగా లక్షద్వీప్

అలాగే అతి తక్కువ మద్యం సేవించే రాష్ట్రాల జాబితాలో లక్షదీప్ అగ్రస్థానంలో ఉంది. ఇక్కడ 0.4 శాతం మంది పురుషులు మాత్రమే మద్యం సేవిస్తున్నారు. ఆ తర్వాతి స్థానాల్లో గుజరాత్ (5.8 శాతం), జమ్మూ కశ్మీర్ (8.7 శాతం), రాజస్థాన్ (11 శాతం), మహారాష్ట్ర (13.9 శాతం), ఉత్తరప్రదేశ్ (14.5 శాతం) ఉన్నాయి.ఇక మహిళల పరంగా చూస్తే.. అత్యధికంగా అరుణాచల్ ప్రదేశ్‌లో 24.2 శాతం మంది మహిళలు మద్యం సేవిస్తున్నారు. తర్వాత స్థానాల్లో సిక్కిం (16.2 శాతం), అస్సాం (7.3 శాతం), తెలంగాణ (6.7 శాతం), జార్ఖండ్ (5.7 శాతం), అండమాన్ (5 శాతం), ఛత్తీస్‌గఢ్ (4.9 శాతం) ఉన్నాయి. దేశంలోని ఛత్తీస్‌గఢ్, ఉత్తరాఖండ్, మణిపూర్, మేఘాలయ, త్రిపుర, ఒడిశాలలో మద్యం సేవించే వారి సంఖ్య ఎక్కువగా ఉంది.

నాలుగు రాష్ట్రాల్లో కొనసాగుతున్న మద్యపాన నిషేధం

ప్రస్తుతం బీహార్, గుజరాత్, మిజోరాం, నాగాలాండ్ రాష్ట్రాల్లో మద్యపాన నిషేధం అమలులో ఉంది. మరికొన్ని రాష్ట్రాల్లో కూడా మద్యం విక్రయాలు జరుగుతున్నప్పటికీ మద్యానికి స్వస్తి పలకాలన్న డిమాండ్ వినిపిస్తోంది.

ఎమ్మెల్సీలుగా కోదండరాం,అమీర్ అలీఖాన్

(మొదటిపేజి తరువాయి)

తీసుకోలేదని చెప్పారు. ఎమ్మెల్సీ అవగానే తనకేమీ కొమ్ములు రాలేదనీ, తన ఆలోచనల్లో మార్పులేదన్నారు. ఎమ్మెల్సీ అమీర్ అలీఖాన్ మాట్లాడుతూ తనకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చేలా కృషి చేస్తానన్నారు.

ఇదిలా జరిగింది

గవర్నర్ కోటాలో కోదండరాంతోపాటు సియాసత్ న్యూస్ ఎడిటర్ అమేర్ అలీ ఖాన్‌ను కూడా సభ్యుడిగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనను అప్పటి గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ఆమోదించారు. దీంతో గవర్నర్ కార్యాలయం గురువారం ఈ మేరకు ప్రకటన చేసింది. వివిధ రంగాల్లో ప్రముఖులైన ప్రొఫెసర్ కోదండరాంను, అమేర్ అలీ ఖాన్‌ను మండలి సభ్యులుగా ప్రభుత్వం సిఫారసు చేసింది. గత ప్రభుత్వం దాసోజు శ్రావణ్, కుర్రా సత్యనారాయణలను గవర్నర్ కోటా కింద ఎమ్మెల్సీలుగా సిఫారసు చేసింది. వారి రాజకీయ నేపథ్యం కారణంగా ఆ ప్రతిపాదనను తమిళిసై తిరస్కరించిన విషయం విదితమే. ప్రస్తుతం వారి స్థానంలోనే కోదండరాం, అమీర్ అలీ ఖాన్‌ను నియమించారు.

ఫోర్త్ సిటీలో పెట్టుబడులు పెట్టండి

నవతెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో

హైదరాబాద్‌లో ఫోర్త్ సిటీలో పెట్టుబడులు పెట్టాలని, అందుకు అన్ని రకాల మద్దతు అందిస్తామని ఫాక్స్ కాన్ సంస్థ ఛైర్మెన్ యాంగ్ లియూకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి తెలిపారు. శుక్రవారం సీఎంతో, ఢిల్లీలోని ఆయన అధికారిక నివాసంలో యాంగ్ లియూ నేతృత్వంలోని ఫాక్స్ కాన్ ప్రతినిధి బృందం సమావేశమైంది. ఈ సందర్భంగా హైదరాబాద్ నగర చరిత్ర, పారిశ్రామిక సంస్థల విస్తరణకున్న అనుకూలత, అద్భుతమైన వాతావరణ పరిస్థితులు వంటి పలు అంశాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫాక్స్ కాన్ బృందానికి వివరించారు. ప్రభుత్వాలు మారినా పారిశ్రామిక అభివృద్ధిలో వైరుధ్యాలు లేకపోవడంతోనే హైదరాబాద్ వేగంగా పురోగతి చెందుతోందన్నారు. ఆ అభివృద్ధిని మరింతగా పరుగులు పెట్టించేందుకే తాము ప్రస్తుత ప్రపంచ అవసరాలకు తగినట్టు ఫ్యూచర్ సిటీ పేరుతో నాలుగో నగరానికి (ఫోర్త్ సిటీ) రూపకల్పన చేస్తున్నామని ముఖ్యమంత్రి వివరించారు. ఫోర్త్ సిటీలో విద్యా, వైద్యం, క్రీడా, ఎలక్ట్రానిక్స్-ఎలక్ట్రికల్, స్కిల్ డెవలప్‌మెంట్ ఇలా బహుముఖంగా అభివృద్ధి చేయనున్నామని చెప్పారు. ప్రస్తుత ప్రపంచానికి అవసరమైన స్కిల్స్‌ను యువతకు అందించేందుకు యంగ్ ఇండియా స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీని ప్రారంభిస్తున్నామన్నారు. స్కిల్ యూనివర్సిటీకి ఆనంద్ మహేంద్ర ఛైర్మెన్‌గా, మరో పారిశ్రామికవేత్త శ్రీనివాస రాజు వైస్ ఛైర్మెన్‌గా నియమించామని తెలిపారు. అంతర్జాతీయ విమానాశ్రయం, ఔటర్ రింగు రోడ్డు (ఓఆర్‌ఆర్), రీజినల్ రింగురోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్)తో పాటు హైదరాబాద్‌కు ఉన్న అన్ని అనుకూలతలను ముఖ్యమంత్రి వారికి వివరించారు. పారిశ్రామిక అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, అందిస్తున్న ప్రోత్సాహకాలు, ఇటీవల సీఎం నేతృత్వంలోని బందం అమెరికా, దక్షిణ కొరియాలో పర్యటించి దిగ్గజ పారిశ్రామిక సంస్థలతో జరిపిన చర్చలు, చేసుకున్న ఒప్పందాలను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు యాంగ్ లియూకి వివరించారు.

ఇండస్ట్రీ, సర్వీస్ సెక్టార్లతో పాటు అన్ని రంగాల్లో విస్తరించే సత్తా హైదరాబాద్ నగరానికి ఉందని, త్వరలోనే తన బృందంతో కలిసి హైదరాబాద్ నగరాన్ని సందర్శిస్తానని యాంగ్ లియూ తెలిపారు. ఫోర్త్ సిటీ రూపకల్పనలో ముఖ్యమంత్రి దార్శనికత, పారిశ్రామిక అనుకూల విధానాలు తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని సానుకూలంగా స్పందించారు. ఫోర్త్ సిటీతో పాటు పారిశ్రామిక అనుకూల విధానాల్లో మీ విజన్ అద్భుతంగా ఉందంటూ సీఎం రేవంత్ రెడ్డిని అభినందించారు. తన సందర్శన కంటే ముందు తమ చీఫ్ క్యాంపస్ ఆపరేషన్స్ ఆఫీసర్ క్యాథీ యాంగ్, సంస్థ ఇండియా ప్రతినిధి విలీ నేతృత్వంలోని బృందం హైదరాబాద్ వస్తుందని ఆయన చెప్పారు. భేటీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి (ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్) జయేష్ రంజన్, ప్రత్యేక కార్యదర్శి (ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ అండ్ ఎక్స్‌టర్నల్ ఎంగేజ్‌మెంట్) విష్ణువర్ధన్ రెడ్డి, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్స్ అండ్ ఎనర్జీ స్టోరేజ్ డాక్టర్ ఎస్కే శర్మ ఫాక్స్ కాన్ నుంచి సంస్థ ఎస్‌పీజీ ప్రెసిడెంట్ బాబ్ చెన్, సీబీజీ జీఎం జొ వూ, చీఫ్ క్యాంపస్ ఆపరేషన్స్ ఆఫీసర్ క్యాథీ యాంగ్, సీఎస్‌సీజీ డిప్యూటీ జీఎం సూ షో కూ, సీ-గ్రూప్ మేనేజర్ సైమన్ సంగ్, సంస్థ ఇండియా ప్రతినిధి విలీ తదితరులు పాల్గొన్నారు.

నిజాయితీకి మారు పేరు కోట్ల విజయభాస్కర్ రెడ్డి : రేవంత్ రెడ్డి

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు రెండు సార్లు ముఖ్యమంత్రిగా పని చేసిన కోట్ల విజయభాస్కర్ రెడ్డి నీతినిజాయితీలకు మారుపేరు అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనియాడారు. విజయభాస్కర్ రెడ్డి జయంతిని పురస్కరించుకొని ఢిల్లీలోని ఆయన అధికారిక నివాసంలో శుక్రవారం సీఎం రేవంత్ రెడ్డి కోట్ల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి పాల్గొన్నారు.

నిబంధనలకు సెబీ చీఫ్ పాతర



(మొదటిపేజి తరువాయి)

కార్యక్రమాల ద్వారా ప్రొఫెషనల్ ఫీజులు పొందడం 2008 సెబీ నిబంధనలను ఉల్లంఘించడమే అవుతుంది. సెబీ ఛైర్మెన్ ఇతర ఆదాయాలు ఆర్జించడంపై నిషేధం ఉంది." సింగపూర్ కంపెనీ రికార్డులను పరిశీలిస్తే మాధాబీ బచ్ మార్చి 2022లో అగోరా పార్ట్‌నర్స్‌లోని తన షేర్లన్నింటినీ తన భర్తకు బదిలీ చేసినట్లు హిండెన్‌బర్గ్ పేర్కొంది. అయితే 2024 మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన కంపెనీ రికార్డుల ప్రకారం.. మాధాబీ ఇప్పటికీ భారతీయ కన్సల్టింగ్ సంస్థలో వాటాలను కలిగి ఉన్నారు. ఈ ఆదాయాలకు అదానీ గ్రూప్‌తో ఏదైనా సంబంధం ఉందో.. లేదో తేలాల్సి ఉంది.

ఎల్ఆర్ఎస్ తీసుకోండి

(మొదటిపేజి తరువాయి)

వర్తిస్తుందని తెలిపారు. దీని నియమ నిబంధనలు 2020లోనే విడుదల చేశారనీ, అప్పటి పెండింగ్ దరఖాస్తుల ప్రాసెసింగ్‌ను 2024 జనవరిలో ప్రారంభించినట్టు వివరించారు. ఇప్పటివరకు 4,28,832 దరఖాస్తులు ప్రాసెస్ చేయగా, వాటిలో 60,213 దరఖాస్తులు ఆమోదించి, రూ.96.60 కోట్ల సొమ్ము వసూలు చేసినట్టు తెలిపారు. 75 శాతం దరఖాస్తుల్లో పూర్తి స్థాయి డాక్యుమెంట్లు సమర్పించక షార్ట్‌ఫాల్స్‌తో ఉండటం వల్ల, వాటిని అప్‌లోడ్ చేయాలని దరఖాస్తుదారులకు తెలిపామని చెప్పారు. ప్రాసెస్‌ను వేగవంతం చేసేందుకు మున్సిపాలిటీ, కార్పొరేషన్, నగరాభివృద్ధి సంస్థల నుంచి అధికారిక షార్ట్‌ఫాల్స్ లెటర్ కోసం వేచిచూడకుండా పూర్తి స్థాయి డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేయాలని కోరారు. ఎల్ఆర్ఎస్ పోర్టల్‌లో దరఖాస్తుదారులకు షార్ట్‌ఫాల్ డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేయడానికి సౌకర్యం కల్పించామన్నారు. సేల్ డీడ్, ఈసీ, మార్కెట్ విలువ సర్టిఫికెట్, లేఔట్ కాపీ వంటి డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేయాలని చెప్పారు. దరఖాస్తుదారులు తమ మొబైల్ నంబర్, చిరునామా లేదా ఇతర దరఖాస్తు వివరాలను మొబైల్ నంబర్ ఓటీపీ వినియోగించుకుని సవరించుకోవచ్చు. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, నగరాభివృద్ధి సంస్థలు, జిల్లా కలెక్టర్ కార్యాలయాల్లో హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. దరఖాస్తుదారుల సందేహాలకు ఇక్కడ వివరణ దొరుకుతుందని తెలిపారు. 2020లో జారీ చేసిన జీవో 131, జీవో 135 ప్రకారం రాష్ట్రంలో అక్రమ లేఅవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణకు ఈ నియమ నిబంధనలు వర్తిస్తాయి. 2020 ఆగస్టు 26 కంటే ముందు రిజిస్ట్రర్ చేసిన లేఅవుట్లకు మాత్రమే ఎల్ఆర్ఎస్ వర్తిస్తుంది. 2020 అక్టోబరు 15వ తేదీలోపు స్వీకరించిన దరఖాస్తులనూ పరిగణనలోకి తీసుకుంటారు.

నవచిత్రం



జాతీయ ఉత్తమ నటుడు : రిషబ్ శెట్టి
జాతీయ ఉత్తమ దర్శకుడు : సూరజ్ బర్జాత్యా



జాతీయ ఉత్తమ నటి :
మానసి పరేఖ్, నిత్యామీనన్



ఉత్తమ కొరియోగ్రాఫర్ : జానీ మాస్టర్
ఉత్తమ నేపథ్య సంగీతం : ఏ.ఆర్.రెహ్మాన్

జాతీయ ఉత్తమ చిత్రం ఆట్టమ్

ఉత్తమ ప్రాంతీయ తెలుగు చిత్రం కార్తికేయ 2

70వ జాతీయ చలన చిత్ర పురస్కారాలను కేంద్ర ప్రభుత్వం శుక్రవారం ప్రకటించింది. జాతీయ ఉత్తమ చిత్రంగా మలయాళ సినిమా 'ఆట్టమ్' ఎంపికైంది. ఉత్తమ నటుడి పురస్కారం 'కాంతార' చిత్రానికిగాను రిషబ్‌శెట్టికి దక్కగా, ఉత్తమనటి పురస్కారానికి నిత్యా మీనన్ (తిరుచిత్రంబళం), మానసి పరేఖ్ (కచ్ ఎక్స్‌ప్రెస్)ను జ్యూరీ సంయుక్తంగా ఎంపిక చేసింది.
ఇక జాతీయ ఉత్తమ దర్శకుడిగా 'ఉంచాయి' హిందీ చిత్రానికిగాను సూరజ్ బర్జాత్యాని వరించింది. జ్యూరీ అధ్యక్షుడు రాహుల్ రావిల్ శుక్రవారం న్యూఢిల్లీలోని నేషనల్ మీడియా సెంటర్‌లో 70వ జాతీయ చలన చిత్ర పురస్కారాల విజేతల వివరాలను ప్రకటించారు.
2022లో దేశవ్యాప్తంగా సుమారు 28 భాషల్లో విడుదలైన 300కు పైగా చిత్రాల నుంచి నామినేషన్ అందాయి. 11 మందితో కూడిన జ్యూరీ పరిశీలించి ఈ అవార్డులను అనౌన్స్ చేసింది. అందులో తెలుగుకు సంబంధించి 20 చిత్రాలు ఉన్నాయి. కానీ ఒకే ఒక్క అవార్డ్ టాలీవుడ్‌కు రావడంతో, ప్రపంచవ్యాప్తంగా టాప్‌లో దూసుకెళుతోన్న తెలుగు సినిమా ఇండస్ట్రీకి ఈ అవార్డులలో సరైన గుర్తింపు దక్కలేదంటూ సోషల్ మీడియా వేదికగా పలువురు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.



జాతీయ ఉత్తమ చిత్రం : ఆట్టమ్ (మలయాళం)


మనిషి నైజానికి ప్రతిబింబం

దర్శకుడు ఆనంద్ ఇకర్షి తెరకెక్కించిన మలయాళ చిత్రం 'ఆట్టమ్'. 13 మంది నాటక బృందంలో ఒకే ఒక మహిళ ఉంటుంది. ఆ బృందంలోని ఒకతను ఓ రోజు రాత్రి ఆమెను అసభ్యంగా తాకుతాడు. ఆ 12 మందిలో ఆమెతో తప్పుగా వ్యవహరించిన వ్యక్తి ఎవరు?, అతన్ని ఆమె ఎలా గుర్తించింది అనేదే ఈ చిత్రకథ. పైకి అందరితో మంచిగా ఉంటూనే సమయాన్ని బట్టి ఊసరవెల్లిలా రంగులు మార్చే మనిషి నైజానికి ప్రతిబింబంగా రూపొందిన 'ఆట్టమ్' జ్యూరీ సభ్యులను మెప్పించి జాతీయ ఉత్తమ చిత్రంగా నిలిచింది.

69వ జాతీయ చలన చిత్ర పురస్కారాల్లో ఆరు అవార్డులతో తెలుగు సినిమా విజయకేతనాన్ని ఎగుర వేసింది. అయితే 70వ జాతీయ చలన చిత్ర పురస్కారాల్లో కేవలం ఒకే ఒక్క అవార్డుతో సరిపెట్టుకోవడం గమనార్హం. మణిరత్నం దర్శకత్వం వహించిన 'పొన్నియన్ సెల్వన్ 1' చిత్రం 4 విభాగాల్లో అవార్డులను గెల్చుకుంది.

70వ జాతీయ చలన చిత్ర పురస్కార విజేతలు

ఉత్తమ చిత్రం: ఆట్టమ్ (మలయాళం)
ఉత్తమ నటుడు: రిషబ్ శెట్టి (కాంతార - కన్నడ)
ఉత్తమ నటి:
నిత్యా మీనన్ (తిరుచిత్రంబళం - తమిళం),
మానసి పరేఖ్ (కచ్ ఎక్స్‌ప్రెస్ - గుజరాతీ)
ఉత్తమ దర్శకుడు: సూరజ్ బర్జాత్యా
(ఉంచాయి - హిందీ)
ఉత్తమ సహాయ నటుడు:
పవన్ రాజ్ మల్హోత్రా (ఫౌజా - హరియాన్వి)
ఉత్తమ సహాయ నటి:
నీనా గుప్తా (ఉంచాయి- హిందీ)
ఉత్తమ హోల్‌సమ్ ఎంటర్‌టైన్మెంట్: కాంతార (కన్నడ)
ఉత్తమ విజువల్ ఎఫెక్ట్స్ సినిమా:
బ్రహ్మాస్త్ర - పార్ట్ 1: శివ (హిందీ)
బెస్ట్ ఫిమేల్ ప్లే బ్యాక్ సింగర్ :
బాంబే జయశ్రీ (చాయుమ్ వెయిల్),
సౌదీ వెళ్లక్క సీసీ 225/2009
ఉత్తమ ప్లే బ్యాక్ సింగర్ :
అర్జిత్ సింగ్ (కేసరియా) బ్రహ్మాస్త్ర- పార్ట్ 1
బెస్ట్ యాక్షన్ డైరెక్షన్: అన్బరివు (కేజీయఫ్ 2)
బెస్ట్ కొరియోగ్రఫీ:
జానీ మాస్టర్, సతీష్ కృష్ణన్ తిరుచిత్రంబళం (తమిళం)
ఉత్తమ సంగీతం (పాటలు):
బ్రహ్మాస్త్ర: శివ (హిందీ) - ప్రీతమ్
ఉత్తమ సంగీతం (నేపథ్యం): ఏఆర్ రెహమాన్
పొన్నియిన్ సెల్వన్ - 1 (తమిళం)
ఉత్తమ ప్రాంతీయ చిత్రం (ఒడియా): దమన్
ఉత్తమ ప్రాంతీయ చిత్రం (మలయాళం):
సౌది వెళ్లక్క సీసీ 225/2009
ఉత్తమ ప్రాంతీయ చిత్రం (మరాఠీ): వాల్వీ (ది టెర్మైట్)
ఉత్తమ ప్రాంతీయ చిత్రం (కన్నడ): కేజీయఫ్ 2
ఉత్తమ ప్రాంతీయ చిత్రం (హిందీ) : గుల్‌మోహర్
ఉత్తమ ప్రాంతీయ చిత్రం (బెంగాలీ): కబేరి అంతర్ధాన్
ఉత్తమ ప్రాంతీయ చిత్రం (తమిళం):
పొన్నియిన్ సెల్వన్ - 1
ఉత్తమ ప్రాంతీయ చిత్రం (పంజాబీ): బాగీ డి దీ
బెస్ట్ బుక్ ఆన్ సినిమా:
కిషోర్ కుమార్ (ది అల్టిమేట్ బయోగ్రఫీ)
రైటర్స్ :అనిరుద్ధ భట్టాచార్జీ, పార్థివ్ ధార్
బెస్ట్ క్రిటిక్ : దీపక్ దువా



పీపుల్ మీడియా ఫ్యాక్టరీకి మైల్ స్టోన్ మూమెంట్

'కార్తికేయ2' చిత్రానికి జాతీయ ప్రాంతీయ ఉత్తమ చిత్రంగా నేషనల్ అవార్డ్ రావడం మా పీపుల్స్ మీడియా సంస్థకు మైల్‌స్టోన్ మూమెంట్' అని అన్నారు నిర్మాత టీజీ విశ్వప్రసాద్.
నిఖిల్ సిద్ధార్థ్ హీరోగా చందూ మొండేటి దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ బ్యానర్స్ పై నిర్మాతలు టీజీ విశ్వప్రసాద్, అభిషేక్ అగర్వాల్ నిర్మించిన చిత్రం 'కార్తికేయ2'. నిర్మాత అభిషేక్ అగర్వాల్ మాట్లాడుతూ,'కృష్ణ ఈజ్ ట్రూత్. ఈ రోజు మరోసారి ప్రూవ్ అయ్యింది. ఈ అవార్డ్ కృష్ణుడే తీసుకొచ్చారని భావిస్తున్నాను' అని తెలిపారు.
'కార్తికేయ2 అద్భుత విజయం సాధించినప్పుడు ఎంత హ్యాపీగా ఫీలయ్యామో ఇప్పుడు అదే ఫీలింగ్‌లో ఉన్నాం. నేషనల్ అవార్డ్ మరింత బాధ్యతని పెంచింది. కార్తికేయ3 ఖచ్చితంగా ఉంటుంది' అని డైరెక్టర్ చందూ మొండేటి చెప్పారు.



టీజీ విశ్వప్రసాద్, చందూ మొండేటి, అభిషేక్ అగర్వాల్

చాలా సంతోషంగా ఉంది

ఇప్పుడే ఓ అద్భుతమైన వార్త విన్నా. మా 'కార్తికేయ2' చిత్రానికి జాతీయ అవార్డు రావడం చాలా ఆనందంగా ఉంది. ఈ సినిమా ఇంత గొప్పగా సక్సెస్ కావడానికి, ఈ అవార్డు రావడానికి మీ టీమ్ ఎఫర్టే కారణం.
- హీరో నిఖిల్

ఆయ్‌ని

ఆడియెన్స్ ఎంజాయ్ చేస్తున్నారు



బన్నీ వాస్

నార్నే నితిన్, నయన్ సారికలు హీరో, హీరోయిన్లుగా జీఏ2 పిక్చర్స్ బ్యానర్‌పై అల్లు అరవింద్ సమర్పణలో బన్నీవాస్, విద్యా కొప్పినీడి నిర్మాతలుగా వచ్చిన చిత్రం 'ఆయ్'. ఈ సినిమాకు అంజి కే మణిపుత్ర దర్శకత్వం వహించారు. ఈనెల 15న ఈ చిత్రాన్ని గ్రాండ్‌గా విడుదల చేశారు. ప్రేక్షకుల విశేష ఆదరణతో సినిమా సూపర్ హిట్ టాక్ తెచ్చుకుంది. అలాగే ప్రతి షోకి థియేటర్ల సంఖ్యనూ పెంచు కుంటోంది. ఈ సందర్భంగా నిర్మాత బన్నీ వాస్ మీడియాతో తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన పలు విశేషాలను షేర్ చేసుకున్నారు.

- అనీల్ రావిపూడిగారి డైరెక్షన్ టీమ్‌లో డైరెక్టర్ అంజి చాలా సినిమాలకు వర్క్ చేశారు. ఈ కథని అంజి చెబుతున్నప్పుడు రెండున్నర గంటలు నాన్‌స్టాప్‌గా నవ్వాను. కూకట్‌పల్లి విశ్వనాథ్ థియేటర్‌లో సినిమా రిలీజ్ తర్వాత ఆడియెన్స్‌తో కలిసి చూస్తున్నప్పుడు నా ఎదురు సీట్‌లో ఉన్న వ్యక్తి నవ్వలేక లేచి నిలుచున్నాడు. అప్పుడర్థమైంది. నేను కథ విన్నప్పుడు ఏదైతే ఫీలయ్యానో అది నిజమైందనిపించింది.
- నేను కథ విన్నప్పుడు ఎలాగైతే ఎంజాయ్ చేశానో దాన్ని స్క్రీన్ పై చూసి ఆడియెన్స్ ఎంజాయ్ చేస్తున్నారు. అప్పుడే గట్టిగా కొట్టేశామనిపించింది. ఫస్టాఫ్ చివరి అర్ధగంట థియేటర్స్‌లో ఒకటే నవ్వులు.
- సినిమా పక్కా ఎంటర్‌టైనర్. కథ కన్నా ఎంటర్‌టైన్మెంట్, గుడ్ మూమెంట్స్ అన్నీ ఉన్నాయి. అయితే ఈరోజున్న ట్రెండ్‌కి అవి మాత్రమే సరిపోవు. అమలాపురం వంటి ఏరియాలో సినిమాను చేసేటప్పుడు చిన్న క్లాస్ టచ్ ఉండాలని అందరం అనుకున్నాం. అందుకోసం వర్షం ఉంటే బావుంటుందని నిర్ణయించుకున్నాం. దాన్ని ఒక సబ్జెక్ట్‌గా యాడ్ చేసుకుంటూ వచ్చాం.
- ఆయ్ సినిమా వంటి ఎంటర్‌టైనర్‌ను చేసినప్పుడు మామూలుగా యూత్‌కు కనెక్ట్ అవుతుంది. ఓ జోనర్ ఆడియెన్స్‌కే కనెక్ట్ అయితే వారమో, రెండు వారాలో ఆడుతుంది. అదే అందరికీ కనెక్ట్ అయ్యేలా ఉండటం కోసం ఎంటర్‌టైన్‌మెంట్ యాంగిల్ నుంచి ఎమోషనల్‌గా మార్చాం. దీంతో సినిమా అందరికీ కనెక్ట్ అయ్యింది. హీరో నార్నే నితిన్‌తో పాటు ఇందులో నటించిన ప్రతి పాత్ర అద్భుతంగా నటించింది.

ఆటలు



జంబో జట్టుకు విజయోస్తు

పారిస్ బరిలో 84 మంది పారా అథ్లెట్లు

న్యూఢిల్లీ : పారిస్ 2024 పారాలింపిక్స్‌లో పోటీపడే భారత పారా అథ్లెట్లకు కేంద్ర క్రీడామంత్రిత్వ శాఖ ఘనంగా వీడ్కోలు పలికింది. ఆగస్టు 28 నుంచి సెప్టెంబర్ 8 వరకు పారిస్‌లో జరుగనున్న పారాలింపిక్స్‌లో భారత్ నుంచి 84 మంది పారా క్రీడాకారులు పోటీపడనున్నారు. పారాలింపిక్స్‌లో భారత్ నుంచి తొలిసారి జంబో జట్టు బరిలో నిలిచింది. ఆర్చరీ, అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, కానోయింగ్, సైక్లింగ్, బ్లైండ్ జూడో, పవర్‌లిఫ్టింగ్, రోయింగ్, షూటింగ్, స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్, తైక్వాండో సహా 12 క్రీడాంశాల్లో భారత పారా అథ్లెట్లు పతక వేట సాగించనున్నారు. క్రీడాంశాల షెడ్యూల్ ప్రకారం పారా అథ్లెట్లు పారిస్‌కు బయల్దేరనుండగా.. శుక్రవారం న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో పారా అథ్లెట్లకు కేంద్ర క్రీడాశాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ, పారాలింపిక్ కమిటీ ఆఫ్ ఇండియా (పీసీఐ) అధ్యక్షుడు దేవంద్ర, క్రీడా అధికారులు ఘనంగా వీడ్కోలు పలికారు. పారా అథ్లెట్ల విజయగాథలతో కూడిన 'బ్రేకింగ్ ది బారియర్స్' పుస్తకాన్ని క్రీడాశాఖ మంత్రి ఈ సందర్భంగా ఆవిష్కరించారు.
'సవాళ్లను అవకాశాలుగా మలచుకుని విజయాలు సాధించటంలో మన పారా అథ్లెట్లు దిట్ట. పారిస్ పారాలింపిక్స్ సన్నద్ధతలో మనోళ్లు గొప్ప అంకితభావం, పట్టుదల చూపించారు. ఖేలో ఇండియా కార్యక్రమంతో ఎంతో మంది అథ్లెట్లకు ఆర్థికంగా సాయం అందింది. విశ్వక్రీడా వేదికపై రాణించేందుకు అవసరమైనా సహకారం అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. పారాలింపిక్స్‌లో పతకాలతో దేశం గర్వపడేలా చేయాలని ఆశిస్తున్నాను' అని క్రీడాశాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ అన్నారు. టోక్యో 2020 పారాలింపిక్స్‌లో టీమ్ ఇండియా 19 పతకాలు సాధించింది. పారిస్‌లో 84 మందితో బరిలోకి దిగుతున్న భారత్.. టోక్యో రికార్డును అధిగమించేందుకు రంగం సిద్ధం చేసుకుంది.

2028లో అదే మన లక్ష్యం

పారిస్ చెఫ్‌డీ మిషన్ గగన్ నారంగ్



న్యూఢిల్లీ : పారిస్ 2024 ఒలింపిక్స్ విజయవంతంగా ముగిశాయి. భారత్ నుంచి 117 మంది క్రీడాకారులు 16 క్రీడాంశాల్లో పోటీపడ్డారు. ఓ సిల్వర్, ఐదు కాంస్య పతకాలు సహా భారత్ ఆరు మెడల్స్ సొంతం చేసుకుంది. పారిస్ ఒలింపిక్స్‌లో భారత ప్రదర్శన, సాధించిన పతకాల పట్ల టీమ్ ఇండియా చెఫ్ డీ మిషన్ గగన్ నారంగ్ సంతృప్తి వ్యక్తం చేశారు. పారిస్ నుంచి స్వదేశం చేరుకున్న గగన్ నారంగ్.. 2028 లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్‌లో భారత్ అనుసరించాల్సిన వ్యూహం, పారిస్ ఒలింపిక్స్‌లో మన అథ్లెట్ల ప్రదర్శన నుంచి నేర్చుకోవాల్సిన పాఠాలపై త్వరలోనే భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ), భారత క్రీడామంత్రిత్వ శాఖకు నివేదికను అందజేయనున్నారు. 'పారిస్ ఒలింపిక్స్‌లో పతకాలు సాధించిన మన అథ్లెట్లకు అభినందనలు. ఆరు పతకాలు సాధించిన అభినందనీయం. భారత్ మరిన్ని పతకాలు సాధించగలదని వ్యక్తిగతంగా నా అభిప్రాయం. ఆరు విభాగాల్లో భారత్ నాల్గో స్థానంలో నిలిచి పతకం చేజార్చుకుంది. ఈ ఫలితాల నుంచి మనం పాఠాలు నేర్చుకోవాలి. రానున్న ఒలింపిక్స్‌లో ఈ స్వల్ప వ్యత్యాసాలను ఎలా అధిగమించాలనే అంశంపై ఫోకస్ పెట్టాలి. 2028 ఒలింపిక్స్ రోడ్‌మ్యాప్‌లో భాగంగా బలమైన క్రీడా సంస్కృతి పెంపొందించాలి, లాస్ ఏంజిల్స్‌లో భారత్ నుంచి వీలైనంత ఎక్కువ మంది అథ్లెట్లను బరిలోకి దింపటమే మన లక్ష్యంగా ఉండాలి' అని గగన్ నారంగ్ అన్నారు.

దంగల్ మళ్లీ షురూ!

- రెజ్లింగ్ సమాఖ్యపై వేటు
- ఢిల్లీ హైకోర్టు కీలక ఆదేశాలు



నవతెలంగాణ-న్యూఢిల్లీ

భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) వివాదం మళ్లీ రాజుకుంది. బీజెపి మాజీ ఎంపీ, డబ్ల్యూఎఫ్ఐ మాజీ అధ్యక్షుడు అనుచరుడు సంజయ్ సింగ్ సారథ్యంలోని భారత రెజ్లింగ్ ఫెడరేషన్‌ను.. రెజ్లింగ్ వ్యవహారాల నుంచి ఢిల్లీ హైకోర్టు తప్పించింది. భారత అగ్రశ్రేణి మల్లయోధులు బజరంగ్ పూనియా, వినేశ్ ఫోగట్, సాక్షి మాలిక్, సత్యవర్త్‌లు దాఖలు పటిషన్‌ను విచారించిన ఏకసభ్య ధర్మాసనం.. సంజయ్ సింగ్ నేతృత్వంలోని డబ్ల్యూఎఫ్ఐని బాధ్యతల నుంచి తప్పించింది. గతంలో భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) ఏర్పాటు చేసిన అడ్‌హాక్ కమిటీ తిరిగి రెజ్లింగ్ వ్యవహారాలను పర్యవేక్షించాలని జస్టిస్ సచిన్ దత్తా కీలక ఆదేశాలు జారీ చేశారు. ఐఓఏ అడ్‌హాక్ ప్యానల్‌ను ఏప్రిల్ 4న రద్దు చేసింది. ఢిల్లీ హైకోర్టు ఆదేశాలతో బూపిందర్ సింగ్ బజ్వా సారథ్యంలో మళ్లీ అడ్‌హాక్ కమిటీ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఏర్పడింది.

సవాల్ చేస్తాం

ఢిల్లీ హైకోర్టు మధ్యంతర ఆదేశాలపై సంజయ్ సింగ్ స్పందించారు. మధ్యంతర తీర్పుపై డివిజన్ బెంచ్‌లో సవాల్ చేస్తామని వెల్లడించారు. ' ఈ తీర్పును ద్వి సభ్య ధర్మాసనం ముందుకు తీసుకెళ్తాం. ఐఓఏ గతంలోనే అడ్‌హాక్ కమిటీని రద్దు చేసింది. ఈ అంశంలో యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ (యుడబ్ల్యూడబ్ల్యూ), అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ)లను సైతం సంప్రదిస్తాం. ఐఓఏ ప్యానల్ పర్యవేక్షణతో రెజ్లింగ్ సమాఖ్యలో బయటి శక్తుల జోక్యం ఉంటుంది. ఇది రెజ్లింగ్ క్రీడాకారులపై ప్రభావం చూపిస్తుంది. త్వరలో రెండు ప్రపంచ చాంపియన్‌షిప్ పోటీలు రానున్నాయి.
ఈ టోర్నీల్లో భారత రెజ్లర్ల ప్రాతినిథ్యం సైతం ప్రమాదంలో పడే అవకాశం ఉంది. యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ మరోసారి డబ్ల్యూఎఫ్ఐపై నిషేధం వేసేందుకు వెనుకాడబోదు' అని సంజయ్ సింగ్ అన్నారు. గతంలో ఏప్రిల్ 25న భారత రెజ్లింగ్ సమాఖ్యకు రాసిన లేఖలో.. అడ్ హాక్ కమిటీ పరిపాలనను యుడబ్ల్యూడబ్ల్యూ ఆమోదించబోదని స్పష్టంగా పేర్కొన్న విషయాన్ని సంజయ్ సింగ్ గుర్తు చేశారు.

నిరోషన్‌పై నిషేధం

డోప్ పరీక్షలో దొరికిన క్రికెటర్



కొలంబో : శ్రీలంక క్రికెటర్ నిరోషన్ డిక్‌వెల్లాపై నిషేధం వేటు పడింది. డోపింగ్‌లో పట్టుబడిన నిరోషన్‌పై నిషేధం విధిస్తున్నట్లు శ్రీలంక క్రికెట్ బోర్డు ఓ ప్రకటనలో తెలిపింది. లంక ప్రీమియర్ లీగ్ (ఎల్‌పీఎల్) 2024లో భాగంగా నిరోషన్ శాంపిల్స్ సేకరించారు. నిరోషన్ డోప్ పరీక్షలో పాజిటివ్‌గా తేలటంతో.. అతడిపై తక్షణమే అమల్లోకి వచ్చేలా శ్రీలంక యాంటీ డోపింగ్ ఏజెన్సీ నిషేధం విధించింది. తదుపరి విచారణ కొనసాగే వరకు ఈ నిషేధం అమల్లో ఉండనుంది. 31 ఏండ్ల నిరోషన్ వివాదాలకు కొత్త కాదు. గతంలో ఎల్‌పీఎల్ 2021 సందర్భంగా బయో బబుల్ ప్రోటోకాల్‌ను సైతం ఉల్లంఘించాడు. జాతీయ జట్టులోనూ క్రమశిక్షణ పాటించకపోవటంతో విమర్శలు ఎదుర్కొన్నాడు. శ్రీలంక జాతీయ జట్టు తరఫున నిరోషన్ టెస్టులు, వన్డేలు, టీ20ల్లో ప్రాతినిథ్యం వహించాడు.

ఆఖర్లోనే ప్రజ్ఞానంద

గ్రాండ్ చెస్ టూర్ 2024



సెయింట్ లూయిస్ (యుఎస్ఏ) : భారత వర్ధమాన గ్రాండ్‌మాస్టర్ ఆర్. ప్రజ్ఞానంద అంచనాలను అందుకోవటం లేదు. సెయింట్ లూయిస్ ర్యాపిడ్, బ్లిట్జ్ చెస్ టోర్నమెంట్‌లో చెన్నై చిన్నోడు ఆఖరు స్థానంలో కొనసాగుతున్నాడు. ర్యాపిడ్ విభాగం అనంతరం ఆఖరు స్థానంలో నిలిచిన ప్రజ్ఞానంద.. బ్లిట్జ్ పోటీల ఆరంభ రోజు పెద్దగా ఆకట్టుకోలేదు. 6.5 పాయింట్లతో పదో స్థానంలో కొనసాగుతున్నాడు. అలిరెజా (ఫ్రాన్స్) 17.5 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతుండగా.. ఇయాన్, వెస్లీలు 16 పాయింట్లతో వరుసగా 2, 3 స్థానాల్లో నిలిచారు. హికారు నకమురు (13.5), ఫాబియానో (యుఎస్ఏ)లు ఆరు, ఏడు స్థానాలకు పరిమితం అయ్యారు.



పాలనే కాదు... చదువు ముఖ్యమే
ప్రజాభవన్‌లో ఎల్ఎల్ఎం పరీక్షలకు ప్రిపేరవుతున్న మంత్రి సీతక్క

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.